UNIVERSAL LIBRARY
OU_206114
UNIVERSAL LIBRARY

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T320/G19N Accession No. T3217

Author [illegible]

Title [illegible]

This book should be returned on or before the date last marked below

# నిర్మాణ కార్యక్రమము

★

"నిర్మాణ కార్యక్రమానికి పూనుకొన్న ప్రజా సేవకుడు కొంతవరకు అఖిల భారత రాజకీయ ములకుగూడ మార్గము చూపగల విజ్ఞానమును, విశాలదృష్టిని కలిగి ఉండవలెను. మన ఏడులక్షల గ్రామములును ఈ విశ్వాసముతోను పట్టుదలతోను కార్యాచరణమునకు పూనుకొన్నట్లయితే మన కీ దాస్యము దానంతటదే పటాపంచలై పోగలదు. ప్రతి గ్రామమును స్వయం పోషకంగాను, స్వతంత్రంగాను తయారు కావలెను. అదే నిజమయిన స్వరాజ్యము. అదే నిజమైన ప్రజాస్వామ్య ప్రభుత్వమును నెలకొల్పగలదు."

మహాత్మాగాంధి

వెల 12 అణాలు.

★

జాతీయ జ్ఞానమందిరము,
త్యాగరాయనగరము :: మద్రాసు.

# నిర్మాణ కార్యక్రమము.

అంటే? - గాంధిజీ

ఎందుకు? - రాజేంద్రబాబు

అనువాదం:

గాంధీజీ . మోటూరి సత్యనారాయణ

రాజేంద్రబాబు ... పూటుకూరి నరసింహారావు

(ఈ గ్రంథమంతయూ చేతిలో చేసిన కాగితముమీద అచ్చు వేయబడును)

జాతీయ జ్ఞానమందిరము

త్యాగరాయనగరం :: మద్రాసు

1946

హిందీ ప్రచార్ ప్రెస్,
త్యాగరాయనగర్,
మద్రాస్.

# జాతీయ జ్ఞాన మందిరము
## మద్రాసు

ప్రధాన సంపాదకుడు. శ్రీ మాగంటి బాపినీడుగారు

గౌరవ సంపాదకవర్గం

డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు

ఆచార్య గోగినేని రంగనాయకులుగారు.

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు.

శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు.

ఆచార్య మామిడిపూడి వెంకట రంగయ్యగారు

శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు

శ్రీ మోటూరి సత్యనారాయణగారు

# జాతీయ జ్ఞాన మందిరము

## ఆశయములు

1. జాతీయ పునరుజ్జీవన కరములైన శాస్త్ర విషయక గ్రంథములను ఆయా శాఖలలో ప్రత్యేక ప్రావీణ్యమును సంపాదించిన విద్వాంసులులచే వ్రాయించి, ప్రకటించుట.

2. ఇతర భాషలయందలి ఉత్తమ రాజకీయ, సాంఘిక, వైజ్ఞానిక శాస్త్ర గ్రంథములను తెలుగులోనికి అనువాదము చేయించి ప్రకటించుట.

3. ఉత్తమ గ్రంథకర్తల ఉత్తమ రచనలనుకూడ తగిన పారితోషిక మిచ్చి, తీసికొని ప్రకటించుట.

4. ప్రజా సామాన్యములో జాతీయ విజ్ఞానమును వృద్ధిజేసి భారత జాతీయ వికాసమునకు తోడ్పడుట.

5. జిజ్ఞాసువుల జ్ఞానాభివృద్ధికై క్రమాను గతముగ సమస్త విషయములగూర్చియు సారస్వతమును తయారు చేయించి ప్రకటించుట.

# జాతీయ జ్ఞాన మందిరము వారి

# గ్రంథములు

వెలువడినవి :

- కాంగ్రెసు షష్టిపూర్తి
- జై హింద్
- నిర్మాణ కార్యక్రమము

త్వరలో రానున్నవి :

- ప్రజా పరిషత్తు
- ఇండొనీసియా
- మన రాష్ట్రపతి అజాద్
- మన కవి రవీంద్రుడు
- మన నాయకుడు మహాత్మాజీ
- మానవుని ప్రాథమిక స్వత్వములు
- ఆర్థిక ప్రణాళికలు
- ఆంధ్ర వీరాంగనలు
- కార్యదర్శి కార్యకలాపం
- పాకిస్థాన్
- నేటి రాజకీయ తత్వాలు

ప్రచురణ :

## హిందీ ప్రచార సభ

త్యాగరాయనగరం, మదరాసు.

# తొలిపలుకు

నిర్మాణ కార్యక్రమం అంటే సమస్త భారతజాతిని మానసికం గానూ, ఆర్థికంగానూ స్వరాజ్య ప్రాప్తికోసం తయారుచేయడం అన్న మాట. అందువల్లనే గాంధీమహాత్ములు దక్షిణ ఆఫ్రికానుంచివచ్చిన నాటి నేటివరకు సమస్త శక్తుల్నీ నిర్మాణ కార్యక్రమ సిద్ధికోసం విని యోగిస్తున్నారు. ఇందుకై 15 అంశాలను చేర్చి కార్యక్రమాన్ని తయారు చేశారు. దీనిని మరిమూడు అంశాలను కాంగ్రెస్ ఆమో దించి అమలులోనికి తేవటానికి ప్రయత్నం చేస్తున్నది.

ఈ అంశాలన్నీ విపులంగానూ, విరివిగానూ ప్రజలకు అందు బాటులో వుండేటట్లు, అర్థం అయేటట్టుచేయటానికి స్వయంగా ఆయన ఒక పుస్తకం వ్రాశారు. ఈ పుస్తకానికి విపులమైన వ్యాఖ్య శ్రీ రాజేంద్రబాబు వ్రాశారు. ఆంధ్ర దేశంలో నిర్మాణ కార్యక్రమమునకు ప్రధాన నాయకుడు డా. పట్టాభిగారు.

గాంధీ మహాత్ముని సూత్రాలు, రాజేంద్రబాబు వ్యాఖ్య, డా. పట్టాభిగారి పీఠిక, ఈ మూడు చేరిస్తే నిర్మాణ కార్యక్రమం యొక్క సంపూర్ణ చిత్రం ప్రజలకు విపులంగా బోధపడక తప్పదు. అందువల్లనే ఈ నాయకత్రయం యొక్క అభిప్రాయాల్ని అనుభవాల్ని చేర్చి జాతీయ విజ్ఞాన మందిరంతరపున ప్రచురిస్తున్నాము. ఇది మా రెండవ పుస్తకం. ఆంధ్ర మహాజనులకిది ఎంతో ప్రయోజనకారి కాగలదని ఆశిస్తున్నాము.

ఇట్లు
ప్రధాన సంపాదకుడు

# సరోజనీ దేవి సందేశం

గాంధీ మహాత్ముని 'నిర్మాణ కార్యక్రమ' సందేశము ఆయన అనుంగు వ్యాఖ్యాతలందరు గ్రహించినదాని కంటెకూడ మిక్కిలి సమగ్రమైన విశాలమైన నూత్న సృష్టి. అది నూత్న భారత భాగ్యోదయ సందేశ సారాంశము. వడుకునూలు, దంపుడు బియ్యము, చేతి కాగితము మొదలైన కొన్ని చిన్ని పరిశ్రమలకు మాత్రము అది అంటి పెట్టుకొని వుండునది కాదు. ప్రజాకల్యాణప్రదములైన సర్వోద్యమాలను అది తనలో అంతర్వాహినులనుగా ఇముడ్చుకొనగలదు. జానపదులయొక్క అభీష్టములకు భావములకు అది రూపము. ఏవిధమైన ప్రోత్సాహము లభింపక జీర్ణములైపోవుచున్న జానపదుల సాహిత్యము, సంగీతము, నృత్యపద్ధతులు, నాటకములు మొదలైన కళలును, జీవనోపాధులైన ఇతర చేతిపనులును - అన్నీ నిర్మాణ కార్యక్రమములో ఇమిడివున్నవి. పైగా పల్లెల విషయమేకాక అది జాతీయ జీవితములోని ఆర్థిక, వైజ్ఞానిక మూల్యములను నిర్ణయించుటలో విలక్షణమైన శక్తికలది. ఒకేఒక జాతీయాదర్శము వైపు భిన్నతరగతుల ప్రజలనందరను ఏకోన్ముఖులను చేయుట దాని ముఖ్యాశయము.

# పీఠిక

## " నిర్మాణకార్యక్రమము "

### డాక్టరు పట్టాభి సీతారామయ్య

నిర్మాణ కార్యక్రమము లేక రచనాత్మక కార్యక్రమము అను పద జాలములు ఇటీవల విశేషముగ వాడుకలోకి రావడమేకాక రాజకీయోపన్యాసములలో ఒక తారక మంత్రముగ వినియోగింప బడు చున్నవి. కాంగ్రెసు యొక్క కార్యవిధానము 1921 నుండి రెండు పాయలుగ ప్రారంభించి అప్పుడప్పుడు అక్కడక్కడ కలియడము తిరిగి విడి పోవడము, తిరిగి కలియడము, తిరిగి విడిపోవడము సంభవించు చున్నది. కాంగ్రెసు యొక్క లక్ష్యము స్వరాజ్యసంపాదన. సంపాదన కంటె ముఖ్యమైనది, సంపాదన కొరకు వినియోగింపబడు సాధనము. సాధనశుద్ధి లేని సంపాదన ఎండ మావులవలె సమీపించిన కొలది దూరమగును; చివరకు అదృశ్యమగును. కాంగ్రెసు యొక్క సిద్ధాంతము నందు సంపాదనకు ఎంత ప్రాముఖ్య మివ్వబడ్డదో, సాధనమునకుకూడ అంతప్రాముఖ్యమే యివ్వబడ్డది. లోకంలో అనుదినహీనవ జీవతము లందు ఇట్టి సమూలప్రాముఖ్యము సాధన సంపాదనలకు, ఇయ్యబడుట లేదు. అందువల్లనే జనులు నీతి మంతులు నీతిమాలినవారు అనే భేదమునకు అవకాశము కలుగుచున్నది. నీతి మంతుల సంపాదన తక్కువ, నెమ్మది; అవినీతిపరుల సంపాదన యెక్కువ, తొందర. కాని నీతిపరుల సంపాదన శాశ్వతము; తదితరులది అశాశ్వతము. స్వరాజ్య సంపాదన కూడ అట్టిదే. ఒకరిని చంపి హింసవల్ల సంపా దించిన స్వరాజ్యము, మరియొకరు సంపాదకుని చంపుటవలన పోగొట్టు కొన బడవచ్చును. హింసకు విరుగుడు హింస అయినప్పుడు, హింస వలన సంపాదించిన సంపాదన హింసామార్గముననే పోవును. అహింస వలన సంపాదించిన సంపాదన నిలుచును. అయితే అహింసకు నిర్మాణ కార్యక్రమమునకు సంబంధమే మని అడుగుదురు. స్వరాజ్య సంపాదన

సులభమే. ఇంగ్లీషువారి వద్ద డబ్బుపెట్టి కొని తెచ్చుకోవచ్చు. కాని నిలుపుకొనుట కష్టము. సేనలను కూర్చి ఇంగ్లీషు వారితో యుద్ధము చేసి గెలిచి సంపాదించవచ్చును. కాని అంతకంటె పెద్దసేనలుగలవారి వల్ల కోల్పోవచ్చును. కొనుబడి ఒక్క మనిషివల్ల జరిగే పని. సేన లక్షలతోకూడినది. నిర్మాణ కార్యక్రమము కోట్లవలన జరుగవలసినపని.

నిర్మాణ కార్యక్రమములోని అంశములను పరిశోధిస్తే ఈ సంగతి తేటపడును. ఖద్దరు, గ్రామములలోని చేతి పనులు, అస్పృశ్యతానివారణ, మాతృభాష ద్వారా జాతీయ విద్యా వ్యాపకము, గ్రామ పారిశుధ్యము గ్రామ స్వయం సంపూర్ణత, గ్రామస్వయం సహాయము, అటులనే గ్రామ స్వపరిపాలన ఉన్నట్లయితే ఇవి రచనాత్మక కార్యక్రమములోని అంశములు అగును. గ్రామములన్నియు ఈ విధముగా కట్టుబాటులోనికి వచ్చినప్పుడు [illegible] కట్టులోనికి వచ్చును. దేశస్థులు యావన్మంది యెవ్విధముగానైనా సరే ఇట్టి జ్ఞానబోధమును పొందినపుడు ప్రజ్ఞగలవారై తమ సంసారమును తమ గ్రామ పారిశుధ్యమును, తమ దేశమును తాము పాలించుకొనగలరు.

స్వరాజ్యము వచ్చిన తర్వాతకూడ పరదేశ వస్త్రధారణ నిషేధము పోకూడదా? అంటేఇంకను పరదేశస్థుల బట్ట కట్టు కొందుమని భారత దేశపు దాస్యమునకు సాక్ష్యమివ్వవలసియుండునా? ఆగవలెను. బట్ట కట్టని మనిషి లేడుగదా! ఆ బట్ట విదేశపు బట్ట అయినచో, విదేశీయుల పరిశ్రమలను పోషణచేసి వారికి బొట్టు కాటుక పెట్టి వారిని ఇక్కడ ఉండవలసినదని ఆహ్వానించడమే గదా! క్విట్ ఇండియా సూత్రమునకు విరోధమే గదా? దేశము స్వరాజ్యమును నిలుపుకొనవలెనంటే యెక్కడ వారక్కడ తమకు వలయు వస్తువులను చేసుకొనవలెను. ఈ ప్రకారము చేసుకొన లేక పోయినట్లయితే హింసా మార్గము తప్పదు.

సామ్రాజ్య తత్వము హింసావాదము. హింసవల్లనే సామ్రాజ్యములు స్థాపింపబడు చున్నవి. ముడి పదార్థములు కొనబడు చున్నవి. తయారీ వస్తువులు పాలితుల నెత్తిని వేసి రుద్దటము తటస్థిస్తున్నది. ఈ ప్రకారము హింసయొక్క బలమువల్ల పరరాజ్యము నిలపబడు చున్నది. పోషింపబడు చున్నది. సత్యాగ్రహ విధానములో హింసకు విరుగుడు అహింస. హింసను అహింసవలన జయించవలెను. హింసవలన మన మీద విధింపబడు పరరాజ్యమునూ, తత్ఫలితముగవచ్చిన పరదేశ వస్త్రమునూ, అహింసా తత్వమువలన మన దేశములో ఉత్పత్తి చేయబడిన ఆ వస్త్రముల వినియోగమువల్లనే జయింప వలసియున్నది. కాబట్టి హింసారూపకమైన సామ్రాజ్య తత్వమునకును తత్ఫలితమగు పరదేశ వర్తకమునకును విరుగుడు అహింసాస్వరూపకమైన స్వదేశవర్తకము, చేతిపనులు, గ్రామ పునర్నిర్మాణము, పంచాయితీ కోర్టులు, అస్పృశ్యతా నివారణ, జాతీయతను పెంపొందించు విద్య, తద్రీత్యా దరిద్రనారాయణ సేవ, ఆకలి గొన్నవారికి అన్నము, దిగంబరులకు బట్ట, ఇల్లు లేనివారికి ఇళ్లు, అందరికీ వైద్యము, విద్య-ఇవియే కదా? పరరాజ్యము పోవలెనని చెపుతూ పరభాషా సేవ ఎట్లు చేయగలము? పరదేశపు బట్ట యెట్లు వాడగలము? పరవర్తక పోషణ యెట్లు చేయగలము? కావున స్వభాషా సేవ, స్వదేశవస్తు వినియోగము, స్వవిజ్ఞానావలంబనము, స్వజనాదరణ మున్నగునవి నిర్మాణ కార్యక్రమ లక్షణములు. ఇవి స్వరాజ్య సౌధమును నిలుపు స్తంభములు. స్వరాజ్యపు గోడలను కాపాడు పుస్తీలు. కావుననే నిర్మాణ కార్యక్రమము అహింసాస్వరూపమనియు స్వరాజ్య పోషక సాధనమనియు నిరూపింపబడు చున్నది. ఇట్టి విధానము యొక్క సమగ్రవర్ణన ఈ చిన్న పుస్తకమునందు ఇవ్వబడినది. జాతీయతావిస్ఫురణ కాలమందు ఈ పుస్తక మెంతయు ప్రయోజనకరము.

బందరు
25-12-45

భోగరాజు పట్టాభి సీతారామయ్య

# నిర్మాణ కార్యక్రమం

నిర్మాణ కార్యక్రమమనంటే సత్య, అహింసా సాధనములద్వారా సంపూర్ణ స్వరాజ్యమును స్థాపించుటయే.

హింసాత్మకమైనటువంటి పద్ధతులద్వారాను, అసత్యమైనటువంటి సాధనములద్వారాను స్వరాజ్యాన్ని స్థాపించే యత్నములోనున్న అనేక దుఃఖదాయక పరిణామాల్ని మనం గుర్తించియున్నాము. ప్రస్తుత ప్రపంచ మహాయుద్ధంలో అపారధనజననష్టం, భయంకర సర్వనాశనం, మనకళ్ళ ఎదుట జరుగుచున్న విషయమేకదా!

జాతివర్ణ విభేదములు లేకుండా, సమస్త వర్గములకు సంపాదించిన స్వరాజ్యమే, ఆధ్యాత్మికదృష్టితో, సత్య, అహింసాసాధనముల ద్వారా సిద్ధించిన సంపూర్ణ స్వరాజ్యమనదగును. స్వార్థపరత్వము, సంకుచితదృష్టి, ఇట్టి స్వాతంత్ర్యమునకు ఏమాత్రమును ఆధారములు కాజాలవు. ఎందుకంటే, పరస్పర సహాయం, సేవ, అన్యోన్య సంబంధం. ఆధ్యాత్మిక ఆదర్శమునకన్న స్వానుభవం ఇందుచేతనే తక్కువదైయున్నది. ఏలనన, రేఖాగణితమునకు వ్యాఖ్యనిచ్చు ఆధ్యాత్మిక రేఖకన్న మనుష్యుడు గీసిన రేఖ అసంపూర్ణముగనే యుండును. వ్యావహారికంగా ఆధ్యాత్మిక దృష్టితో దాని దగ్గరకు వెళ్ళగలిగినంతవరకే, పూర్ణస్వాతంత్ర్యము సిద్ధించగలదు.

పాఠకులు నిర్మాణ కార్యక్రమముయొక్క సంపూర్ణ చిత్రమును తమ కళ్ళ ఎదుట చూడగలిగిననాడే, నావలెవారుకూడా, ఈ కార్యక్రమమును ఆచరణలో పెట్టినవెంటనే మనము కోరే సంపూర్ణ స్వాతంత్ర్యము లభించగలదని తెలిసికొనగలరు. ప్రధానవర్గములమధ్య సామ

రస్యమునే—అనగా నా దృష్టిలో సాంప్రదాయిక ఏకమత్యము కలిగిన తరువాత సిద్ధించిన సామరస్యమునే—ఆదరించెదనని మిస్టరు అమెరీ చెప్పలేదా? అమెరీమాటలను మనము ఏమాత్రం సందేహింప నవసరంలేదు ఎందుకనగా ఇట్టి ఏకమత్యము, హృదయ పూర్వకంగా సిద్ధించిననాడు, సర్వజన సమ్మతమైన ఆ కోరికను తీర్చుటకై ప్రభుత్వమును బలవంతపెట్టు శక్తి దానికి కలుగుచున్నది. దీనికి వ్యతిరేకంగా, హింసవల్ల సిద్ధించు స్వరాజ్యమునకు, ఆధ్యాత్మిక దృష్టితోకాని, కల్పనాదృష్టితోకాని, వేరే వ్యాఖ్య లేదు. ఎందుచేత ననగా, హింసాత్మక స్వరాజ్యమునందు, దేశమునందలి ఏవర్గమునకు పశుబలాధిక్యము కలదో, దానిదే పైచేయియున్నసంగతి అందరు ఎరుగుదురుగదా! అట్టి స్వరాజ్యంలో ఆర్థికంగాగాని, మరేవిధంగాగాని సామ్యము కలుగుట అసంభవం. అయితే, అహింసా పద్ధతులమీదనే నిర్మాణ కార్యక్రమము కొనసాగించవలసినదెందుకో పాఠకులకు తెలుపుటయే ఈ సమయమున నా ఉద్దేశ్యం. స్వరాజ్యము ఎడల గాంధీవాదులు, హింసాత్మక సాధనముల నిరర్థకతకు చెందినను నాయకులను తప్పక స్వీకరించవలసిన అవసరము వారికిలేదు. హింసాత్మక సాధనముల ద్వారా లభించే స్వరాజ్యములో అన్ని తరగతులవారికి మేలు కలుగు నని వారు తలంచిన తలంతురుగాక.

ఇప్పుడు మనం నిర్మాణ కార్యక్రమముయొక్క మొదటి 13 అంశములను పరీక్షింతుముగాక. తక్కిన అయిదు అంశములను అనుబంధమందు పేర్కొనబడినవి.

ప్రధాన సంపాదకుడు.

# మహాత్ముని
# నిర్మాణ కార్యక్రమము

[మహాత్ముని భారత రాజకీయ రంగమున ప్రవేశించిన తరువాత ఈ పాతిక ముప్ఫై సంవత్సరాలుగా సర్వతోముఖమైన భారతజాతీయాభివృద్ధికై ఆయన అనేక పరిశోధనలను ప్రయోగాలను చేశారు. ఈ ప్రయోగాలకూ పరిశోధనలకూ ఫలితంగానే ఈ సాగర మథనపు ప్రతి ఫలంగానే నిర్మాణ కార్యక్రమ మనే అమృతమును ఆయన తీయగలిగారు. ఈ క్రింద పొందుపరపబడిన చతుర్దశ సూత్రాలతోకూడిన ఈ నిర్మాణ కార్యక్రమమును భారతీయులందరూ నిష్ఠతో అనుసాగించినట్లయితే గతించిన ఒకటిన్నర శతాబ్దాలుగా భారతదేశం అనుభవిస్తూ ఉన్న నికృష్ట దాస్యజీవనము అంతమై పోవడమూ, భారతజాతి అతి శీఘ్రకాలములో తిరిగి ప్రపంచములో తన పూర్వపు ప్రతిష్టనూ ఆర్థిక రాజకీయ, నైతిక ఆధ్యాత్మిక ఔన్నత్యములను, సర్వాంగ సౌష్టవముగల అభ్యుదయమును పొందగలగడమూ జరుగగలదని విజ్ఞులూ, విద్వాంసులూ విశ్వసిస్తునారు. కాంగ్రెసు ఈ కార్యప్రణాళికపై తన విశ్వాసమును ప్రకటించి వివిధ అనుబంధ సంస్థల ద్వారా దానిని అమలు జరుపుతూంది.]

## 14 సూత్రాలు

1. జాతీయైక్యత
2. అస్పృశ్యతానివారణ
3. మద్యపాన నిషేధము
4. ఖద్దరు పరిశ్రమ
5. ఇతర గ్రామ పరిశ్రమలు
6. గ్రామ పారిశుద్ధ్యం
7. నూత్న విద్యావిధానం

8. వయోజన విద్య
9. స్త్రీలు : వారి అభ్యున్నతి
10. ఆరోగ్యం : పరిశుభ్రత
11. జాతీయ భాష
12. ఆర్థిక సమానత్వం
13. కర్షకుడు, కార్మికుడు
14. విద్యార్థుల విధులు

ఈ చతుర్దశ సూత్రాలకు మహాత్మాజీ స్వయంగా చేసిన నిర్వచనములకు వారి శిష్యులూ, నిర్మాణ కార్యక్రమ నిరతులు, దక్షిణ భారత హిందీ ప్రచార సభా ప్రధాన కార్యదర్శి అయిన శ్రీ మోటూరి సత్యనారాయణగారు చేసిన అనువాదమును ఇక్కడ ప్రకటిస్తున్నాము.

—సం॥

# జాతీయ ఐక్యత

జాతీయ ఐక్యత అవసరమన్న సంగతి నిర్వివాదవిషయం. కాని, ఐక్యత అనగా, బలవంతంగా తెచ్చిపెట్టిన, వట్టి రాజనైతిక ఐక్యతయే కాదన్న సంగతి చాలమందెరుగరు. హృదయపూర్వకమైనటువంటిగియు, విచ్ఛిన్నము కానటువంటిగియు ఐక్యతెనే దీని అర్థం. ఈ ఐకమత్యసిద్ధికి ప్రాతిపదికేదనగా, ప్రతి కాంగ్రెసువాడి, 'హిందూ, మహమ్మదీయ, క్రైస్తవ, తనే మతమునకు చెందినవాడైనను—అనగా హిందువైనను, అహిందువైనను అన్ని మతములకు ప్రతినిధినని తలచుకొనవలెను. భారతదేశమునందలి నలభైకోట్ల జనులలో ప్రతి ఒక్కడితోను సానుభూతికలిగి యుండవలెను. ఇలా వుండవలెనన్న ప్రతి కాంగ్రెసువాడి, వేరు వేరు మతములవారితో, వ్యక్తిగత మైత్రిని పొందవలయును. తన మతమునందు తనకుగల ఆదరమే, ఇతర మతములనందుకూడ కలిగియుండవలెను. ఈ సౌభాగ్యస్థితికి రాగలిగిననాడే, మన స్టేషనులలో, హిందూ టీ, మహమ్మదీయ టీ, హిందూ కాఫీ, మహమ్మదీయ కాఫీ మొదలైన లజ్జాస్పదమైన కేకలు వినిపించవు. స్కూళ్లలోను, కాలేజీలలోను, హిందువులకు, అహిందువులకు వేరు వేరు గదులుగాని, వేరు వేరు సామానులుగాని వుండవు. సాంప్రదాయిక పాఠశాలలు, కాలేజీలు, ఆస్పత్రులు వుండవు. ఏ విధమైన రాజనైతిక ఉద్దేశములు లేకుండనే, కాంగ్రెసువాదులు పరిశుద్ధ ప్రవర్తనతో ఈ విప్లవోద్యమాన్ని ప్రారంభించవలయును. దీని స్వాభావిక పరిణామమే రాజనైతిక ఐకమత్యం కాగలదు. స్వాభావికంగా ఏర్పడ్డ హృదయపూర్వకమైన ఐకమత్యమే ఆశ్చర్యజనితం కాగలదు. కాంగ్రెసువాదులు అన్యమతస్థులకు విరోధులై, పార్లమెంటరీ పదవులను పొందజాలరు. అందువల్ల ఈ విధమైనటువంటి సాంప్రదాయిక కలహము లున్నంతవరకు కాంగ్రెసువాదులు పార్లమెంటులోగాని కౌన్సిళ్లలోగాని చేరుటకు ప్రయత్నించరాదు. మన రాజకీయ అధికారములు, పార్లమెంటులద్వారా లభించగలవని చాలకాలంనుంచి మనం తలుస్తూవస్తున్నాం. నేనీతలంపును, అజ్ఞానములో కూడినటువంటిగియు, పదవీ వ్యామోహంవల్ల ఏర్పడ్డ ఒక పెద్దలోటుగా భావిస్తున్నాను. బ్రిటిష్ చరిత్రను లోతుగా చదువకుండకయే, అచ్చటి ప్రజలకు హక్కులన్నియూ, పార్లమెంటుద్వారానే లభించినవని మనం తలుస్తున్నాం. కాని ఇది పెద్దపొరపాటు. అసలు హక్కులు ప్రజలవే—కాని, వారు తమ ప్రతినిధులుగానున్నవారికి కొంతకాలంవరకు

వాటిని ఒప్పుచెప్పుచున్నారు. ప్రజాశక్తిముందు మరే స్వతంత్రశక్తులు పార్లమెంటులు ఏమీ చేయజాలవు. గడచిన 21 సం||గా, ప్రజలకు ఈ చిన్న విషయంలోని పెద్ద సత్యాన్ని ఋజువుచేయుటకే ప్రయత్నిస్తున్నాను. సాత్విక నిరోధంయొక్క సత్యాగ్రహంయొక్క శక్తి పరిపూర్ణమైనటువంటిది. శాసనసభలలో తయారైన శాసనాలను ఫలితములను లెక్కించకుండా ధిక్కరించు ఒక పెద్ద ప్రజాశక్తి ఏమిచేయగలదో వూహించుకోండి. ఆ మహాశక్తి అట్టి శాసనసభలనేకాదు సంపూర్ణ ప్రభుత్వాన్నే తారుమారు చేయగలదు పోలీసులను సిబ్బందిని చిన్న చిన్న ప్రజాసమూహాల్ని అణచివేసేందుకు ఉపయోగించుకోనవచ్చును.

కాని, అచంచల దీక్షతో, అసంఖ్య కష్టాల్ని ఎదుర్కొనగలిగిన ప్రజా సంకల్పం ఎదుట పోలీసులేకాదు, సిబ్బందీలు ఏమీ చేయజాలవు. బహు మతాభిప్రాయమును సనుసరించి నడుచునపుడే పార్లమెంటరీ శాసనవిధానం కొంత లాభదాయకం కాగలదు. అనగా పరస్పర మైత్రిని కలిగిన పార్టీలతోనే ఈ విధానం ఆచరణయోగ్యం కాగలదు. పార్లమెంటరీ విధానం పేరుతో ప్రత్యేక నియోజకవిధానాల్ని ఏర్పరచి మనశాసనాలు తెరచాటు నెన్నోకక్షలు పెంపొందింపచేశాయి. కృత్రిమమార్గాలద్వారా మనం శాసన సభలను నడుపుతూ, అసలైన ఐకమత్యాన్ని ఎన్నడూ పొందజాలం. ఇట్టి శాసన సభలు ఏదో కొద్దిపాటిపని జరుపుకునేందుకు ఉపయోగపడగలవేమో! కాని, అవి ప్రభుత్వం విసరేసే పదవులను ఏరుకొని పంపిణీలు కుదరక కొట్లాడుకునే స్థలాలుకూడ కావచ్చునేమోనని నా భయం. ఒక పార్టీవార్ని మరొకపార్టీవారు కొట్టి చంపకుండా ఆయుధ బలం సహాయంతో ప్రభుత్వం ఆపగలగవచ్చు. కాని, ఇట్టి లజ్జాస్పదమైనటువంటి స్థలములనుండి సంపూర్ణ స్వరాజ్యాన్ని సిద్ధించటం సర్వదా అసంభవమేగదా!

## అస్పృశ్యతా నివారణ

ఇంతకాలముపిమ్మట హిందూమతమునందలి ఈ మహాకళంకమును, ఈ ఘోర శాపమును, దూరముచేయవలసిన అవసరమునుగూర్చి ఎక్కువగా వ్రాయనక్కరలేదు. కాంగ్రెసువాదులు నిజముగా ఈ విషయంలో ఎక్కువగానే పనిచేసియున్నారు. కాని, విచారకరమైన విషయమేమంటే చాలామంది కాంగ్రెసువాదులు దీనిని కేవలము రాజకీయ దృష్టిలో అవసరమనియే చేసిరి కాని, హిందువులతో సంబంధించినంతవరకు, తమ మతమును స్థిరపరచుకొనుటకై చేయలేదు. హిందూ కాంగ్రెసువాదులు పరిశుద్ధమైన

మనస్సులో ఈ పనిని చేసియుండినట్లయితే, సనాతనులను ఇంతకన్న ఎక్కువగా ప్రభావితులను చేయగలిగి యుండెడివారు. వీరు సనాతనుల విషయమున ప్రతికూలభావంలో కాక తమ అహింసా ధర్మమునకు తగిన స్నేహభావంతో ప్రవర్తించవలసియున్నది. ముఖ్యముగ హరిజనులను ప్రతి హిందువు తమలో చేర్చుకొనవలయును. వారి సుఖ దుఃఖములను పంచుకొనవలెను. ప్రపంచకంలో ఎచ్చటను కని విని ఎరుగని ఈ భయంకర బహిష్కారణము, హిందూదేశములోనే కనిపించుచున్నది. ఈ రాక్షసత్వమునువిడిచి హరిజనులఎడల ప్రేమభావమును పెంపొందింపవలయును. నేను అనుభవపూర్వకంగా ఈ పనియందలి కష్ట సుఖములను తెలిసికొనియున్నాను. కాని, స్వరాజ్య భవనమును నిర్మించే భగీరథ ప్రయత్నములో ఇది ఒక భాగము మాత్రమే. స్వరాజ్యమార్గము తిన్నగా చాల ఎత్తుగల జారుడుమార్గం. దానిలో అనేక జారుడు మెట్లు క్రింద లోతైనగోతులువున్నవి. వీటన్నిటిని, దృఢసంకల్పంతో ముందంజవేయుచు దాటవలెను. అప్పుడే ఉన్నత శిఖరము నధిష్టించి, విశుద్ధ స్వేచ్ఛా వాయువులను పీల్చగలుగుదుము.

# మద్యపాన నిషేధం

జాతీయ ఏకత, అస్పృశ్యతా నివారణలతోపాటు మద్యపాననిషేధంకూడ 1920 సం|| నుంచియే కాంగ్రెసు కార్యక్రమంలో చేరియున్నవి. కాని ఈ అత్యంత ముఖ్యమైన, సాంఘిక, నైతిక సంస్కరణ విషయమున కాంగ్రెసువాదులు అంత ఎక్కువ శ్రద్ధ తీసుకొనలేదు. అహింసాత్మక సాధనముద్వారా మనము ఆశయసిద్ధిని పొందవలెనన్న, కల్లు, సారాయి, గంజాయి, నల్లమందు మొదలైన మత్తు పదార్థములు వ్యసనములోపడిన లక్షలాది మన భారత నర నారీమణుల భాగ్యదేవతను భావి పరిపాలకులకు వశపరచరాదు. ఈ చెడుగును దూరంచేయుటకు డాక్టర్లు చికిత్సకులు ఎక్కువగ పనికివత్తురు. తాగుబోతులు తాగుడు నల్లమందు భాయీల నల్లమందు వ్యసనమును తొలగించుటకు వారు మార్గములు చూడవలెను.

ఈ సంస్కరణను ప్రచారము చేయుటకు స్త్రీలకు విద్యార్థులకు ఎక్కువ అవకాశము లున్నవి. ప్రేమపూర్వకమైన సేవాకార్యములద్వారా వ్యసనమునకు లోనైన వ్యక్తులను వారు పూర్తిగ మార్చగలరు. అట్టివారు వ్యసనములను విడవమని చేసిన ప్రార్థనను వారు తప్పక అంగీకరింతురు. కాంగ్రెసు కమిటీలు రోజంతా పనిచేసి అలసిన కార్మికుల విశ్రాంతికొరకు ఆరోగ్యప్రదమైనట్టు పనిచేయు, మనోరంజకమైనట్టి విశ్రాంతి

గృహాయుల నేకములను ఏర్పరచవచ్చు. ఈపనులన్నీ గొప్పవి, చేయతగ్గవి. అహింసద్వారా స్వరాజ్యమునుపొందుట ఒక క్రొత్త విచిత్రమైన విషయం. ఇందులో పూర్వాచారములను విడిచి నూతన మార్గాలను తొక్కవలసియుండును. అనేక విషయములలో మార్పులు చేయవలసియుండును. హింసామార్గమున ఇట్టి సంస్కరణలకు తావేలేదు. ఈ పద్ధతులలో నమ్మకముకలవారు తమ కొందరలో అనగా అజ్ఞానంలో ఇట్టి విషయము లన్నిటిని ఏవో మత సంబంధమైనటువంటివని వదలివేయుచున్నారు. శాశ్వతమైన ముక్తి తమలోనుండియే అనగా ఆత్మశుద్ధిద్వారానే లభిస్తుందన్న సంగతి వీరు మరచి పోతున్నారు.

## ఖద్దరు, జాతీయ వ్యవస్థకు ప్రాతిపదిక

ఖద్దరు సంగతి ఇంకా వివాదంలో నేవుంది. చాలామంది ఈ ఖద్దరును ప్రచారంలోకి తీసుకువచ్చి నేను స్వరాజ్యనౌకను తుసానుగాలి కెదురుగా నడిపించడానికి ప్రయత్నిస్తున్నానంటారు. ఈ ఖద్దరు కావాలని పట్టుదలబట్టి దేశాన్ని అనాగరిక కాలం వైపుకు నడిపిస్తున్నాననికూడా కొందరి అభిప్రాయం. ఖద్దరు విషయాన్ని ముక్తసరిగా ఇక్కడ వ్రాయడం కష్టం. ఈ సంగతి ఇదివరకే ఎన్నోసార్లు విపులంగా చర్చించాను. ప్రతి కాంగ్రెసువారు లేక ప్రతి భారతీయుడూ ఖద్దరు నభివృద్ధిచేయడానికి ఎంత అవకాశముంది, అనే విషయమే ఇక్కడ చర్చిస్తాను. దేశంలో ఆర్థిక స్వాతంత్ర్యానికీ, సర్వ సమానత్వానికీ ఖద్దరు నిదర్శనం చూపిస్తుంది. రుచిగల పదార్థానికి రుజువక్కరలేదు. అమలులో పెట్టిచూస్తే అందరికీ నేను చెప్పేదానితత్వం బోధపడుతుంది. ఖద్దరులోనున్న సమస్త తత్వాల్ని మనం బాగుగా బోధపరుచుకోవాలి. ఖద్దరంటే స్వదేశీ మనోభావమన్నమాట. అనగా మనకు కావలసిన అవసరాలన్నీ మన దేశీయ వస్తువులతోనే పూర్తి చేసుకునే మనోనిశ్చయమన్నమాట. ఈ వస్తువులు గ్రామస్థులయొక్క పరిశ్రమవల్ల, బుద్ధివల్ల తయారైయినవిగా వుండవలెననికూడా దీని అర్థం. ప్రస్తుతం అమలులోవున్న వస్తు స్థితికి వ్యతిరేకంగాపోవడం అంటే, మనదేశంలోనూ, బ్రిటనులోనూవున్న ఏ అయిదారు పట్టణాలో, ఏడులక్షల గ్రామాల్ని పిండి పీల్చుకు బ్రతాగేదానికిబదులు స్వయం పూర్ణమైన గ్రామాలు స్వతస్సిద్ధంగా మన ఇండియాదేశంలోని పట్టణాలను పోషించేస్థితి ఏర్పడాలి. ఇంతేకాదు. ఇద్దరికి లాభసాటిగావుంటే ప్రపంచంలోని ఇతరదేశాల పట్టణాల్నికూడ పోషించవచ్చు.

బహుసంఖ్యాకుల మనోవైఖరిలోనూ, దృష్టిలోనూ ఎంతో మార్పు కలిగితేనే గాని ఇటువంటిస్థితి ఏర్పడదు. అహింసామార్గం కొన్ని విషయాలలో సులభమైనా మరి కొన్ని విషయాల్లో మహా కష్టతరం. ఇందులో ప్రతి భారతీయుడు ఏ కొంతో పనిచేసి తీరాలి. ప్రతి భారతీయునికి అతని ఆత్మశక్తి సాక్షాత్కారమై అతన్ని ముగ్ధుణ్ణి చేస్తుంది. భారతీయ విభిన్న సంఘ సాగరంలో అనుక్షణం ఓలలాడిస్తుంది. మన ఈ అహింసా మార్గం నిష్ప్రయోజనమైన నిరర్థకశబ్దం కాదు. ఈ అహింసయొక్క గొప్పతనం మన మింతవరకు గుర్తెరుగలేదు. మానవజాతి ఇంతవరకు తెలుసుకోనటువంటి అమోఘమైన శక్తి యిందులో ఇమిడివుంది. మానవజాతియొక్క ఆయువుపట్టే అసలు ఇందులోవుంది. అందుకనే నేను దీనిని కాంగ్రెసుకు అందజేశాను. కాంగ్రెసుద్వారా ప్రపంచానికికూడా ఈ వస్తువును సమర్పించాను. ఖద్దరంటే సమస్త భారతీయుల సాంఘిక ఐక్యతకు ప్రతినిధి అన్నమాట. మన దేశపు ఆర్థిక స్వాతంత్ర్యానికీ, సర్వసమానత్వానికీ ఇది సంకేతం. దీనినే జవహర్‌లాలు నెహ్రూ తన కవిత్వభాషలో మన దేశ స్వరాజ్యసాధానికి ఆధార స్తంభమన్నాడు.

ఖద్దరు తత్వానికి సరియైన అర్థం దేశంలో తయారయ్యే సరకు ఓకేచోట తయారు కాకుండ ఉండడం. మన బ్రతుకు తెరువుకు కావలసిన వస్తువులు తయారుచేసి దేశస్థులకు అందచేయడమని చెప్పాలి. కనుక దీనివల్ల బోధపడేదేమంటే, ప్రతిగ్రామం తనకు కావలసిన వస్తువుల్ని ఉత్పత్తిజేసుకోవడం, వాటిని ఉపయోగించుకోనడం, అవసరమైనదానికంటె ఇంకా ఎక్కువగా ఉత్పత్తిచేసి, తమతమ శక్తికొలది ఆ వస్తువుల్ని పట్టణాల అవసరం ప్రకారం వాటికి పంపిస్తూవుండడం. గొప్పగొప్ప పరిశ్రమల్ని మనం దేశం తరఫున ఏ కొన్ని కేంద్రాల్లోనో నడిపించవలసివుంటుంది. కాని, మనం గ్రామాల్లో జరుపవలసిన ఈ జాతీయ కార్యంలో పోలిస్తే అది ఎంతో తక్కువగా కనబడుతుంది.

ఇంతవరకు ఖద్దరులో ఇమిడివున్న తత్వాలనుగురించి చెప్పాను. ఖద్దరును వృద్ధి తీసుకురావడానికి కాంగ్రెసువాదులు ఏమిచేయాలో, ఏమిచేయగలరో ఇక మనవి చేస్తాను. ఖద్దరు వుత్పత్తిలో ఎన్నోపనులు యిమిడివున్నాయి. పత్తి పండించడం, పత్తి ఏరడం, పత్తి రాట్నంపట్టడం, దూది శుభ్రంచేయడం, ఏకడం, ఏకులుచేయడం, వడకటం, పడుగుచేయడం, రంగువేయడం, పడుగుపేక తయారుచేయడం, నేయడం, వుతికి తెలుపుచేయడం ఇవన్నీ వున్నాయి. ఒక్క రంగువేయడం తప్పితే, మిగతా పనులన్నీ మనదేశంలో గ్రామస్థులు చెయ్యవచ్చు. చరఖా సంఘంవారు ఎన్నో గ్రామల్లో ఈ

పనులు చేస్తున్నారు కూడాను. వారు ప్రచురించిన రిపోర్టులో ఈ క్రింది అంకెలు చూడండి :—

13,451 గ్రామాల్లో 2,75,146 గ్రామస్థులికి చరఖా సంఘంవారు బ్రతుకు చూపించారు. ఇందులో 57,378 మంది మహమ్మదీయులు, 19,645 మంది హరిజనులు ఉన్నారు. 34,85,609 రూపాయలు 1940 సంవత్సరంలో ఈ గ్రామవాసులకై వారు ఖర్చుపెట్టారు. ఇందులో అంతా ఒడికేవారు నేతగాండ్రే. ఒడికేవారిలో ఎక్కువగా స్త్రీలు వున్నారు.

ఖాదీ కార్యక్రమాన్ని కాంగ్రెసువారు మనసార సాగిస్తే, అయ్యేపనిలో ఇప్పుడు జరుగుతూన్న పని నూరోవంతుకూడ వుంటుందని చెప్పలేను. మనదేశంలో గ్రామ పరిశ్రమల్నీ చేతిపరిశ్రమల్నీ కావలెనని నాశనంచేసిన రిక్కావల్ల గ్రామవాసులోనుంచి తెలివి, చురుకుదనం మాయమైపోయింది. దీనివల్ల వారు నిష్ప్రయోజకులుగాను, నిర్వీర్యులుగాను తయారయ్యారు. డొక్కలు ఈడ్చుకునిపోయే గొడ్లలాగే వారిస్థితికూడ ఏర్పడిపోయింది.

ఖాదీనిగురించి కాంగ్రెసు మనవిని మనసార చెవియొగ్గి వారువింటే చరఖా సంఘంవారు అప్పుడప్పుడుకోరే కోరికలప్రకారం ఖాదీ విషయమై వారు కొంతపని చెయ్యవచ్చు. కాంగ్రెసువాదుల సౌకర్యంకోసం కొన్ని నియమాలు ఇక్కడకూడ నేను మనవిచేస్తాను.

1. తమతమ కుటుంబోపయోగంకోసరం ప్రతి గృహస్థుడు కొంత పత్తి పండించాలి. పత్తి పండించడం చాల తేలిక. ఒకప్పుడు బీహారులో రైతులందరు తమకున్న ఎకరానికి పదిహేనుసెంట్లు నీలిమందు వేసితీరాలని ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది. ఇది విదేశంలోని నీలిమందు వ్యాపారలాభంకోసం జరిగినపని. మనదేశీయులాభంకోసం మనమే మన పొలాల్లో కొంతపత్తి ఎందుకు పండించకూడదు? ఖాదీ కార్యక్రమంలో మొదటి నుంచే చిన్న ఎత్తుమీద పరిశ్రమం ప్రారంభమౌతుందనే చిన్నవిషయం ఇందులో మనం గమనించాలి. ప్రస్తుతం మనదేశంలో పత్తికూడ వేలకొలది ఎకరాలలో పెద్దయెత్తుమీద పండించడం, దానిని మనదేశంలో వేరువేరు చోట్లకు పంపించడం జరుగుతోంది. ఈ యుద్ధానికిపూర్వం బ్రిటనుకు జపాను దేశాలకే ముఖ్యంగా చాలా పత్తిపోతూవుండేది. ఇప్పటికీ పత్తి డబ్బు సంపాదనకు పండించే పంటే. పత్తిధర పెరుగుతూ తరుగుతూ

వుండడానికిదే కారణం. ప్రతి ఆసామీ తన ఏ కొంత భూమిలోనో పత్తి పండించుకుంటూవుంటే అప్పుడప్పుడు విపరీతమైన ధరయిచ్చి కొనవలసిన అవసరంరాదు. ఆసామి తనకు కావలసిందే పండించుకుంటాడు. తనపని నడవడానికి కావలసిన వస్తువుల్ని పండించుకునే విషయం రైతుకు తెలుస్తుంది. అట్టి సందర్భాల్లో ధరలు తగ్గడంవల్ల వచ్చే నష్టానికి అతను గురికాడు.

2. ప్రతి ఒడికేమనిషీ తన పొలంలో పత్తి పండకపోతే తనకు కావలసినంత మట్టుకు పత్తి కొనుక్కోవచ్చు. పత్తి రాట్నం అవసరంలేకుండా తన చేతిలో ఒక బల్లమీద చిన్న ఇనపవేమతో పత్తి పట్టుకోవచ్చు. ఇదికూడ కష్టమైతే చేతితో పట్టిన దూది కొనుక్కుని ఏకుకోవచ్చు. ఏకడంకూడ స్వంతంగా చాలా సులభంగా ఒక చిన్న బద్దతో చేసుకోవచ్చు. ఎంత గొప్పఫ్యాక్టరీ కట్టుకుంటే అంత గొప్పయంత్రాలు కావలసివుంటుంది. చిన్న చిన్న పరిశ్రమలకు చిన్న చిన్న యంత్రాలే చాలు. ఏకులు చేసుకుంటే వడకడం ప్రారంభించవచ్చు. వడకడానికి ధనుష తక్లీ చాల ప్రశస్తమైందని నా వుద్దేశ్యం. నేను కొన్నాళ్లనుంచి ఈ ధనుష తక్లీమీద వడుకుతున్నా. రాట్నంమీదవచ్చినంత నూలు దీనిమీదకూడ వస్తూవుంది. దీనిమీద నూలు సన్నంగానూ వస్తూవుంది. గట్టిగాను, సమంగాను ఉండడమేకాకుండా మామూలు టకుకంటె వడకడం ఎంతో సులభంగావుంది. అందరికీ ఇదంత సులభం కాకపోవచ్చు. ధనుష తక్లీ తయారుచేసుకోవడం చాలా తేలిక. అందుకనే ఈ విషయాన్ని గురించి ఇంత వ్రాయడం. అది చౌక. మరమ్మతుకూడ ఎక్కువ అవసరం వుండదు. నాడాలు రెండూ సరిగా బిగించుకుని అవి సడలిపోకుండా చూచుకోగలిగితేనే కాని రాట్నంమీద వడకలేము. వడకనప్పుడు రాట్నం వూరికేనే పడివుంటుంది. లక్షలాదిజనం వడకడం ప్రారంభిస్తే ఈ యుద్ధ సమయంలో ఇది తప్పనిసరి అయివుంటుంది. వీరందరికి రాట్నాలు సప్లయికావడం కష్టం. ధనుష తక్లీ చాలా తేలికగా తయారవుతాయి; సులభంగా వడకడానికి వీలవుతాయి. కనుక ఎన్ని కావలసివచ్చినా తేలికగా సప్లయిఅవుతాయి. ఇది చేతితో వడికే కదురుకంటేకూడా సులభంగా తయారౌతుంది. దేశాన్నంతటినీ ఏకంచేసినటువంటి, జ్ఞానవర్ధకమైనట్టి ఇటువంటి పనిలో, మనజాతి అంతా వడకడానికి సిద్ధమైతే వచ్చే లాభాన్ని ఊహించి చూడండి. షావుకారు, పేదవాడు అనే భేదంలేకుండా అందరూ భాయీ భాయీ అని దేశంకోసరం మనంచేసే ఈ పరిశ్రమవల్ల కలిగే సమానత్వ లాభం గమనించండి. వడికిన నూలు మూడువిధాల వుపయోగించుకోవచ్చు.

1. నిరుపేదల వుపయోగార్థం చరఖాసంఘంవారి కిచ్చివేయడం. 2. స్వంతానికి గుడ్డ నేయించుకోవడం. 3. నూలు యిచ్చి దాని విలువకు తగిన గుడ్డ పుచ్చుకోవడం. నూలు ఎంత బాగాను, సన్నంగానూవుంటే అంత కిమ్మతుకూడ వస్తుందని వేరే చెప్ప నవసరంలేదు. ఈ విషయమై కాంగ్రెసువారు శ్రద్ధగా పనిచేస్తే ఇంకా క్రొత్త క్రొత్త పనిముట్లు కనిపెట్టి ఖద్దరు పరిశ్రమను అభివృద్ధిలోనికి తీసుకురావచ్చు. దురదృష్టవశాత్తు మనదేశంలో ఒళ్లువంచి పాటుపడేవాళ్లకు తెలివితేటలు వుండవు. తెలివితేటలుగలవాళ్లు ఒళ్లువంచి పాటుపడరు. అందువల్ల మనవృద్ధియే ఆగిపోయింది. ఈ రెంటికీ అవినాభావ సంబంధం ఏర్పడితే, నేను కోరేవిధంగా జరిగితే మనకి పరిమితిలేని మేలు కలుగుతుంది. దేశమంతటా మన త్యాగానికి నిదర్శనంగా నేను కోరే రాట్నం వడకడంకోసమై ప్రతి స్త్రీ పురుషుడు రోజుకొక ఘంటకంటె ఎక్కువపని చేయనక్కరలేదు.

## ఇతర గ్రామ పరిశ్రమలు

ఈ పరిశ్రమలు ఖద్దరువంటివి కావు. ఇందులో ప్రతి మనిషీ స్వతస్సిద్ధంగా పడవలసిన కష్టమేమీలేదు. ఈ పరిశ్రమల్లో ఒక్కొక్కదానికోసం పనిచేయడానికి ఏ కొంతమందో కావలసివస్తారు. ఇవన్నీ ఖద్దరుకు సహకారి. ఖాదీలేకుండా అవి బ్రతుకలేవు. అవి లేకపోతే ఖద్దరుకు గౌరవమూవుండదు. గ్రామంలో ఆర్థిక స్వాతంత్ర్యం ముఖ్యమైన గ్రామ పరిశ్రమలేనంతకాలం రాదనే చెప్పాలి. ఇందులో వడ్లదంపు, పిండి విసరడం, సబ్బు తయారుచేసుకోవడం, పేపరు తయారుకావడం, నిప్పుపుల్లలు తయారుచేసుకోవడం, తోళ్లపరిశ్రమ, నూనె గానుగ మొదలైనవి ముఖ్యం. కాంగ్రెసువాదులు ఇందులో శ్రద్ధ పుచ్చుకోవచ్చు. వారు గ్రామాల్లో నివసిస్తూవుంటే ఇటువంటి పరిశ్రమలకు క్రొత్త జీవితం కల్పించి, క్రొత్త మెరుగు పెట్టవచ్చు. మనమంతా గ్రామాల్లో ఉత్పత్తయ్యే వస్తువుల్నే అవి ఎక్కడ దొరికినా ఎప్పుడు దొరికినాసరే ఉపయోగించడం మనకు గౌరవకరమని ఎంచుకోవాలి. ఈ వస్తువుల్ని తయారుచేసేపని గ్రామాలకు వప్పచెప్తే, వారు తప్పక తయారుచేస్తారనే మనం విశ్వసించవచ్చు. మన మనోవైఖరిలో మార్పుచేసికొని గ్రామ్య వస్తువుల్నే వాడటం మన ఆదర్శంగా పెట్టుకుంటే మనం పాశ్చాత్యదేశాన్ని అనుకరించం. ఫ్యాక్టరీల్లో తయారైన వస్తువుల్ని వాడం. జాతీయభావాన్ని, అభిరుచినీ పెంపొందిస్తాం. దారిద్ర్యం, ఆకలిమంటలు, సోమరితనం మనం పునాదులువేసే సౌభాగ్యవంతమైన భావి భారతదేశంలో ఎక్కడా కన్పడవు.

# గ్రామ పారిశుద్ధ్యం

తెలివితేటలులేకుండా కాయకష్టంచేసే మనుష్యులమీదనే ఆధారపడి వున్నందు వల్ల మన గ్రామాలు ఎంతో వెనుకబడిపోయినాయి. మనోహరమైనట్టి చిన్న చిన్న పూరి యిండ్లు కనపడడానికిబదులు మన గ్రామాల్లో పేడకుప్పలు, పెంటదిబ్బలు, కన్పడు తున్నాయి. చిన్న పల్లెటూరికి దేనికైనా పోదామంటే మనసేరాదు. కొన్ని వూళ్లల్లో ప్రవేశించేటప్పుడు, కళ్ళూ ముక్కూ మూసుకోవాల్సివస్తుంది. ఇదీ మనం గ్రామాలలో చూచే పరిస్థితి. అనుభవించే దుర్గంధం. కాంగ్రెసువాదులలో బహు సంఖ్యాకులు గ్రామ వాసులే, వారు స్వతఃగా ప్రయత్నంచేసి పరిశుభ్రానికి మనగ్రామాల్ని ఆదర్శప్రాయంగా చెయ్యాలి. తమ నిత్యజీవితంలో గ్రామాలకోసం పరిశ్రమచేయడం తమ ధర్మమని కాంగ్రెసువాదులు తలచినట్టుగా కనబడదు. సంఘానికి జాతికీ పరిశుభ్రత అలంకార ప్రాయమని మనం తెలుస్తూవున్నట్లు కనపడదు. మనం స్నానంచేసే నూతిప్రక్కన, చెరువు ప్రక్కన, కాలవ ప్రక్కన, నదుల ప్రక్కన మలమూత్ర విసర్జనం దోషమని మనం గుర్తించం. మనంచేసే ఈ తప్పువల్లనే మనగ్రామాలు ఇటువంటి దౌర్భాగ్యస్థితిలో వుండడం, పవిత్రవంతమైన నదీతీరాలూ నదులూ ఈ మురికివల్ల రోగాలకు ఆలవాలం కావడం తటస్థిస్తోంది.

# క్రొత్త విద్యా విధానం

“ఆధార విద్య, బేసిక్ ఎడ్యుకేషన్” అనే ఈ విషయం క్రొత్తది. అయినా, వర్కింగుకమిటీసభ్యులు ఈ విషయంలో ఎంతో శ్రద్ధతీసుకుని హిందూస్తానీ తాలిమీ సంఘానికి దోహదమిచ్చారు. హరిపుర కాంగ్రెసునుండీ ఈ సంఘం పనిచేస్తూనేవుంది. చాలామంది కాంగ్రెసువాదులకు ఇది గొప్ప కార్యక్షేత్రం. పల్లెటూరి బిడ్డల్ని ఆదర్శ ప్రాయులుగా తయారుచేయడమే ఈ విధానంయొక్క ఉద్దేశం. ఇది ముఖ్యముగా వారి కొరకే ఏర్పడ్డది. ఈ యోచనే మొదట గ్రామవాసులనుంచి కలిగింది. స్వరాజ్యానికి పునాదులువేసే మనం, దేశానికి పునాదులువంటివారయిన మన బిడ్డల్ని నిర్లక్ష్యం చేయ కూడదు. విదేశరాజ్యంలో కారణమేదయినా కానివ్వండి. మన పసిబాలురకు చెప్పే ప్రారంభ విద్యతోనే మన విద్య ప్రారంభమవుతుంది. ప్రాథమిక విద్యావిధానం మన పల్లెటూళ్ల అవసరాల్ని, పట్టణ అవసరాల్ని ఎంతమాత్రం దృష్టిలో ఉంచుకోకుండా ఏర్పాటుచేయబడింది. ఈ విద్యావిధానం ఒట్టిఫార్సు అనే చెప్పాలి. ఈ ఆధార విద్య

పట్టణాలలోవుండే పిల్లలకి, పల్లెటూళ్లలోవుండే పిల్లలకీ మధ్య, హిందూదేశంలో శాశ్వతంగా లాభంకలిగేదానికి సంబంధం ఏర్పడుతుంది. దీనివల్ల శరీరం, బుద్ధి సమానంగా వృద్ధిలోనికి రావడమేకాకుండా శరీరంపట్ల ప్రేమ ఏర్పడడమూ, భవిష్యత్తునుగురించి గొప్పదృష్టి కలగడమూ, దేశసౌభాగ్యంకోసమై తాను చేయవలసిన ధర్మాన్ని పాఠశాలలోనుంచే ప్రారంభించడం కలుగుతుంది. కాంగ్రెసువాదులకు ఈ విధానంలో ఎంతో ఆనందం కలుగుతుంది. తాము చదువుచెప్పే లేక చెప్పించే పిల్లలకూ తమకూ కూడ ఎంతో లాభం కలుగుతుంది. ఈ విషయంలో అభిరుచికలవారు సేవాగ్రామంలో వుండే హిందూస్తానీ తాలీమీ సెక్రటరీతోటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపవచ్చు.

## ౩ వయోజన విద్యా ప్రచారావశ్యకత

మనం వయోజనవిద్యను పూర్తిగా నిర్లక్ష్యపరిచాం. వయోజన విద్యఅంటే చదవటం వ్రాయడం అనుకుని నిరక్షరాస్యులైన వయస్కులకు అక్షరాలు నేర్పించి సంతృప్తి పడ్డాం. ఈ పని నా చేతుల్లో పెడితే నేను మొట్టమొదట ఏంచేస్తానంటే, వయస్కులకు మొదట వారిదేశంయొక్క గొప్పతనాన్ని, విశాలత్వాన్ని బోధించడంతో ప్రారంభిస్తాను. పల్లెటూరి ప్రపంచమంతా పల్లెటూరిలోనే వుంటుంది. అతడు తన వూరువిడిచి రెండవవూరుకు వెళ్లితే, తనవూరే తనదేశంగా మాట్లాడుతాడు. హిందూదేశమంటే భూగోళంలో నేర్చుకునే మాటల్లో ఒక మాట అని అతని వుద్దేశ్యం. ఈ విషయంలో పల్లెటూరిలోవున్న అజ్ఞానాన్ని మనం వూహించనుకూడాలేం. మన గ్రామస్థులు పరరాజ్యం దానివల్ల వస్తున్న ముప్పుల్నిగురించి ఎరుగనే ఎరుగరు. ఈ విషయమై వారికేమైన కొంచెం జ్ఞానం వుంటే దానివల్ల మనమీద రాజ్యంచేసే ఖామందుల గొప్పదనం చూచి గుండె లవిసిపోవడం, తమ నిస్సహాయత్వానికి నిట్టూర్పు విడవడం మాత్రమే జరుగుతూవుంది. దీనికి ప్రత్యామ్నాయంగా కలిగేది భయమూ, విదేశీయుడన్నా, వాడి రాజ్యమన్నా హేయభావమూను. ఈ దాస్యశృంఖలాన్ని త్రెంచుకునే ఉపాయం వారికేమి తెలుసు? విదేశస్థులు మనదేశంలో వుండడానికి మన బలహీనత, మన అజ్ఞానమే కారణమనిన్నీ, విదేశ ప్రభుత్వం వదిలించుకునే శక్తి వారిదగ్గిరే వుందనీ వారికి బొత్తిగా తెలియదు. కనుక ముందు వయోజన విద్యావిధానం రాజకీయ పరిజ్ఞాన ప్రచారంతో ప్రారంభించమంటాను. ఈ ప్రచారం మనం నిర్భయంగా సాగించవచ్చు. ఈ మాదిరి ప్రచారానికి ప్రభుత్వం ఇకముందు ఎటువంటి బాధను కలిగించదనే నమ్ముతాం.

ప్రభుత్వమేదైనా అడ్డంకు పెడితే మనం ఈ అధికారానికై పోట్లాడి తీరవలసినదే. ఇంత మాత్రం చిన్న అధికారమైనా లేకుండా మనం స్వరాజ్యానికి ప్రయత్నమే చేయలేము. ఈ పనులన్నీ బాహాటంగా చేయాలని నేను కోరతాను. అహింసలో భయానికి తావు లేదు. అందువల్ల రహస్యానికి అందులో చోటులేదు. నోటితో ఈ ప్రచారం సాగిస్తూ దానితోపాటు అక్షరప్రచారంకూడ మనం చేస్తూవుండవచ్చు. ఇందులోనే ఒక గొప్ప విశేషం వుంది. స్వల్పకాలంలో విద్యాప్రచారం చేయడానికి ఎన్నో పద్ధతులు ఇంతవరకు అవలంబింపబడుతూ వచ్చాయి. నా యీ ప్రణాళికప్రకారం పనిచేసేవారికి కావలసిన సూచనలు ఇవ్వడానికి విశాలమైన ప్రణాళిక నేర్పరచడానికీ పరిజ్ఞాతలైన పండితుల కమిటీ వొకదానిని వర్కింగుకమిటీ ఏర్పాటుచెయ్యవచ్చు. నేను ఇక్కడ కొన్ని సూచనలు మాత్రమే చేశాను. దీనివల్ల పని ప్రారంభించడానికి తగినపద్ధతి బోధపడకపోవచ్చు. ఈ పని ప్రతి కాంగ్రెసుమనిషీ చేయడం కష్టం. ఎంతో విశేష జ్ఞానముంటేనేకాని ఈ పనిలో చేరకూడదు. ఉపాధ్యాయవృత్తిలోవున్న కాంగ్రెసువాదులు నా యీ ప్రణాళిక ప్రకారం పనిచేయడానికి అవసరమైన సూచనలు సులభంగా తయారుచేయవచ్చు.

## ౯ స్త్రీ జాతి: వారి అభ్యున్నతి

స్త్రీ యొక్క అభివృద్ధినికూడ నేను నిర్మాణ కార్యక్రమంలో చేర్చాను. సత్యాగ్రహంమూలంగా స్త్రీలు తామున్న అంధకూపంలోనుంచి స్వయంగా బయటకు వెలువడినమాట వాస్తవమే. ఇంకొక విధంగా స్త్రీలు ఇంత త్వరలో, ఇంత సులువుగా ముందుకు వచ్చివుండేవారు కారు. కాంగ్రెస్‌వాదులు స్వాతంత్ర్య పోరాటంలో స్త్రీలు కూడా సమాన భాగస్వాములుగావుండడం అవసరమని గమనించలేదు. సంఘ సేవకులకు స్త్రీ నిజమైన సహకారిగావుండడం అవసరమనికూడ వారు గుర్తించలేదు. స్త్రీ ప్రాచీన ఆచారం మూలముగానూ, చట్టంమూలంగానూ అణగిపోయి వుంది. ఈ అధోగతికి పురుషుడే బాధ్యుడు. స్త్రీకి ఎంతమాత్రం దీనితో సంబంధంలేదు. అహింసాత్మకమైన జీవితంలో తన జీవిత పద్ధతిని నిర్మించడానికి పురుషునికున్న అధికారం స్త్రీకికూడవుంది. కనుక సంఘాభివృద్ధికి ఏర్పడే చట్టాలకు ఇద్దరి సహకారం, సలహా అవసరం. ఇట్టి చట్టాలను బలవంతంగా ప్యాసుచేయడం అన్యాయం. పురుషులు స్త్రీలపట్ల తాము చూపే ప్రవర్తనలో ఈ న్యాయాన్ని పూర్తిగా గుర్తించలేదు. స్త్రీలను మిత్రులుగానూ, సహకర్మిణులుగానూ చూచేదానికిబదులు తామే ఖామందులమనీ, ప్రభువులమనీ పురుషులు

అనుకుంటున్నారు. భారతీయ స్త్రీలకు చేయూతనిచ్చి వృద్ధిలోకి తీసుకువచ్చే అవకాశం కాంగ్రెసువాదులు కల్పించుకోవాలి. జీవితమంతా బానిసత్వంలోనే ఉంటూ, స్వాతంత్ర్యం పొందగలమనే జ్ఞానంలేని పాతకాలపునాటి బానిసలస్థితిలో మన స్త్రీలు వున్నారు. ఎప్పుడైనా స్వాతంత్ర్యంవస్తే ఏమిచేయాలో తెలియకుండాకూడా వారి స్థితి వుంది. స్త్రీలకు, తాము పురుషుల సోదరులమని భావించేటట్లు పురుషులు వారికి నేర్పాలి. తమకు పురుషులతో సమానమైన అంతస్తువుందనీ, తామకూడా పురుషులతో సమానంగా పాటుపడగలనే దృష్టి స్త్రీలకు కలిగేటట్లు కాంగ్రెసువాదులు పని చేయాలి.

మనం కావాలనుకుంటే ఈ మార్పు కష్టంకాదు. కాంగ్రెసువాదులు తమ యిండ్లలోనే మొదట పని ప్రారంభించాలి. భార్యలను మనం ఆటబొమ్మలలాగ, భోగపాత్రలలాగ చూడకూడదు. మనం చేస్తూవున్న సేవలో సమానంగా పనిచేసే మిత్రులలాగ మనం వారిని చూడాలి. ఈ వుద్దేశ్యసిద్ధికోసం పనిచేయడానికి కావలసిన చదువు వున్న స్త్రీలు తమ భర్తలదగ్గరనుండి జ్ఞానాన్ని సంపాయించుకోవాలి. మన తల్లుల విషయంలోనూ, కుమార్తెల విషయంలోకూడా మనం ఈ గౌరవాన్నే చూపించాలి. నిస్సహాయులైన భారతీయ స్త్రీలను గురించి, మాత్రమేచెప్పి, అట్టి పురుషుల విషయమై నేనేమీ వ్రాయలేదని ఎవరూ ఏమీ అనుకోవద్దు. గ్రామాల్లో సాధారణంగా స్త్రీలకు పురుషుల్తో సమానమైన అంతస్తువుందనీ, కొన్ని ఇళ్ళల్లో రాజ్యమే వారిదనీ నాకు తెలియకపోలేదు. కాని నిష్పాక్షికంగా బయటినుంచి చూచేవాళ్లకు స్త్రీలకు పరిపాటిగా వస్తూవున్న అంతస్తు, చట్టపూర్వకంగావున్న హక్కు, న్యాయపూర్వకమైనది కాదనీ, అందులో సమూలంగా మార్పు కలగాలనీ తప్పక తోస్తుంది.

# ఆరోగ్యం, పరిశుభ్రత

గ్రామ పారిశుధ్యాన్ని గురించి వ్రాసినతర్వాత, ఆరోగ్యము, పరిశుభ్రతనుగురించి ప్రత్యేకంగా వ్రాయవలసిన అవసరమేమిటని అడగవచ్చు. పారిశుధ్యంతోపాటు ఈ రెంటినీ కలిపేసి వుండవలసింది. కాని ఈ రెండు విషయాలనూ వేరుచేస్తేనే బాగా వుంటుందని నాకు తోచింది. ఆరోగ్యము, పరిశుభ్రతను గురించి విపులంగా చెప్పవలసి వుంటుంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, పరిశుభ్రతనుగురించి తెలుసుకోవడం, ప్రత్యేకంగా మనం అభ్యసించి ఆచరించాలి. నాగరికమైన సంఘంలో పౌరులంతా ఆరో

గ్యాన్నిగురించి చక్కగా తెలుసుకుని వుంటారు. మనుష్యజాతిలో పరంపరాగతంగా వస్తూవున్న ఎన్నో రోగాలకు కారణం ఈ ఆరోగ్య నియమాలు వుల్లంఘించడం, వాటి సంబంధమైన జ్ఞానం లేకపోవడమేనని నిస్సందేహంగా తేలిపోయింది. మనలను పీడించే దారిద్ర్యమే మన మితిమీరిన మరణసంఖ్యకు కారణం కావచ్చు కాని, మనం జన సముదాయానికి ఆరోగ్యము, పరిశుభ్రతనుగురించి చక్కగా బోధిస్తే ఈ చావులు తగ్గిపోవచ్చు.

"శరీరమాద్యం ఖలు ధర్మసాధనం" అనేది మానవసంఘానికి మొదటి ధర్మం. ఒళ్లు బాగావుంటే మనసులో మాలిన్యం ఉండదనే విషయం విస్పష్టం. శరీరానికీ మనసుకూ అవినాభావ సంబంధం వుంది. నిర్మాలిన్యమైన మనసుగల వ్యక్తి క్రోధాన్ని జయిస్తాడనీ, ఆరోగ్య నియమాల్ని పాటిస్తాడనీ, అప్రయత్నంగానే ఆరోగ్యం సంపాయిస్తాడనీ చెప్పవచ్చు. కనుక కాంగ్రెసువాదులు నిర్మాణ కార్యక్రమంలోని ఈ విషయాన్ని నిర్లక్ష్యం చేయరని నమ్ముతాను. ఆరోగ్యానికీ, పరిశుభ్రతకూ సంబంధించిన మూలసిద్ధాంతాలూ చాలా సులువైనవి. చాలా తేలికగాకూడా నేర్చుకోవచ్చు. వీటిని పాటించడంలోనే కొంచెం కష్టంవుంది. ఆ సిద్ధాంతా లివి—

1. నీ ఆలోచనలు పవిత్రంగా వుంచుకో. నిష్ప్రయోజనమైన, అపవిత్రమైన మనోభావాల్ని కొంత చేరనీయకు.

2. రాత్రి పగలు అతి స్వచ్ఛమైన గాలి పీలుపు.

3. బుద్ధికీ, శరీరానికీ సమానమైన పని కల్పించు.

4. తిన్నగా నిలుచు. తిన్నగా కూర్చో.

5. మురికిలేకుండా పరిశుభ్రంగా ప్రతి పనీ చెయ్యి.

6. అంతస్సులోనూ వెలుపల నీవు పవిత్రుడవని తెలిసేటట్లు ప్రవర్తించు.

7. సాటివారికి సేవ చేయడంకోసము బ్రతికడానికే భోజనం చెయ్యి.

8. ఇంద్రియలాల సత్వంకోసం బ్రతకకు.

9. నీవు తినే తిండి బుద్ధినీ, శరీరాన్నీ సరియైన స్థితిలో వుంచడానికీ కావలసినంతగానే వుండాలి.

10. నీ తిండినిబట్టి నీకు గుణాలుకూడ అబ్బుతాయి.

11. నీవు త్రాగే నీరు, తినే తిండి పరిశుభ్రంగా వుండాలి. నీవు ఒక్కడికే పరిశుభ్రంగావుంటే చాలదు. నీవు స్వయంగా ఎంత శుభ్రంగా వుండాలనుకుంటావో అంతకు మూడురెట్లెక్కువ నీ ఇరుగుపొరుగువారు పరిశుభ్రంగా వుండేటట్లు ప్రయత్నించు.

# జాతీయైక్యతకు జాతీయ భాష అవసరం

మాతృభాషకంటె ఇంగ్లీషుభాషమీద మన కున్న ప్రేమమూలంగా విద్యావంతులై రాజకీయదృష్టి కలిగిన వర్గాలకూ, జనసముదాయానికీ మధ్య ఒక పెద్ద అగడ్త ఏర్పడింది. దీనివల్ల మన దేశీయభాషలన్నీ కూడ నిరాశాతీసినయి. మాతృభాషలో ఏమైనా గంభీరభావాలు వ్యక్తపరిచాలంటే మనం తడుముకుంటాము. దేశీయ భాషల్లో పారిభాషికశబ్దాలు ఏర్పడనేలేదు. దీనివల్ల చాల విఘాతకరమైన ఫలితం కలిగింది. మన జనసముదాయాలకు ఆధునిక విద్య అలిమిగాకుండా పోయింది. మన భాషల్ని ఈ మాదిరిగా నిర్లక్ష్యపరిచినందువల్ల మన దేశానికి కలిగిన చెరుగును వూహించడం కష్టం. మనం మన యుగానికి ఎంతో సమీపంగా వుండడమే దీనికి కారణం. మనం మన భాషలకు చేసుకున్న ఈ కీడును తొలగించకపోతే జనసముదాయపు బుద్ధిని బంధించివేసినట్టు అయిపోతుంది. ప్రజాసముదాయంనుంచి స్వరాజ్య నిర్మాణానికివచ్చే తోడ్పాటు తక్కువయిపోతుంది. అహింసమూలంగా ఏర్పడిన స్వరాజ్యంలోవుండే గుణం ఏమిటంటే, అందులో ప్రతి వ్యక్తీ స్వాతంత్ర్యోద్యమానికి ఏ కొంతో మేలు చేస్తాడు. మనం స్వాతంత్ర్యోద్యమానికి చేసే ప్రతి ప్రయత్నం సంపూర్తిగా ప్రజా సముదాయానికి తెలియకపోతే వారు మనకీ తోడ్పడలేరు. వారి తోడ్పాటు కావాలంటే, వారికి మనం ప్రతి విషయం వారి భాషలోనే బోధించి తీరాలి.

ఇంతేకాకుండా అంతర్ప్రాంతీయ వ్యవహారానికి మన దేశీయ భాష ఒకటి వుండాలి. అది మన దేశీయుల్లో చాలామందికి తెలిసి, తేలికగా నేర్చుకుని, అర్థం చేసుకోగలిగిందిగావుంటే మంచిది. ఈ భాష హిందీయే అనేది నిర్వివాదాంశం. ఉత్తర హిందూదేశంలోని హిందువులు—మహమ్మదీయులు దీనిని మాట్లాడి అర్థం చేసుకో గలరు. ఫారసీ లిపిలో వ్రాస్తే దీనినే ఉర్దూ అంటారు. 1925 లో జరిగిన కాన్పూరు కాంగ్రెసులో దీనినే హిందూస్తానీ అన్నాం. అప్పటినుంచీ ఒట్టి సిద్ధాంతంమూలంగా మన కిది రాష్ట్రభాషగా వుంది. ఒట్టి సిద్ధాంతమని ఎందుకంటున్నానంటే, కాంగ్రెసు వాదులు ఇంతవరకు దీనిని ఆచరణలో పెట్టలేదు. 1920 సంవత్సరానికి, తర్వాత కాలానికి ఈ భాషా విషయమై అంతగా మార్పు కలగలేదు. 1920 నుంచీ దేశీయ భాషలకు ప్రాధాన్య మివ్వడానికి దృఢమైన ప్రయత్నం మనం చేసినమాట వాస్తవమే. జనసముదాయంలో మనం చేసిన రాజకీయ ప్రచారం మూలంగా మన భాషలకు ప్రాముఖ్యం హెచ్చింది. దేశానికి కావలసిన సామాన్య భాష నొక దానినికూడ

కాంగ్రెసువాదులు కాంగ్రెసులోనూ, కాంగ్రెసుకమిటీ మీటింగులలోనూ వాడుతూ వున్న విషయంకూడ వాస్తవమే. అయినప్పటికి ఇంకా అనేకమంది కాంగ్రెసువాదులు ఈ తీర్మానాన్ని ఆచరణలోకి తీసుకురాకపోవడం చింతాకరం. ఇందువల్లనే కొంతమంది కాంగ్రెసువాదులు ఇంగ్లీషు మాట్లాడుతామని పట్టుబట్టడం, తమ కోసమై ఇతరులను కూడ ఇంగ్లీషులో మాట్లాడమని బలవంతం పెట్టడం జరుగుతోంది. ఇది చాలా సిగ్గుకరమైన విషయమని నా యభిప్రాయం. ఇంగ్లీషు భాషయొక్క సమ్మోహనాస్త్రంలోనుంచి మనమింకా తేరుకోలేకుండా వున్నాం, ఇంగ్లీషు వ్యామోహంలో పడి మనం హిందూదేశం తన గమ్యస్థానాన్ని చేరడానికి అడ్డుపడుతున్నాం. ఇగ్లీషు నేర్చుకోడానికి మనం ఎన్ని సంవత్సరాలు ఖర్చు పెడుతున్నామో, అన్ని మాసాలైనా హిందూస్తానీ నేర్చుకోవడానికి వినియోగించకపోతే మనకు జనసామాన్యం మీదవున్న ప్రేమపై ప్రేమయేనని చెప్పాల్సివోస్తుంది.

## మాతృభాషా ప్రేమ

పైన ఇంతవిపులంగా వ్రాసిన తర్వాత ఈ విషయమై వ్రాయడం అనవసరమే హిందూదేశమంతా ఒక్కటేనని తలచేవారికి రెండువిషయాలలోనూ ఒకేమాదిరి ప్రాముఖ్యం కన్పడుతుంది.

## ఆర్థిక సమానత్వం

అహింసాపూర్వకమైన స్వాతంత్ర్యానికి ఆర్థిక సమానత్వం సింహద్వారం. ఆర్థిక సమానత్వమంటే ధనవంతులు కార్మికుల మధ్య శాశ్వతంగావుండే సంఘర్షణ పోవడమన్నమాట. ఇందువల్ల దేశంలోని ధనమంతా గుప్పెట్లో పెట్టుకున్న ధనవంతుల నందరినీ క్రిందికి దించడం, క్షుధార్తులై వస్త్రవిహీనులుగావున్న కోటానుకోట్ల జనాన్ని పైకి లేవనెత్తడం జరుగుతుంది. ధనవంతులకూ, ఆకలితో మాడే లక్షలాది జనానికి భేదం వున్నంతకాలం అహింసాత్మక పద్ధతిమీద ప్రభుత్వం యేర్పడడం అసంభవం. గుడిసెలోవుండే నిరుపేదకూ ఢిల్లీలో రాజమహాలులో నివసించె కోటీశ్వరునికీవున్న తారతమ్యం స్వరాజ్యంవస్తే ఒక్కరోజుకూడ వుండదు. ఈ స్వరాజ్యంలో ధనికుడికి, పేదకీ సమానమైన రాజకీయాధికారం వుండాలి. స్వయం సిద్ధంగా ధనవంతులు తమకున్న ధనమును, తద్వారావచ్చే హక్కుల్ని విడిచిపెట్టకుండానూ, వాటిని జనసముదాయంయొక్క లాభంకోసం ఉపయోగించకుండానూ వుండే దేశంలో విప్లవం రావ

డమూ, నెత్తురునదులు ప్రవహించడమూ నిశ్చయమనే చెప్పవచ్చు. లోకు లెంత పరిహాసించినా, ధనవంతులు దేశంయొక్క ధనానికంతా ట్రస్టీలనే నా సిద్ధాంతములో నాకు నమ్మకంపోదు. ఇటువంటి సిద్ధాంతం అమలులోకి రావడం కష్టమే. అహింసమాత్రం పెంపొందడం కష్టంగాదా? అయినా, 1920 లో ఈ మోకాళ్ళపర్వతం ఎక్కాలని మనం అనుకున్నాం. మన ప్రయత్నాలు విఫలంకావనికూడ మన అనుభవంవల్ల తెలిసింది. అహింస ప్రతిదినం ఫలీభూత మవుతూనే వస్తూవుంది. దానికి కావలసిన ప్రసిద్ధి కూడ కలుగుతోంది. కాంగ్రెసువాదులు తమ కర్తవ్యమేమో, తామేమి చేయవలసివుందో ఒకసారి స్వాత్మనిరీక్షణం చేసుకోవాలి. అప్పుడప్పుడు కాంగ్రెసుఇచ్చే సూచనను అంగీకరిస్తూ, కాస్తోకూస్తోచేస్తే చాలదు. దేశంలోవున్న ఈ సమానత్వం పోగొట్టేమార్గం ఏదా అని వారు యోచించాలి. అది హింసాత్మకమే కానీయండి, అహింసాత్మకమే కానీయండి. హింసామార్గం మన కందరికీ తెలుసు. అందులో ఎక్కడా సాఫల్యం కలగలేదు. రష్యాలోమాత్రం ఈ మార్గం చాలా జయప్రదంగా సాగినదంటారు. నా కిందులో సందేహం. దీనియొక్క ఉపయోగం నిర్వివాదకరమని అప్పుడే చెప్పడానికి వీల్లేదు.

మనం చేసే అహింసాత్మక ప్రయోగం ఇంకా సంపూర్ణం కాలేదు. ప్రపంచానికి చూపెట్టడానికి మనవద్ద ఇంతవరకు ఏమీలేకపోలేదు. అభివృద్ధి చాలా నెమ్మదిగా కన్పడుతూవున్నా మన పద్ధతి సమానత్వంవైపుకు దారితీస్తోందని నా మనసుకు తోచుతూవున్నది. అహింస అంటే మనసులో మార్పురావడం. ఈ మార్పువస్తే అది శాశ్వతంగా వుండిపోతుంది.

అహింసా పద్ధతిమీద ఒకసారి సంఘనిర్మాణం జరిగిన తర్వాత బయటనుంచీ, లోపలనుంచీ దెబ్బ ఎటునుంచివచ్చినా అది తట్టుకుంటుంది. కాంగ్రెసులో ధనవంతులు కూడవున్నారు. వారు మనకు దారిచూపాలి. మనం జరిపే ఈ సత్యాగ్రహం తుదిసారి పోరాటం. కనుక కాంగ్రెసులోవున్న ప్రతివ్యక్తి ఒకసారి మనసును పరిశోధించి చూచుకోవాలి. మనం సమత్వాన్ని ఎప్పటికైనా సంపాదించాలంటే దానికి పునాదులు ఇప్పుడే వెయ్యాలి. స్వరాజ్యం వచ్చినతర్వాత ఈ సంస్కారాలన్నీ సులభంగా జరుగుతాయని అనుకొనేవారు పొరబడుతున్నారు. వారికి అహింసాత్మకమైన స్వరాజ్యం యొక్క ఓనమాలే రావన్నమాట. ఈ సంస్కరణలు ఆకాశంనుంచి ఊడిపడవు వీటిని మన మందరంచేరి స్వప్రయత్నంమీద ఒక్కొక్క రాయిచొప్పున నిర్మించుకోవాలి. ఈ విషయమై మనం చాలాదూరం ముందుకుసాగాము. జాజ్వల్యమానమైన స్వరాజ్య

జ్యోతిని సందర్శించడానికి ముందు మనం ఇంకా ఎన్నో ఇక్కట్లకు లోను కావలసి వుంది. ప్రతి కాంగ్రెసువాదీ ఆర్థిక సమానత్వానికి తానెంత పని చేశానని ప్రశ్నించుకోవాలి.

## కర్షకుడు, కార్మికుడు, విద్యార్థి

నిర్మాణ కార్యక్రమంయొక్క పదమూడు పాయింట్లు పూర్తిగా నిక్కడ చర్చించాను. ఇందులోని ప్రతి విషయం మన స్వరాజ్యప్రణాళికలో ఎంత అవసరమో, ప్రతి కాంగ్రెసువ్యక్తి, ఇందులో ఎంత పనిచేయగలడో చూపించాను. "చేయవలసిం దంతా ఇంతే" అని చెప్పడం కష్టం. స్వరాజ్య సౌధ నిర్మాణానికి 40 కోట్ల చేతులూ కలవాలి. నేను సూచించిన పదమూడు పాయింట్లకూ ఇంకా ఇన్నో కలపవచ్చు. దీని కింతటికీ మధ్య బిందువు రాట్నం. మిగతావన్నీ దీని నాశ్రయించుకుని వున్నాయి. దేశానికి ఎడతెగని ప్రయోజనకారియైన సేవ చేయాలన్న భావస్ఫురణ చరఖానుండి రావాలి. నేనింతవరకు కర్షకుల్నీ, విద్యార్థుల్నీ గురించి ఇక్కడ చెప్పలేదేమని కొంతమంది అడగవచ్చు. కావాలని నేను వారినిగురించి చెప్పడం మానివేశాను. వారుకూడ మిగతా వారిలాగ ఈ పదమూడు విషయాలకోసం సమానంగా పనిచేయవలసిందే. వారు చేయగలపని స్వల్పమైందనే ఉద్దేశ్యంతో నేను వారినిగురించి వ్రాయడం మానలేదు. ఈ స్వరాజ్యసమరంలో వారికెంత ప్రాధాన్యం వుందో నాకు బాగా తెలుసు. కాని ప్రశ్న ఏమిటంటే, వీరినందరినీ కూడగట్టి నడిపించే వారెవరు? అహమ్మదాబాదులో మిల్లు కూలీలనందరిని కూడగట్టి నేను నడిపించాను. ఇది చాలా అనుకరణీయమైన ఆదర్శ సంస్థయని నా అభిప్రాయం. ఈ కార్మికసంస్థ ఇంతవరకెప్పుడూకూడ తన ప్రయత్నాల్లో విఫలం కాలేదు. అల్లరి ఆగాలు, ఆడంబరం లేకుండా దిన దినం అభివృద్ధి పొందుతూ వుంది. ఈ సంస్థక్రింద ఒక ఆస్పత్రి, కూలీలబిడ్డలకు కావలసిన పాఠశాలలు, వయోజన విద్యకు కావలసిన తరగతులు, స్వంత ప్రెస్సు, ఒక ఖద్దరు డిపో, వసతిగృహాలు వున్నాయి. కార్మికులకందరికీ ఓట్లున్నాయి. ఎన్నికల నిర్ణయం ఈ కార్మికులమీదే ఆధారపడివుంటుంది. ప్రాంతీయ కాంగ్రెసుకమిటీ ప్రయత్నఫలితంగా కార్మికులకు ఓట్లు లభించినాయి. కాంగ్రెసుపార్టీ వ్యవహారాల్లో ఈ కార్మికసంస్థ ఇంతవరకు ఇప్పుడూ జోక్యం కలగజేసుకోలేదు. అహమ్మదాబాదు మునిసిపాలిటీలో ఈ సంస్థకు మంచి పలుకుబడివుంది. సంపూర్ణమైన అహింసాపద్ధతులమీద సమ్మెల్నికూడ ఈ సంస్థ జయ

ప్రదంగా నడిపించింది. మిల్లు ఖామందులు, కూలీలు బహుభాగం తమ తగాయిదాలను స్వాంతంగా పంచాయితీదారుల్ని ఏర్పరచి తీర్చుకుంటారు. నన్నడిగితే కార్మిక సంస్థల నన్నిటినీ అహమ్మదాబాదు పద్ధతిమీద నడిపిస్తాను. ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు స్వభావాన్ని ఈ సంస్థ ఎప్పుడూ పట్టించుకొనలేదు. ఆ కాంగ్రెసు ఈ సంస్థలోకి రానూలేదు. ఆ కాంగ్రెసు ఎప్పుడో ఒకనాడు అహమ్మదాబాదు పద్ధతిని అంగీకరిస్తుందనీ, అహమ్మదాబాదు సంస్థను తనలో చేర్చుకుంటుందనీ నేను ఆశిస్తున్నాను. నేనీ విషయమై తొందరపడను. అది తనంతటతాను వచ్చినప్పుడే వస్తుంది.

ఇక కిసాను ఉద్యమాన్ని గురించి రాజకీయంగా అధికారం సంపాయించడానికే కర్షకులు ఉపయోగపడుతున్నారని నా భయం. అహింసా పద్ధతికి ఇది వ్యతిరేకమని నా అభిప్రాయం. కిసానులను కూడగట్టడానికి, నడిపించడానికీ కావలసిన పద్ధతుల్ని తెలుసుకోవాలంటే నేను చంపారనులో నడిపించిన సత్యాగ్రహ విషయం తెలుసుకోవచ్చు. హిందూదేశంలో ఇటువంటి ఉద్యమం నడపడానికిది మొదటిసారి. దీని ఫలితం ప్రపంచమంతా యెరుగును. ఇది జనసామాన్యమంతా వ్యాపించి మొదటినుంచి తుదివరకూ అహింసమీద నడిచింది. ఇందులో ఇరవైలక్షల కర్షకులు చిక్కుకున్నారు. నూరు సంవత్సరాలనుంచి కర్షకులు పడే ఇబ్బందుల్ని పోగొట్టుకోవడానికి చిన్నరూపంగా ఈ తిరుగుబాటు నడిపించాము. ఇందుకోసమై ఎన్నోసార్లు హింసాపద్ధతులమీద కూడ తిరుగుబాట్లు జరిగినాయి. కాని వాటిని గవర్నమెంటు అధఃపాతాళానికి త్రొక్కివేసింది. అయితే నాల్లో నా అహింసాపద్ధతికి పూర్తిగా గెలుపు కలిగింది. ఎంతమాత్రం ప్రచారము, ప్రయత్నమూ లేకుండానే చంపారను కర్షకులకు రాజకీయ దృష్టికూడా కలిగింది. తమ కష్టనివారణకై అహింసవల్ల కలిగిన ఫలితానికి బదులుగా వారు కాంగ్రెసుకూడ చేరారు. బాబు బ్రజకిశోర ప్రసాదు, బాబు రాజేంద్రప్రసాదుల నాయ నాయకత్వం క్రింద సత్యాగ్రహోద్యమంలో కూడ ఎంతో త్యాగంచేసి వారు పైకి వచ్చారు. నేను ఖేడా, బార్డోలీ, బోర్సదులో నడిపించిన కర్షకోద్యమాన్ని కూడా పాఠకులు పరిశీలించవచ్చు. కిసాను ఉద్యమం జయప్రదంగా నడిపించడానికి అసలు రహస్యమేమిటంటే, కర్షకుల్ని మన లాభంకోసం ఉపయోగించుకో కూడదు, వారి లాభంకోసం మనం పనిచెయ్యాలి. వారికి జరిగే అన్యాయాన్ని గురించి మన మేదయినా ఉద్యమం లేవదీస్తే కర్షకులకు అర్థమవుతుంది. అహింసనుగురించి మనమేమీ వారికి నూరిపోయనక్కరలేదు వారు తమకు తెలిసిన పద్ధతిమీద తమ కష్టాల విరుగుడుకోసం

పాటుపడడానికి సిద్ధమౌతారు. ఫలితం కలిగినతరువాత వారు అనుసరించిన పద్ధతి అహింసయేనంటే వారికి సులువుగా అర్థమైపోతుంది. ఈ తార్కాణాలవల్ల కర్షకుల మధ్య పనిచేయవలసిన పద్ధతులేమిటో కాంగ్రెసువాదులు తెలుసుకోవాలి కర్షకుల్నికూడ గట్టుకు రావడానికి క్రొంతమంది కాంగ్రెసువాదులు తొక్కినదారి కర్షకులకు ఏమీ లాభకారి కాకపోగా నష్టంకూడా కలిగించిందని సరంటాను ఏది యెల్లావున్నా అహింసపద్ధతిని మంత్రం వారు ఉపయోగించలేరనే చెప్పాలి. కొంతమంది కర్షక నాయకులు తమకు అహింసలో నమ్మకంలేదని వొప్పుకుంటారు. దీనికి వారం వారిని అభినందించవలసిందే వారికి నా సలహా యేమిటంటే, వారిటువంటి కర్షకోద్యమాలకు కాంగ్రెసు పేరును ఉపయోగించనూవద్దు, కాంగ్రెసునాయకులుగా పనిచేయనుకూడదు.

పెద్ద యెత్తుమీద హిందూదేశమంతటిలోను కార్మిక కర్షకోద్యమాలు నేను ఎందుకు నడిపించలేదో ఇందువల్ల బోధపడుతుంది. మన శక్తినంతా మనం ఒకేవైపున వుపయోగిస్తే ఎంత బాగుంటుంది? ఇంత గొప్పదేశంలో మనమంతా ఏకోన్ముఖులమై పనిచేయడం కూడా కష్టమే కావచ్చు. అహింసలో బలాత్కారానికి తావులేదు. నచ్చ చెప్పడం, అహింసాపద్ధతియొక్క ప్రత్యక్షమైన తార్కాణం అందరినీ మనవైపుకు తిప్పితీరుతుంది.

## మాతృదేశంపట్ల విద్యార్థుల విధులు

విద్యార్థుల్ని గురించి ఒక్కముక్క చివరికి చెప్పదలచుకున్నాను. విద్యార్థులకూ, నాకూ చిరకాలంనుంచి స్నేహం. మేము ఒకర్ని ఒకరం బాగా ఎరుగుదుము. వారు నాకెంతో సహకారం చేశారు. అనేకమంది కాలేజి విద్యార్థులు నాతో పని చేశారు. మన భవిష్యత్తు వారిమీదే ఆధారపడివుంది. సహాయ నిరాకరణోద్యమం చురుకుగా సాగుతున్న ఆ రోజుల్లో నేను వారిని స్కూళ్లుకూడ విడిచిపెట్టమన్నాను. కాలేజీలు విడిచిపెట్టిన కొంతమంది ప్రొఫెసర్లూ, విద్యార్థులూ అట్లనే నిలిచివుంటే దేశానికి ఎంతో మేలుచేసేవారు. తగిన వాతావరణం లేకపోవడంచేత కళాశాలలు విడిచిపెట్టవలసిందిగా రెండోసారి నేను వారిని కోరలేదు. ఆధునిక విద్యావ్యామోహంలో- అది వట్టి నిష్ప్రయోజకము, అస్వాభావికము అయినప్పటికీ విద్యార్థులు నఖశిఖ పర్యంతం మునిగివున్నారు. కాలేజి చదువువల్ల ఉపాధి దొరుకుతుంది. పెద్దపెద్దవర్గాల్లోకి ప్రవేశించడానికి దానివల్ల సులువు ఏర్పడుతుంది. న్యాయమైన విద్యాపిపాస ప్రస్తుత

పద్ధతులమీద తప్ప మరొకవిధంగా జరగనిమాట నిజమే కాని మన మాతృభాషకు బదులుగా మనకు దరిదాపులేని విదేశభాషలో జ్ఞానం సంపాయించడానికి అమూల్యమైన ఎన్నో సంవత్సరాలను వృథాపుచ్చడానికి కూడా వారు వెనుకాడడంలేదు. ఇది పాపమన్నమాటే వారికి తోయడంలేదు. విద్యార్థులూ వారి ఉపాధ్యాయులూ అసలికి భావాల్ని, విజ్ఞానాన్ని సంపాయించడానికి మాతృభాషలు నిరుపయోగమనే నిశ్చయించినట్లు కన్పిస్తుంది. మన దేశస్థుల విషయమై ఎలా పనికిరావనుకుంటున్నారో? అని నా కాశ్చర్యం. నాగరకులంతా జపానుభాషలో గడుపజాలుతున్నట్లు తెలుస్తుంది. చైనా సర్వసేనాధిపతికి ఇంగ్లీషురాదంటారు. ఇదీ మన విద్యార్థులస్థితి.

వీరిలోనుంచే మన భావినాయకులు రావాలి వీరి నాకర్షించడానికి దురదృష్టవశాత్తు ఎన్నో మూలలనుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అహింస అంటే వారికి నిరుత్సాహం. దెబ్బకిదెబ్బ. ఒక దెబ్బకు రెండు దెబ్బలు అంటే వారికి తేలికగా అర్థం అవుతుంది. అది క్షణికం అయినా దీనివల్ల వెంటనే ఫలితం కనపడ్డట్టు వుంటుంది. మనం పశువుల మధ్యవున్నా, మనుష్యుల మధ్యవున్నా ప్రపంచమంతా వ్యాపిస్తున్న శాశ్వత సంగ్రామంలో ఈ పశుబల ప్రయోగానికి అంతులేదు. అహింసను అర్థం చేసుకోవాలంటే ఓపికతో పరిశోధించాలి. ఇంకా ఎంతో ఓపికతో కష్టపడి ఆచరించాలి. కార్మికుల్ని, కిసాన్లని కూడగట్టుకోడానికి ఏ కారణాలవల్ల నేను ప్రయత్నం చెయ్యలేదో, విద్యార్థుల మధ్య పనిచెయ్యక పోవడానికికూడా అవే కారణాలు. నేను వారివలెనే ఒక విద్యార్థిని. అయితే నా విశ్వవిద్యాలయం వేరు. నా విశ్వ విద్యాలయంలో చేరి నేను చేసే పరిశోధనలో పాల్గొనడంకోసం సదా సర్వదా నేను వారిని ఆహ్వానిస్తూనే వున్నాను. ఇందుకు నా షరతులివి—

(1) విద్యార్థులు రాజకీయపక్షాల్లో చేరకూడదు. వారు విద్యార్థులు, జిజ్ఞాసువులు. రాజకీయవేత్తలు కారు.

(2) వారు రాజకీయసమ్మెలు అవలంబించకూడదు. వారిలోకూడ వీరాగ్రేసరులుండవచ్చు. కాని ఆ వీరనాయకులపట్ల శ్రద్ధ, నాయకుల్లోవున్న ఉత్తమత్వాన్ని అనుకరించి చూపెట్టాలి. నాయకులు జైళ్ళకు వెళ్ళితేనో, చస్తేనో, ఉరికంబాలెక్కితేనో సమ్మెలుకట్టి వారిపట్లవున్న భక్తి వెలుపరచరాదు. ఇట్టి సందర్భాలలో వారికి సహించరాని దుఃఖంకలిగితే, ఈ దుఃఖం విద్యార్థులకందరికీ కలిగితే, తమ ప్రధానాధ్యాపకుల

అనుమతితో పాఠశాలలు గాని, కళాశాలలు గాని మూయించవచ్చు, ప్రధానాధ్యాపకులు వారిమాటలు పెడచెవిని పెడితే వారు ఆయా సంస్థల వ్యవస్థాపకులకు పశ్చాత్తాపం కలిగి తిరిగిరమ్మని కోరేవరకూ విద్యార్థులు స్కూళ్ళను మర్యాదగా విడిచిపెట్టివేయవచ్చు. తమతోకూడ రానివారిమీద అధికారులమీద బలాత్కారాన్ని ఉపయోగించకూడదు. గౌరవంతోనూ ఐకమత్యంతోనూ ప్రవర్తిస్తే తాము తప్పక విజయాన్ని సాధిస్తామనే నమ్మకం వారికుండాలి.

(3) విద్యార్థులంతా శాస్త్రీయంగా సూత్రయజ్ఞం చేయాలి. తమ పనిముట్లు ఎప్పుడూ శుభ్రంగానూ, మంచి స్థితిలోనూ, తగిన స్థానంలోనూ పెట్టుకోవాలి. సాధ్యమైతే ఆ పనిముట్లు తాము స్వంతంగా చేసుకోవడం వారు నేర్చుకోవాలి. సహజంగానే వారి నూలు నాణ్యమైనదిగా వుంటుంది. నూలువడికే విధానానికి సంబంధించిన వాఙ్మయాన్నంతా నేర్చుకోవాలి. దానితో సంబంధమున్న ఆర్థిక, సాంఘిక, నైతిక, రాజకీయ తత్వాలన్నిటినీ వారు గ్రహించాలి. వారెల్లప్పుడూ ఖద్దరు బట్టలే ధరించాలి. తమకు కావలసిన వస్తువు గ్రామాల్లో తయారయింది దొరికితే విదేశాలనుంచి వచ్చింది కానీ యంత్రంలో తయారయింది కాని వారు ఉపయోగించకూడదు.

(5) వందేమాతర గీతాన్ని, జాతీయ పతాకాన్ని ప్రచారం చేయటంలో ఇతరులను బలవంతపెట్టరాదు. తాము స్వంతంగా జాతీయపతాకం వేసిన గుండీలు ధరించవచ్చు. ఇతరులను ధరించమని బలవంతం చేయకూడదు.

(6) స్వంతంగా త్రివర్ణపతాకం యొక్క సందేశాన్ని తాము ఆచరిస్తూ కులాభిమానానికి కాని, అంటరానితనానికి కాని మనసులో తావీయకూడదు. ఇతర మతాలకు చెందిన విద్యార్థుల స్నేహాన్ని సంపాయిస్తూ హరిజనుల్ని సోదరవత్‌గా ప్రేమించాలి.

(7) ఇరుగు పొరుగువారు గాయపడితే వెంటనే సాయం చేయాలి. పాటి గ్రామాలను పరిశుభ్రం చేయడానికి, పాకీపని చేయడానికి సంసిద్ధంగా వుండాలి. గ్రామంలోని పిన్నలకూ, పెద్దలకూ కూడా ఈ పని నేర్పించాలి.

(8) విద్యార్థులు జాతీయ భాషయగు హిందూస్థానీని నేర్చుకోవాలి. హిందూస్థానీయొక్క రెండురూపాలు అంటే హిందీ ఉర్దూ నేర్చుకోవాలి. అందువల్ల దానియొక్క రెండురూపాలతోనూ పరిచయం ఏర్పడుతుంది.

(9) వారు నేర్చుకున్న ప్రతి విషయం తమ మాతృభాషలోనికి తర్జుమాచేసి ప్రతి వారం తమ చుట్టుప్రక్కల గ్రామస్థులకు నేర్పించాలి.

(10) వారు రహస్యంగా ఏమీ చేయకూడదు. ఏ విషయంలోనూ అనుమానానికి తావివ్వకూడదు. పవిత్రమైన, నిగ్రహ పూర్వకమైన జీవితాన్ని గడుపుతూ నిర్భయులై సాటి విద్యార్థులను రక్షించడానికి సిద్ధంగా వుండాలి. ప్రాణాపాయమైనా సరకుచేయక అహింసాపద్ధతులమీద కలహాలు శాంతిపరచడానికి సిద్ధంగా వుండాలి. దేశంకోసం అంతిమ పోరాటం జరుగుతున్నప్పుడు సంస్థల్ని విడిచిపెట్టి అవసరమైతే దేశ స్వాతంత్ర్యంకోసం ఆత్మార్పణానికి సిద్ధంగా వుండాలి.

(11) స్త్రీ విద్యార్థినులపట్ల వారి ప్రవర్తన చాల సభ్యంగానూ, ఉదారంగాను వుండాలి.

నేను రూపురేఖలుగీచిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు కొంత అవకాశమిచ్చి తీరాలి. వారింతో కాలం సోమరితనంగా వృధా పుచ్చుతారని నాకు తెలుసు. తమ కాలానికి సరిగా లెక్కవేస్తే కొన్నిగంటలు రోజూ వారు తప్పక మిగిల్చవచ్చు. విద్యార్థుల్ని ఎవర్నీ అనవసరంగా నేను బాధపెట్టదలచుకోలేదు. అందువల్ల తాము చదువుకు ఉపయోగించేకాలంలో ఒక సంవత్సరం నాకు ఇవ్వమని నేను అడుగుతాను. ఒకేసారి పన్నెండుమాసాలు ఇవ్వమని అడగను. అప్పుడు కొంత అప్పుడు కొంత చొప్పున ఒక సంవత్సరం ఈ కార్యక్రమానికి వినియోగిస్తే చాలు. వారియొక్క ఈ ప్రయత్నంవల్ల వారికి మానసికంగానూ, నైతికంగానూ, శారీరకంగానూకూడా యోగ్యత, శక్తి ఏర్పడుతుంది. స్వాతంత్ర్యోద్యమానికికూడ కొంత సహాయం చేసినవారు అవుతారు.

## నాల్గవ అధ్యాయం

## (సత్యాగ్రహం—దాని స్థానం)

అహింసా పద్ధతులమీద నిర్మాణ కార్యక్రమంలో దేశమంతా అన్యోన్య సహకారంతో పని చేస్తే స్వరాజ్యం సంపాయించడానికి సత్యాగ్రహం అవసరమేలేదని నేనిదివరకే చెప్పాను. అటువంటి అదృష్టం వ్యక్తులకూ, జాతులకూ కలగటం చాలా అపురూపం. కాబట్టి దేశ వ్యాపకమైన అహింసా ప్రయత్నం చేయవలెనంటే, సత్యాగ్రహంయొక్క నడవడిక, స్వరూపం తెలుసుకోవడం అవసరం.

సత్యాగ్రహాన్ని ముఖ్యంగా ఈ క్రింది మూడు పరిస్థితులలోనూ వుపయోగించవచ్చు.

(1) ఏదైనా స్థానికంగా అన్యాయం జరిగితే దాన్ని పోగొట్టడానికి ఈ అస్త్రాన్ని [illegible] వుపయోగించవచ్చు.

(2) ఏదైనా ఒక అన్యాయం, దుష్కృత్యాన్ని నిర్మూలించడంకోసం ఆత్మ ప్రాయశ్చిత్తంగానూ, స్థానికంగానూ, ఆంతరికంగానూ ఉద్బోధం కలగడానికి వుపయోగించవచ్చు. ఈ విషయమై ఫలితంయొక్క పరిణామాన్ని గురించి ఆలోచించవలసిన అవసరంలేదు. చంపారనులో సత్యాగ్రహం ప్రారంభించినప్పుడు ఫలితాన్ని గురించి నేను ఆలోచించనేలేదు. ప్రజలు దాన్ని గురించి చాలా వుదాసీనంగా వుంటారని తెలిసినా, నా మనసు చలించలేదు. ఈ సత్యాగ్రహానికి సత్ఫలితం కలిగిందంటే అది ఈశ్వరకృప అనండి, అదృష్ట మనండి.

(3) ప్రజలలో నిర్మాణ కార్యక్రమానికి వుత్సాహంలేనప్పుడు ఉత్సాహం కలిగించడంకోసరం సత్యాగ్రహం జరిపించవచ్చు. (41 వ సంవత్సరంలో జరిపినట్లు.) ఇది స్వాతంత్ర్య సమరంలో ఒక భాగం. ఉద్దేశ్యంకూడ అదే. అయినా ఏదో ఒకే ఉద్దేశ్యాన్ని అందరి వాక్స్వాతంత్ర్యాన్ని పురస్కరించుకుని ఈ వుద్యమాన్ని నడిపాము. సత్యాగ్రహం కేవలం స్వాతంత్ర్యంకోసమని వ్యాపకమైన అర్థంలో నడిపించకూడదు. మన వుద్దేశ్యం స్పష్టంగా వుండాలి. మన విరోధి బాగుగా అర్థంచేసుకునేటట్లు వుండాలి. అతను మన కోరికను కాదేర్పగలిగే స్థితిలో వుండాలి. ఈ పద్ధతిని మనం బాగుగా అనుసరిస్తే మన లక్ష్యం సిద్ధించి తీరుతుంది. సత్యాగ్రహంయొక్క పూర్తి అవకాశాలు, వ్యవధినిగూర్చి పూర్తిగా నే నిక్కడ వర్ణించలేను. నిర్మాణ కార్యక్రమం, సత్యాగ్రహానికి వుండే సంబంధాన్ని గురించి మాత్రమే వివరంగా చెప్పాను. నేను పైన చెప్పిన మొదటి రెండు పరిస్థితులలోనూ నిర్మాణ కార్యక్రమాన్ని విస్తారమైన ప్రయత్నం ముందుగానే చేయవలసిన అవసరంలేదు. కాని స్వాతంత్ర్యంకోసం సత్యాగ్రహాన్ని ప్రారంభించేటప్పుడు దానికి కావలసిన పూర్వప్రయత్నం వుండితీరాలి. అందులో పాల్గొనే ప్రతి వ్యక్తి మనోవాక్కాయ కర్మలతో పాటుపడితీరాలి. సత్యాగ్రహం ఈ విధంగా అందులో పాల్గొనే యోధులకు ఉత్సాహాన్ని, విరోధులకు అంటే అధికారులకు హెచ్చరికనూ కలుగజేయడానికి తోడ్పడుతుంది. స్వాతంత్ర్యంకోసం నడిపించే సత్యా

గ్రహం అఖిలాంధ్రప్రజల ప్రయత్నమూ, సహకారమూ లేకుండా నడిపిస్తే ఒట్టిబడాయి. పనికిమాలింది అయిపోయింది.

## ఉపసంహారము

కాంగ్రెసు ఆఫీసువారి కోరికమీద నేను ఈ వ్యాసం వ్రాయలేదు. నేనా గ్రామంలో నాతో పనిచేసే మిత్రులు చేసిన సలహా ఫలితంగా ఈ వ్యాసం వ్రాశాను. నిర్మాణ కార్యక్రమానికి సత్యాగ్రహానికీ ఉండే సంబంధం, నిర్మాణకార్యక్రమం నడిపించే విధానం వ్రాసి ప్రచురిస్తే సాగాక్రమంగా [illegible] మిత్రులు నన్ను కోరారు. తప్పనిసరిగా నేను వ్రాయడానికి ప్రయత్నించాను. నేను వ్రాసింది కొంతవరకే [illegible]. కార్యవిధానం తెలియచేయడానికి మార్గం చూపితే. స్వరాజ్యసాధనానికి ఇందులో ఏ విషయమైనా ఒకభాగం మాత్రమే ననుకుని దానిని పరిపాలించవచ్చు. ఎంతో మంది ఎన్నో విధములైన పనులు చేయవచ్చు. సత్యాగ్రహంతోనూ, స్వాతంత్ర్యంతోనూ ఏమీ సంబంధం లేకుండా చిన్నా పెద్దా ఎన్నో కార్యాలు చేయవచ్చు. ఈ పనులకు ఫలితం విరివిగా ఉన్నట్టు కనపడదు. విరివిగా వుంటుందని అనుమానం కల్గుతే [illegible] ఏదైనా ఒక కార్యక్రమాన్ని నడిపించే వ్యక్తి సామాన్యమానవుడైతే, [illegible] అఖిలాంధ్రజనుల ప్రాణాలకు బాధ్యత వహించిన ఒక సేనాధిపతి [illegible] కార్యక్రమం [illegible], దాని విలువే మారిపోతుంది. [illegible] ఏమిటి? ఆ విషయ [illegible] మాలాంటివారికి [illegible] లోకి వెళ్ళితే దాని విలువే [illegible] సేవకులలోకి వెళ్ళిందా వారి పరిధానుబట్టి విలువ, గౌరవం కూడా మారుతూవుంటుంది. నిర్మాణ కార్యక్రమానికి గొప్ప [illegible] కాంగ్రెసువారికి [illegible] కార్యక్రమం కావడం చేత.

నా [illegible] పొరపాటే కావచ్చు. కాని నా అభిప్రాయమిది. [illegible] కాంగ్రెసువారు [illegible] వారు నన్ను విడిచి పెట్టవచ్చు. నిర్మాణ కార్యక్రమం లేకుండా సత్యాగ్రహం నడిపించడం, [illegible] పడిపోయిన [illegible] ఎత్తడానికి ప్రయత్నించినట్లు.

# రెండవ భాగం

## నిర్మాణ కార్యక్రమము ఎందుకు?

### బాబు రాజేంద్రప్రసాద్ :

గాంధీగారు త్రయోదశ విధ నిర్మాణ కార్యక్రమం ఏర్పరిచారు. దీనిని, 'నిర్మాణ కార్యక్రమం దాని అర్థం, స్థానం' అనే పేరుతో పుస్తక రూపంగా ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని గురించి ది18 అగస్టు 1940. హరిజన పత్రికలో విపులంగా వివరించారు. నిర్మాణ కార్యక్రమాన్ని నడుపుతూవున్న దేశ సేవకులకు తత్ సంబంధమైన కార్య నిర్వాహణానికి కావలసిన సూచనలను విరివిగా చేయవలసి వున్నది. అందుచేత నేను కార్యక్రమం నడిపించే పద్ధతులు సాధనాలను, గురించి ఈ క్రింద కొంత వ్రాస్తున్నాను. దీని వల్ల కొంత లాభంకలుగుతుందనే నమ్ముతాను.

## (౧) హిందూ మహమ్మదీయ ఐక్యము

౧. హిందూ ముస్లిం ఐక్యములేక జాతీయైక్యము—ప్రస్తుతం మనదేశంలో ప్రబలి వున్న మత కలహాలకు ఎక్కువ కారణం ఒకరి మీద ఒకరి అపనమ్మకం, అనుమానం. దీనివల్ల మన జాతీయ జీవనమే పాడైపోవటమే కాకుండా ఒకరి పట్ల ఒకరికి దురభి ప్రాయం మన మత ధర్మాలలోనూ భాష సంస్కృతి ఆచారాలు, విద్య, ఆర్థిక స్వాతంత్ర్యము, రాజకీయ విధానం, రాజకీయ సత్తాలలో ప్రవేశించింది అంటే మన జీవితంఅంతా అల్లుకొని పోయిందన్న మాట.

పారస్పరికంగా మనకు స్వాభావికమైన నమ్మకాలు కుదరాలంటే మనకు తోచింది సరి అందుచేత మనం నమ్మేదానిని ఇతరుల చేత నమ్మించితీరాలనే నిర్బంధం మనం మానివేయాలి. మన ఎదురు కక్షవారు నిజమని నమ్మిన దానిని ఎదిరించటం కోసం దౌర్జన్యానికి పూనుకొన రాదు. దీనికి కొన్ని ఉదాహరణాలు చెపుతాను. ఈ ఉదా హరణాలవల్ల అహింసద్వారా ఎంత జయప్రదంగా మనం కార్యాన్ని సాధించ వచ్చునో తెలిసి పోతుంది.

౨. ఒక మహమ్మదీయుడు తన ఆహారం కోసం ఒక ఆవును చంపాలనుకున్నాడు, అనుకోండి. అప్పుడు హిందువు స్నేహంతోనూ సౌజన్యంతోనూ అతనట్లా చేయకుండా నచ్చ చెప్పాలి. అటువంటి పనివల్ల హిందువుల మనస్సుకి కష్టంకల్గుతుందని మనవి చేయాలి. కాని, గోహత్యను నిరోధించటానికై ఎటువంటి పరిస్థితులలోనూ హిందువులు ఎవ్వరూ వ్యష్టిగా కాని సమష్టిగా కాని ఏ మహమ్మదీయునిమీద దౌర్జన్యానికి పూనుకొన రాదు. ఇదే విధంగా ఎక్కడైనా ఒక అమ్మవారి జాతర జరిగితే మసీదు దగ్గర వాద్యాలు వాయించారనీ, దానివల్ల తమ ప్రార్థనలకు భంగం కల్గిందనీ మహమ్మదీయులు హిందువులమీద దౌర్జన్యానికి పూనుకొన రాదు. సాధ్యమైనంతవరకు హిందువులకు నచ్చ చెప్పి తమ ప్రార్థనలు శాంతిపూర్వకంగా చేసుకోవాలి.

౩. ఒక ముస్లింకాని, హిందువుకాని తన భూమిమీద మసీదునో, దేవాలయాన్నో కట్ట వలెనంటే వారివారి హక్కులను ఒప్పుకోవాలి.

౪. మహమ్మదీయుల 'అజా', హిందువు 'హారతి' వారిలో ఎవరికైనా శాంతి భంగం కలుగ చేస్తే సహించుకోవాలి. అసహనంవల్ల కష్టాలు ఏర్పడుతాయి అని తెలుసుకోవాలి.

౫. తన మతాన్ని ఉపదేశించటానికి, వ్యాపకం చేయటానికి ప్రతి పౌరుడికీ హక్కువుంది. ఈ హక్కును ఉపయోగించుకొనుటలో ఇతరుల హృదయానికి వ్యథ కలగకుండా వుండేటట్లు చూచుకోవాలి. పరుల మతాలను గురించి ఆచారాలను గురించి, మత ప్రవక్తల, సాధు, సత్పురుషులను గురించి ఎంతమాత్రం పరుషంగా మాట్లాడ రాదు.

౬. ఒక మతంలోనుంచి మరొకమతానికి ఎవరినైనా మార్చటానికి చేసే ప్రయత్నంవల్ల ఎంతో సంచలనం, కక్ష ఏర్పడుతాయి. ఇది మంచి పని కాదు.

౭. ఎక్కడైనా స్త్రీలను అపహరించడం జరిగితే అపహరించినవాని కులమునకు చెందినవారిచేత వానిని శిక్షింపచేయటం తమకు గౌరవంగా భావించాలి.

౮. కలహాలకు కారణాలుగా ఏర్పడే ఘట్టాలను ఎన్నింటినో ఇంకా ఉదాహరణగా చూపించవచ్చు ఏ పరిస్థితులలోనైనా దౌర్జన్యానికి దిగరాదు. సౌజన్యంలో సామరస్యం కుదరక పోతే ఇద్దరికి నమ్మకమైన నిష్పక్షమైన వ్యక్తి లేదా వ్యక్తులద్వారా పంచాయతీ చెప్పించుకోవచ్చు. ఒక పార్టీవారు పంచాయితీని ఒప్పుకోక పోయి

నప్పుడు అహింసాపద్ధతులమీద సత్యాగ్రహం చేయాలి. దీనివల్ల ప్రత్యర్థి హృదయం కరగ వచ్చు. కాని, జరుగుతూవున్న అన్యాయం స్పష్టంగా కనబడుతున్నప్పుడు, తనకు సత్యాగ్రహం చేయటానికి తగిన శక్తి సామర్థ్యాలు వున్నప్పుడే సత్యాగ్రహానికి దిగాలి. అహింసాపద్ధతులమీద నిరోధించటం అసంభవమైనప్పుడు కోర్టులకు పోయికాని లేక తదిర సర్కారు కచేరీల ద్వారాకాని న్యాయం పొందవచ్చు. హిందువులకు ఒకటి మహమ్మదీయులకు ఒకటి వేరువేరు పద్ధతులు కాకుండా ఇద్దరికీ ఒకటిగానే వుండాలి.

౯. ఈ మధ్య ఒకరి విజ్ఞానాన్ని మరొకరు తూలనాడారని ఎంతో మన స్పర్ధలు కక్షలు ఏర్పడ్డాయి. దీనివల్ల దెబ్బలాటలు జరుగక పోవచ్చు కాని, ఇది కూడా ప్రమాదకరమే. ఈ విధంగా ఎంతోవిషం అప్రత్యక్షంగా వ్యాపిస్తూవుంటుంది. అప్పుడుకూడా అప్రత్యక్షమైన దౌర్జన్యం తరచుగా అల్ప సంఖ్యాకుల వారిమీద బహు సంఖ్యాకులవారు ఉపయోగించవచ్చు. ఒకప్పుడు అల్పసంఖ్యాక సంఘంకూడా తన ధనబలంవల్ల శరీరబలంవల్ల లేక ఇతరుల పిరికితనం కారణంగా ఎన్నోవంతుల బలాన్ని బహుసంఖ్యాకులమీద ప్రయోగించ వచ్చు. ఇట్టివి జరుగకుండా వుండటానికి సర్వోత్తమమైన సాధనం తమ స్వంత చర్యల ద్వారానూ ప్రవర్తన ద్వారానూ ఇతరుల అనుమానాలనూ అపనమ్మకాలనూ తొలగించటమే. ఈ విధంగా తమకు తోచినట్లు తమరు తలచినవిధంగా స్వతంత్ర పూర్వకంగా బ్రతుకవచ్చుననే భావం సముదాయంలో ఏర్పడేటట్లు చేయవచ్చు.

అంటే ప్రతి పౌరునికీ అతని భాష, అతని బిడ్డలకు కావలసిన విద్య అతని జీవిత విధానానికి సంబంధించిన సంపూర్ణ స్వాతంత్ర్యము అతనికి ఉన్నవనే భావం కలిగించాలి.

౧౦. వ్యాపారాలలోనూ, వృత్తులలోనూ, నష్టకరమైన పోటీలు పడరాదు; అసూయ పెంచుకోకూడదు. ఏ వ్యాపారముపైని ఏ వృత్తిమీద ఎవరికీ ప్రత్యేకమైన హక్కు లేదు. ప్రతివారికీ తనకు చిత్తంవచ్చిన వ్యాపారం, వృత్తి చేసుకోవటానికి హక్కు వున్నది. ఏదైనా ఒక పెద్ద కంపెనీలో దాని యజమాని తన కులస్థులకే నౌకరీనిస్తే అది పెద్ద ఫిర్యాదుకు హేతువు కాకూడదు.

౧౧. రాజకీయహోదాలు మనుష్యులలో ఘాతకమైన, పరస్పర అనుమానము అపనమ్మకాలు పుట్టించవచ్చును. ఒకజాతి మరియొకజాతిని పాలించు కోరిక సర్వదా

విడిచిపెట్టదగినది. భారతదేశములో ఎన్నో మతాలుండుటవలన ఇక్కడ స్థిరముగా రాజ్యమును స్థాపించి శాంతముగా పరిపాలించుట దుర్లభము. ఒకజాతి మరియొకజాతియెడ సత్ప్రవర్తనముతో సంచరించుట కవకాశములు కల్పించుకొనుట విహితధర్మము. దయ న్యాయము రెండును వ్యతిరేకములుగానుండ నక్కరలేదు. దయ అనేది నిజంగా మనసులలోని దురభిప్రాయములను, అపనమ్మకాలను నిర్మూలించుటకు సాధనము. పిరికితనమునకుగాని భయమునకుగాని మన వ్యవహారములలో చోటులేదు. రాజకీయముగా ఏర్పడిన గండిని పూడ్చించుటకు రాజకీయవేత్తలు మార్గముల నాలోచింపవలసియున్నది. సేవకులు తాము స్వయముగా శాంతిసహనములను చూపి యీ యుద్యమమున కెంతో తోడుపడవలెను. కనీసము ఇతరమతములోని ఒక్కనితో స్నేహముచేయుట అతనికి సాధ్యమైతీరుతుంది. ఈ విధముగా వేసిన బీజము విశాల వృక్షమగును. ఇతరులనుగురించి తర్కవితర్కములు జరుపకూడదన్న స్వర్ణాక్షరములను బాగా గమనించవలెను. ప్రతివారును తమ జ్యోతిని తమపైనే ప్రసరింపజేసికొని తమ తప్పులను లోటులను తెలిసికొనుట ఉత్తమోత్తమము. మత కలహములు సంభవించునప్పుడు తమతమ ఆచారములను ఆలోచనలనుగురించి ఆలోచించుకొనవలెను. పిదప ఎదుటికక్షవారి పనులనుగురించి, పిమ్మట ఎదుటివారి మంచిచెడ్డల నిర్ణయాన్ని వారిలోని వారికే వదలివేయవలెను. త్వరత్వరగా పత్రికలకు అభిప్రాయములిచ్చుట, తప్పుడు సంగతులు ప్రచురించుట, అభిప్రాయములను వేరుగా త్రిప్పిచెప్పుట ఇటువంటివి చెడు ఫలితానికి దారిచూపును. తర్వాత దిద్దుకొనుట చాలాకష్టము. సత్యము వెలుగులోనికి రావలెను. చిన్నదైనవిషయము, దానిపై అబద్ధపుచర్చలు, అలజడిని తగ్గించుటకు బదులుగా పెంచును.

౧౨. అహింసా సిద్ధాంతమును జీర్ణముచేసికొన్న స్త్రీ పురుషసంఘాలు, ప్రాణత్యాగమునకైన వెనుదీయక మత కలహములను అపుటకు బయలుదేరవలెను. అట్టి శాంతిదళముయొక్క ప్రతివాలంటీయరు కొంతకాలము శిక్షణ పొందవలసియుండును. ఈ పని కష్టమైనదే. దీనికి ధైర్యము శ్రద్ధ చాలా అవసరము. ఇట్టివి అన్ని మతముల వారితో కలసి స్నేహభావము కలవరచుకొన్ననాడే అలవడును. సాధ్యమైనంతవరకు, వీలైనంతవరకు సేవకులు ఆ తెగ మతస్థుల సంఘములలోనుండి వారికి సేవచేయుచుండవలెను. సాంఘిక సమ్మేళనమునకు, పరస్పరసదభిప్రాయములకు వీరే దారిచూపుదురు. వారిలో మతకలహాలు రాసియకుండా నిల్పగల్గుటయేగాక వచ్చినవి ప్రాకకుండాకూడ చేయగలరు.

ప్రజాసామాన్యము యెడల మనము ప్రేమ, సానుకంపము చూపించవలసి వుంటుంది. వారిని పునీతులను చేయడానికై పాటుపడటం మన విధి. వారిని శోక కూపంనుండి వెలుపలకు తీయటం మన కర్తవ్యం. వారి జీవితము వారి పరివారంలో పాతుకుపోయి హృదయాన్ని చలింపజేసే అన్నాతురత, దారిద్ర్యము, అంధకారానికి ఆలవాలమైన వారి ఇండ్లు, వాటి చుట్టూవుండే వాతావరణం, వీటిని బాగుపరచటం సంఘ సంస్కర్తల విహిత ధర్మం. మేజిక్ లాంతర్లు, సినిమాల ద్వారా వీటి యథార్థరూపాన్ని ప్రజాసామాన్యంలో తేలికగా తెలియపరచవచ్చు. సురా పానంవల్ల ఆరోగ్యం ఏ విధంగా పాడై పోతుందో, త్రాగుబోతు రక్త నాళములలో క్రమేణా ఎటువంటి అవకతి ఏర్పడుతుందో, ఈ కారణాలవల్ల అతని శక్తి ఎలా శిథిలమై ఏ విధంగా తాను శారీరకంగా, మానసికంగా, క్షీణించి, వివశుడై నైతికంగా పతితుడౌతున్నాడో, అతని తల్లి భార్యా పిల్లలు కుటుంబంలో వుండే ఇతరులు ఆకలితోను రోగంతోను విలపిస్తూ ఎట్లు ప్రాణాలు వదుల్తూవుంటారో, వీటినన్నింటినీ ఫోటోలుగా తీయించి మేజిక్ లాంతర్ల ద్వారా అందరికీ చూపించటంవల్ల చాలా మంచి ఫలితం కలగటానికి వీలుంటుంది. సురాపానం చేయువాని, చేయనివాని జీవిత విధానంలో వుండే తారతమ్యమును కథల ద్వారా కాని లేదా సినిమాలలో ఇటువంటి చిత్రాలు చూపించటంవల్ల కాని ప్రచారం జరిగితే వ్యసనాలకు అలవాటు పడ్డవారు తమ పొరపాటులను అందువల్ల కల్గుతూవున్న కష్టనష్టాలను తామే స్వయంగా తెలుసుకుంటారు. ఇందువల్ల ఆ దురభ్యాసాలకు దూరంగా వుండటానికి వీలుంటుంది.

మధుపానం మాని వేయటానికి మత్తులేనటువంటి పరబస్తులు కాఫీ, టీ మొదలయినవి వారికి అందుబాటులో వుండేటట్లు (తాత్కాలికంగా అవసరమని తోస్తే) అవకాశము కల్పించవచ్చు. పనిపాటులనుండి తీరికగా వున్నప్పుడు వారు ఆడుకోవటానికి, సంతోషంతో, స్వేచ్ఛతో, ఆనందంతో, కాలంగడపటానికి వీలుగావుండే క్లబ్బులను యేర్పాటుచేయవచ్చు. ఈ క్లబ్బులు మధుసేవను మరపునకుతెచ్చే కరణాలయాలుగా వుండటం చాలా ముఖ్యం. సెలవు రోజుల్లో సత్ సాంగత్యము, సద్గోష్ఠుల లాభాన్నికూడా వారు పొందేలాగు చేయవలసి వుంటుంది. వ్యక్తిగతంగా చెప్పడంకంటే ఈ విధంగా ఈ పనులు నెరవేర్చటానికి ఎక్కువ అనుకూలావకాశములు వుంటవి. ఇటువంటి సంస్థలకు ఆర్థిక సహాయంకూడా చాలా అవసరం. ధనవంతులైన దేశాభిమానులు ఇటువంటి సంస్థలకు ఆర్థికంగా తోడ్పడి తద్వారా మానవోన్నతికిన్ని మానవ

కళ్యాణానికిన్ని తోడ్పడటం విహిత ధర్మం. దేశంలో అక్కడక్కడ ధనవంతులైన దేశాభిమానుల ద్వారా ఇటువంటి సంస్థలు నెలకొల్పబడినవి. చాలామంది ప్రచారకులు వ్యక్తిగతంగాకూడా ఇటువంటి ప్రచారం ఫలవంతంగా కొనసాగిస్తూ వున్నారు. దుర్వ్యసనాలకు, అలవాటు పడ్డవారికి ఇండ్లలోపలికి వెళ్లి వారిలో మిళితమై పోయి వారలకు మన మీద విశ్వాసం కలిగేటట్లు చూడాలి.

## (౪) ఖద్దరు

గాంధీగారు దక్షిణ ఆఫ్రికానుండి హిందూదేశం తిరిగివచ్చిన తరువాతనే అందరి దృష్టిని ఖద్దరు ఆకర్షించింది. ఖద్దరు నిర్మాణావశ్యకతలను గురించి లోగడనే చాలా పుస్తకాలు ప్రచురించబడినవి. ఖద్దరును గురించి ఇంతవరకు జరిగిన ప్రచార ప్రబోధనల వల్ల కలిగిన ఫలితం చాలా ఆశాజనకంగానే వున్నది. ఈ విషయంలో విపులీకరించి, వర్ణించి వ్రాయటం ప్రస్తుతం ఎక్కువ అవసరం లేదనుకుంటాను.

చేతితో వడికి చేతితో నేసిన పని, అందుకు సంబంధించిన ఇతర వృత్తుల పునాది రెండు ప్రధాన విషయములపై ఆధారపడి వున్నవి. హిందూదేశంలో నూటికి 80 మంది వ్యవసాయంవల్ల కాని, లేక వ్యవసాయానికి సంబంధిచిన ఇతర వృత్తులవల్ల కాని జీవితం గడుపుతున్నవారే. వ్యవసాయదారులకు 364 రోజులూ వ్యవసాయానికి సంబంధించిన పనులు అంతగా వుండవు. అందుచేత వ్యవసాయానికి సంబంధించిన ఇతర వృత్తులు చేసుకుంటూ వుంటారు. నూలు వడకటం, నేయటంవల్ల గ్రామస్థులకు కావలసిన బట్టలు గ్రామాలలోనే తయారై, గ్రామాలు స్వయం పోషకంగా వుండగల్గటమే కాక గ్రామస్థులకు గల నామ మాత్రపు రాబడిలో కొంతవరకు ఆర్థిక సహాయం కల్గటానికి వీలుంటుంది. ఇతర వృత్తులలోవుండి ఇంతకంటే ఎక్కువ సంపాదించటానికి అవకాశాలు కలిగివున్నవారికి, మీ వృత్తులు మానుకొని నూలు వడుకుటలోనూ నేయుట లోనూ పాల్గొనండని ఎప్పుడూ చెప్పలేదు. ప్రధాన వృత్తికి ఇది సహాయకారి మాత్రంగానే వుండగలదు. విక్రయానికి, వడికేవారి స్వంత ఉపయోగానికి ఖద్దరు ఉత్పత్తి చేయబడుతున్నది. స్వయంగా వడకుట, నేయుట చేతకానివారు ఖద్దరు కొని వాడుకొన వచ్చును.

సన్నని మంచినూలు త్వరగా వడకటానికి, నేయటానికి వీలుగా వుండేటట్లు లోగడవున్న పనిముట్లలో క్రమేణా చాలా మార్పులు చేయబడినవి. ఆశ్చర్య జనకమైన

ఫలితం ఇందులో కనబడింది. మొదట వున్న మోటు ఖద్దరును, ఇప్పటి సన్ననూలులోని వివిధ రంగులుగల ఖద్దరును పోల్చిచూస్తే అప్పటికీ ఇప్పటికీ ఖద్దరు పరిశ్రమలో కలిగిన ఆశ్చర్యకరమైన మార్పు అభివృద్ధి స్పష్టంగా గోచరమవుతవి. ఈ నాడు ఎటువంటి వారికైనా, వారికి నచ్చిన బట్ట ఖద్దరులో లభ్యమౌతున్నది. మిల్లు బట్టల పోటీకి ఖద్దరు నిలువలేదనే మాటనిజమే. మిల్లుబట్టలకు ఖద్దరు పోటీగా వుండాలనే భావానికి ఖద్దరు నిర్మాణంలో తావే లేదు. పల్లెటూళ్లలో నివసించే పేదసోదరుల యెడల సానుకంపము కలవారు, భారత స్వాతంత్ర్యాన్ని హృదయపూర్వకంగా అభిలషించే వారు మిల్లు బట్ట కంటే ఖద్దరు ధర ఎక్కువగావున్నా ధరను లక్ష్యంలో వుంచుకొనక, ఆశయాన్నే ప్రధానంగా భావించి తప్పక ఖద్దరుకొని, ధరిస్తే దేశానికి చాలా మేలు కల్గుతుంది.

అఖిలభారత చరఖా సంఘం ద్వారా దేశంలో ఖద్దరు ఉత్పత్తికి, విక్రయానికి, చాలా కేంద్రాలు స్థాపింపబడినవి. ఖద్దరు ఉత్పత్తికే సంస్థలో తన నియామకం జరిగిందనే విశ్వాసంతో అందులో పనిచేసే ప్రతి కార్యకర్త వ్యవహరించవలసి వుంటుంది. ఖద్దరుకు సంబంధించిన ఆర్థిక శాస్త్రము, విజ్ఞానము మున్నగునవన్నీ అతను పూర్తిగా తెలుసుకోవటం చాలా అవసరం. ప్రజాసామాన్యానికి ఉన్నత పథంచూపి ఖాదీ ఇచ్చే ఈ దివ్యసందేశం ప్రతి మానవహృదయంలో స్థిరంగా పాతుకొని పోయేటట్లు పాటుబడవలసి వుంటుంది.

ఖద్దరు విక్రయశాలలకు ఒక సంగతి మనవి చేయుచున్నాను. ఖద్దరు ముఖ్యంగా అతిదారిద్ర్యంతో అల్లాడి పోతున్న పేదవారి సాహాయ్యంకోసమే ఉత్పత్తి చేయబడుతున్నది. వారిని గౌరవంతో కూడుకొనిన ఒక వృత్తిద్వారా న్యాయసమ్మతంగా తమ జీవితంగడుపు కోవటానికి కూలీ తెచ్చుకొనుటకు తగిన వారినిగా తయారు చేయుట ఖద్దరు ఉత్పత్తి ముఖ్య లక్ష్యాలలో ఒకటి. ఈ ముఖ్య లక్ష్యాన్ని సిద్ధింపజేసినదే శుద్ధ ఖాదీ అనబడుతుంది.

ఈ దృష్టితోనే అఖిలభారత చరఖాసంఘము కూలీలచే చేయించటానికి అలవాటుపడిపోయిన మిల్లుయజమానుల లేక ఆయా సంస్థల అభిప్రాయములతో నిమిత్తము లేకుండా సాధ్యమైనంత చురుకుగా నూలు వడికేవారికి, నేయువారికి రోజుకు ఎనిమిది గంటల పనికి ఎనిమిది అణాలు కూలీ యివ్వటానికి నిర్ణయించినది. ఖద్దరు ధర పెంచిన యెడల అమ్మకం తగ్గిపోతుందని కొంతమంది ఖద్దరు ప్రచారకులు భావించారు. కాని అటువంటి పరిస్థితి ఇంతవరకెక్కడా యేర్పడలేదు. నూలు వడికే వారికి, నేయువారికి

వారి శ్రమకు తగ్గ కూలీ సంతృప్తికరంగా యివ్వటమే అఖిలభారత చరఖాసంఘ ఆశయం. కొంతమంది స్వార్థపరులు నిరుపేదలయిన నూలువడుకువారిని, నేయువారిని దోచుకొంటూ వారికి సక్రమమైన కూలీ ఇవ్వక వారి తాత్కాలిక అవసరాలను తమ స్వప్రయోజనాల క్రింద ఉపయోగించుకొనుటకై పంచుకొంటూ వ్యక్తిగతంగా ఖద్దరు వ్యాపారం చేస్తున్నారు. ఇందుకనే చరఖాసంఘము కేవలము చరఖాసంఘము ద్వారా నిర్ణయింపబడిన కూలీ సక్రమంగా యిస్తూ నూలువడికించి నేయించు వ్యక్తులకు, సంస్థలకే ఖద్దరు విక్రయమునకు అనుమతిపత్రాలు యివ్వటం ప్రారంభించింది. ఇంత జరుగుతున్నా స్వార్థపరులు తక్కువ కూలీతో ఖద్దరును ఉత్పత్తి చేయించి, అఖిలభారత చరఖా సంఘము ద్వారా అనుమతి పొందిన ఖద్దరు కంటే తక్కువ ధరలకు వ్యాపార దృష్టితో అమ్ముతున్నారు. ఖద్దరు ఉద్యమములో పని చేసే ప్రచారకులు, ఇతర దేశాభిమానులు ఇటువంటి ఆదర్శ రహితమైన ఖద్దరు విక్రయమును అరికట్టుటకు ప్రయత్నించాలి.

ఖద్దరు ఉత్పత్తిని, విక్రయమును సరియైన పద్ధతులలో బలపరుచుకుంటూ జాతీయ ఆర్థిక విధానములో ఖద్దరు అవసరాన్ని, ఉపయోగాన్ని గుర్తించి ప్రతి ఇంటా నూలు వడికే పని ప్రారంభించిన నాడే ఖద్దరు సర్వవ్యాపకమౌతుంది. సామాన్యంగా ప్రతివారూ గంటకు నాలుగు వందల గజాల నూలు వడక వచ్చును. ఈ విధంగా నియమంగా ప్రతి మనిషి రోజుకు ఒక గంట చొప్పున వడకిన, నెలకు 12000 గజాల నూలు తయారు చేయవచ్చును. నూలు నెంబరు, సన్నదనం ఏకులమీద వడికేవాని కౌశలంమీద ఆధారపడి వుంటుంది. 10 నెంబరు నుంచి 12 నెంబరుకు నూలును మధ్య తరగతి నూలుగా భావించినా నెలకు వడికిన 12000 గజముల నూలుతో 3½ గజముల గుడ్డ తయారవుతుంది. ఈ విధముగా ప్రతిరోజూ ఒక గంట నూలు వడికితే సంవత్సరము నకు 42 గజములకు సరిపోవు నూలు తయారు చేసుకొనుటకు వీలుకల్గుతుంది. మన దేశములో సర్వసాధారణముగా ప్రతి మనుష్యునికి సంవత్సరమునకు 16 గజముల గుడ్డ సరిపోగలదు. ఈ లెక్క ప్రకారము ప్రతి రోజూ ఒక గంట నియమంగా నూలువడకిన వ్యక్తి ముగ్గురు వ్యక్తుల గుడ్డలకు సరిపోవు నూలు తయారుచేయ గలుగుటకు వీలు కల్గు చున్నది. రైతులుకాని లేక ఇతర ఉద్యోగములలోవున్న వ్యక్తులుకాని 24 గంటలలో ఒక గంట నూలు వడుకుటకై వినియోగించుకొనుట చాలా తేలిక. ఈ మాత్రపు పని వలన దేశమునకు ఎక్కువలాభము చేకూరగలదు. మిల్లులలో తయారగు 16 గజములగుడ్డ ఖరీదు సుమారు రూ. 4-0-0. నాల్గురూపాయలు వుండగలదు. మన పేదదేశంలో ప్రతి

వ్యక్తికి సంవత్సరమునకు రూ. 4-0-0. నాల్గురూపాయలు ఆదాయము మిగిలినయెడల దేశ మొత్తముమీద ఎంతో ఆదాయము మిగులగలదు. ఇంతేకాక ఎవరికి కావలసిన గుడ్డ వారు తయారుచేసుకొనుటకు అర్హులై వుండట నైతిక దృష్టిలో ఎంతో మహత్తరమైన విషయము. అయిదుగురు గల ఒక కుటుంబములో ఇద్దరు ప్రతి రోజూ నియమంగా ఒక గంట నూలు వడికితే ఆకుటుంబానికి కంతకీ సరిపోవు నూలు తయారు చేయగలుగుటకు వీలుంటుంది. ముఖ్యముగా చరఖాసంఘములో పని చేయు ప్రతి ఖాదీ ప్రచారకుడు తనకు కావలసిన బట్టకు సరిపోవు నూలు తాను స్వయముగా వడుకుకొనుటయేకాక అతనికి, ఏకుట, ఏకులు చేయుట మొదలగు పనులలో మంచి ప్రావీణ్యం వుండటం చాలా ముఖ్యావసరమై యున్నది. రాట్నము ఖద్దరు ఉత్పత్తికి ఉపయోగపడే అన్ని రకముల పరికరములలో ఏదైనా పాడైపోయినయెడల, దానిని స్వయముగా మరమ్మతు చేసుకొనుటకూడా బాగా తెలిసి వుండవలెను. అపనికి ఇందులో కావలసిన పరికములన్నీ, ఎప్పటికప్పుడు వాడుకొనుటకు వీలుగావుండే స్థితిలో వుంచుకొనుట చాలా ముఖ్యము. ఖద్దరు ఆవశ్యకతను గురించి ఉదాహరణలతో చేయబడ్డ ప్రచార ప్రబోధముల కంటే ఖద్దరు ఉద్యమములో పని చేసే ప్రచారకుల వ్యక్తిగత, ఆదర్శ జీవిత విధానమే ప్రతివారూ ఖద్దరు ఆవశ్యకము గుర్తించునట్లు చేయగలదు. కేవలము వడుటయే కాక నేత నేయు కళయందుకూడా అతడు ఆరితేరి వుండాలి. ఇంతేకాక తాను నేర్చిన విద్యను తన కౌశలాన్ని ఇతరులకుకూడా నేర్పుటకు అతడు ప్రయత్నము చేస్తుండాలి. ఖాదీ ఉద్యమములో పని చేసే ప్రతి ప్రచారకుడూ తాను నివసించు ప్రదేశీయ పరిస్థితులను అనుసరించి తన ప్రచార కార్యక్రమమును యేర్పాటు చేసుకొని స్థిర చిత్తంతో కార్యాచరణకు పూనుకోవాలి. అతడు ప్రతి సంవత్సరం కనీసము 12 మందిని అయినా తనవలె ఎవరి కుటుంబమునకు వారు కావలసిన గుడ్డకు సరిపోవు నూలు స్వయముగా వడకుకొని, స్వయంపోషకత్వంలో వుండే మహాశయాన్ని గుర్తించి ఆచరణలో పెట్టుకొనునట్లు చేయగలిగితే ఇది గొప్ప ఆదరణీయమైన, సఫల ప్రయత్నముకాగలదు.

ప్రత్తి పండనటువంటి, లేక అమ్మకమునకు దూది లభించవటువంటి గ్రామాలు మన దేశములో లేవనే చెప్ప వచ్చును. ప్రతి రైతుకు కనీసము తన కుటుంబమునకు సరిపోవు ప్రత్తి పండించుకొనుటవల్ల కల్గు లాభాన్ని, అవసరాన్ని గురించి మనము వివరముగా బోధపరచి నచ్చ చెప్పవలెను. అప్పుడు నేత వృత్తిలో వుండు నేతగాండ్రకు పని

లేక పోవడమనేది వుండదు. ఖద్దరు ఉత్పత్తి కళలో శ్రద్ధ, లగ్నత, తెలివి, యోగ్యత, గ్రామీయ జీవిత విధానములో ఆశ్చర్యకరమైన, విప్లవాత్మకమైన జాతీయ పరివర్తనాలు కలుగ జేయగలవు.

## (ఇ) ఇతర గ్రామ పరిశ్రమలు

మన దేశములో వ్యవసాయము ప్రధానమైన వృత్తి. వ్యవసాయమువలన తిండి వస్తువులతోపాటు గుడ్డకు కావలసిన ముడిపత్తికూడా మన రైతులు పండించగలుగు తున్నారు. వ్యవసాయముతో పాటు చేతి పరిశ్రమలుకూడా మన గ్రామ వృత్తులలో ప్రధానమైనవి. మన దురదృష్టమువల్ల గ్రామాలలోని చేతిపరిశ్రమలు అడుగంటి పోవుట చేత వ్యవసాయ వృత్తులోకూడా, పట్టుదల, ఆనందము సన్నగిలినది. గ్రామాలలో రెండవ వృత్తి పరిశ్రమ లేని కారణము చేత వ్యవసాయ వృత్తిదారు లందరూ సంవత్సరములో ఆరు మాసములు ఇంచుమించు వృత్తి సంబంధమైన పనులు లేకుండా వృధాగా కాలముగడపవలసి వస్తూవున్నది. ఈ కాలమును వారు వృధా పుచ్చకుండా తమకు తమ కుటుంబమునకు కావలసిన బట్టలకు నూలు వడుకుకొనుట, నేయుటలో వినియోగించు కొనిన ఎంతో లాభదాయకంగా వుండగలదు.

గ్రామాలలో నశించి పోయిన గ్రామ జీవితాన్ని, చేతి పరిశ్రమలను పునరుద్ధారణ గావించి, గ్రామాలను సర్వవిధములా స్వయం పోషకముగా తయారు చేయవలెనన్న మహాశయముతో గాంధీమహాత్ముని ద్వారా స్థాపింపబడి పని చేస్తున్న అఖిలభారత గ్రామోద్యోగ సంఘము ఏ విధముగా తన ఆశయ సిద్ధికై పాటుబడుతున్నదో, గ్రామాలలో వుండే వృత్తులను పునరుద్ధరించి గ్రామస్థుల, శారీరక, మానసిక, ఆర్థిక, నైతిక, సంపత్తిని పెంపొందించుటలో ఎట్లు లాభదాయకముగ నున్నదో మనము తెలుసుకొన వలసి యున్నది.

మిల్లులలో ఈ పనులన్నీ జరుగుటవలన, ఆహారపదార్థములలో శరీరమునకు పుష్టినిచ్చు 'విటమిన్లు' పూర్తిగా దూరమై పోయి శారీరక దౌర్బల్యము ఇంకా అనేక రోగములకు ప్రధాన హేతువౌతున్నది. ఈ విధముగా మిల్లులు మన ఆరోగ్యమునకు గొడ్డలి పెట్టు. మన ఆహారములో నూనే కాక నూనె పదార్థములుకూడా చాలా ముఖ్యము. మనము వాడుకొను నూనెలో సహజంగా వుండే పుష్టికరమైన పదార్థము పోకుండా వుండునట్లు మనము శ్రద్ధవహించటం చాలా ముఖ్యము. మన భోజనములో

పంచదార ఒక ప్రధాన వస్తువు అయివున్నది. చెరకు పంట మనకు క్రొత్తదికాదు. ప్రాచీన కాలమునుంచి గ్రామాలలో వుండే చెరకు గానుగలద్వారా బెల్లము తయారు అవుచుండుటవలన మనకు పంచదార కొరత లేకుండా వుండేది. ఈ నాడు గ్రామాలలో సహితము పంచదార మిల్లులు వచ్చి ప్రవేశించినవి. పంచదార కంటే సులభముగా జీర్ణమవుటకు తేనెటీగల ద్వారా తేనెను సంపాదించవచ్చును. పండ్లు, కూరగాయలుకూడా భోజన పదార్థములలో ముఖ్యమైవున్నవి. వీటిని గ్రామములలో సులభముగా పండించవచ్చును, మరియు తప్పక పండించి తీరవలెను. ఇవికాక మన ఆహార పదార్థములలో అత్యంత ప్రాముఖ్యము గలిగినవి పాలు, పాలతో తయారగు ఇతరవస్తువులు. ఇందులకు గోశాలలువుండుట చాలా అవసరము. పాలనిచ్చు ఆవులు, గేదెలు మున్నగు జంతువులను, మంచి వైజ్ఞానిక పద్ధతులతో పెంచి పోషించు జ్ఞానమును ప్రాప్తింపజేసుకొనుట చాలా ముఖ్యము. కాన, క్రింద వ్రాయబడిన విధములను శ్రద్ధగా గమనించవలెను.

౧. ధాన్యము, పత్తి, చెరకు వ్యవసాయాభివృద్ధికిగల మార్గావలంబనము.

౨. బియ్యము దంపుటకు, పిండి విసరుటకు, పప్పు మొదలయినవి చేసుకొనుటకు మూలపడివున్న రోలు, రోకలి, తిరగలి మొదలయిన వాటిని వాడుకలోనికి తీసుకొని వచ్చుట.

౩. తెలుకల గానుగ ద్వారా నూనె తీయించుట.

౪. చెరకు రసమునుండి బెల్లము తయారు చేయుటకు చెరకు గానుగలను మళ్లీ ఉపయోగించు కొనునట్లు చేయుట.

౫. తేనెటీగలను పెంచి, తేనెతీయు పరిశ్రమను క్రియారూపంలోనికి తీసుకొనివచ్చి అభివృద్ధి చేయుట.

౬. విజ్ఞాన పద్ధతులపై, ఉత్తమ పద్ధతుల ద్వారా, పశుపోషణ, పశుసంతతిని అభివృద్ధిచేయుట గోశాలలను నడపుట.

౭. పండ్లు, కూరగాయలు పండించుట.

౮. సాధారణంగా నిరుపయోగమని భావించే వస్తువులనుండి కూడా ధనము రాబట్టు కొనుటకు ప్రయత్నము చేయుట :—పశువుల మనుష్యుల మలమూత్రములు, పండ్లు వలవగా వచ్చిన తొక్కలు, కూరగాయలు తరుగగా మిగిలిన పొట్టు, భోజనము

చేసిన తరువాత మిగిలిపోయిన ఎంగిలి పదార్థములు, గంజి, కసువు, పచ్చని రేక, కుళ్లి పోయిన ఆకులు, బూడిద, చచ్చిపోయిన జంతువుల ఎముకలు, ఇవన్నీ చాలా విలువైన ఎరువులుగా తయారు చేయుటకు ఉపయోగపడగలవు.

౬. వ్యవసాయపు పనిముట్లు అభివృద్ధిలోనికి తీసుకొనివచ్చి, వాటిని గ్రామాలలోనే తయారు చేయించుట. నాగలి, కర్రనాగలి, గుద్దలి, పార, గునపము, మొదలయిన నవీన పద్ధతులలో తయారగుచున్న వ్యవసాయపు పనిముట్లు అన్నీ ఎవరి ప్రాంతములో వారు తయారు చేయించుకొనుట.

అన్న వస్త్రాల తరువాత మనలను ఎదుర్కొంటున్నది తల దాచుకొనుటకై ఇంటి సమస్య. అప్పుడప్పుడు సామాజిక పరిస్థితులవల్ల అన్న వస్త్రాదుల కంటే ఇంటి సమస్యకే ఎక్కువ ప్రాధాన్యం కలుగుతూవుంటుంది. గ్రామాలు స్వయంపోషకంగా వుండాలనే దృష్టితో, మనము ఇండ్లను ఆయా గ్రామాలలో లభ్యమగు వస్తువులలోనే ఆ గ్రామస్థుల కూలి పరిశ్రమతోనే కట్టుకొనవలసి యున్నది. ప్రకృతి సిద్ధముగావున్న ఇండ్లు మితవ్యయముతో తయారగును; కాని, ఈ వైపు ప్రజల దృష్టి ఆకర్షింప బడుట లేదు. ఎన్నో లక్షల, కోట్ల సంవత్సరాలకు కాని భూగర్భంలో, రాక్షసిబొగ్గు, నూనె, ఇనుము, వెండి మున్నగు గనులు బయలుదేరవని భూగర్భశాస్త్రజ్ఞులు చెబుతూవుంటారు కాని మనమందరమూ ఆ గనులు మరల పూర్తియగు విషయమునే ఎంతమాత్రము ఆలోచించకుండా నిర్లక్ష్యముతో గనులనుండి వెలువడు రాక్షసి బొగ్గు, ధాతువు నూనె మున్నగువాటిని దుబారాగా ఖర్చు చేస్తున్నాము. అనివార్యరూపంగా ప్రకృతి దృష్టి యీ ఆదాయవ్యయముల వైపు వుంటుంది. కాని, మనము ఒక విధముగా ప్రకృతికి అడ్డు తగులుతున్నాము. వైజ్ఞానికాభిమానంలో ప్రకృతి సర్వసంపదను నాశనం చేస్తున్నామన్న సంగతిని మనము మరచి పోతున్నాము. మన ప్రస్తుత నిర్లక్ష్యమువలన ఇప్పటికి గనులలో మిగిలివున్న ఇనుము, బొగ్గు నూనె, మున్నగునవి ఇకముందు ఎంత కాలములో సర్వంసమాప్తమై పోవునో దూరదృష్టిగల వైజ్ఞానికులు లెక్కలుకట్టి యున్నారు. కాని, ఈ సమస్యముఖ్యముగా యంత్రాగారములతో పనిచేయు దేశములకు. మనము ఖర్చుపెట్టిన దానిని తిరిగి సంపాదించుటయే మన గ్రామ ఆర్థిక ఆశయం. మన పంటలన్నియూ పొలములలోనే పండుచున్నవి. గోధుమలు మున్నగు ధాన్యములను విసరి పిండిగా చేయుచున్నాము. వడ్లను దంపి బియ్యముగా తయారు చేయుచున్నాము. పప్పు దినుసులను చెరిగి పప్పునుండి వచ్చిన పొట్టునుకూడా, అనవసరముగా పోనివ్వటం

లేదు. పూర్వము ఈ పనులన్నీ ఇండ్లలో జరుగుచుండేవి. మిల్లులు రావటంవల్ల తిరగలితాళ్లు మొదలయినవన్నీ మూలపడి పనివాళ్ల పనితనమూ, కూలీ కూడా లేకుండా పోయినది. ఈ పనులన్నీ చేతితో చేసుకొనుచున్నట్లు, ఆర్థిక లాభమే కాక, మనము తినే తిండిలో శరీరమునకు పుష్టినిచ్చు "విటమిన్లు" అనబడు పదార్థము పూర్తిగా సురక్షితంగా వుంటూవుండేది. ఈ సాధారణమైన విషయములో ఉపయోగింపబడు వంటచెరకు తీసికొనుము. మనము అడవి పుల్లలను, కంప పెరళ్ళు వాడెదము అవి ఎన్నడూ తరగనే తరగవు. ఇండ్లు కట్టుకొనునప్పుడు కూడ మనము తేలికగా తీయుటకు వేయుటకు వీలైన కలపను వాడవలెను. ఇటుకలు పెంకులు వంటివి కర్రలతో కాల్చ నవసరం లేదు. తాటాకులు మూలాలు పంట కింద దొరికే కలపనుంచే చేసుకొన వచ్చును. ఈ విధంగా మనతో గృహాలు చాలా తక్కువలో కట్టుకొనవచ్చును. పూర్వ కాలమున కట్టిన అద్భుతములైన దేవాలయములు, అందులోని శిల్పము, రాతిని గాని, సిమెంటుగాని, ఉక్కుగాని ప్రస్తుతపూర్వమే కట్టబడినవి. శాశ్వతంగా నిలచి ఉన్నాయి. ప్రతిదినము చాలా అవసరంగా కావలసిన యీ వస్తువులే కాకుండా ఇంకా కొన్ని మనకు అత్యావశ్యకములైన వున్నవి. ఇవి సూది మొదలు రాకెట్టు రైలుబండ్లు, ఓడ వరకు ఉంటాయి. కలము సిరాబుడ్డి మొదలు అచ్చుమెషీన్లవరకు, సూదివత్తి మొదలు విద్యుచ్ఛక్తివరకు ఇట్లా ఎన్నో ఉంటాయి. అందులోనుంచి మనకే అత్యావశ్యకమో సూక్ష్మంగా ఆలోచించి నిర్ణయించుకోవలెను. వాటిని ఆ గ్రామంలోనే తయారు చేసే ఏర్పాటుకూడ చేసికోవలెను. వందల వస్తువులు పల్లెటూరి పరిశ్రమమున సులభముగా తయారు కాగలవని విచారిస్తే తెలియును. ముడివస్తువులు విరివిగా దొరికే చోటు లున్నాయి. అప్పటి సంప్రదాయాను సారంగా అదే పనిని చేస్తూ ఉన్న కార్మికు లున్నారు. దేశకాల పరిస్థితులను బట్టి వారా పనిని విడచిపెట్టలేరు. ఆ పరిశ్రమలను తెలిసికొని ప్రోత్సహించుట మన పని. కాగితం తయారు చేయుటను చూడుడు. తోలు వస్తువులను తయారు చేసే విషయం యోచించండి. కావలసినంత సామగ్రిగాక, కావలసినంత మంది మనుష్యులు పల్లెలలో దొరకుతారు. కావలసిన దేమనగా మనలో చురుకుదనము, దూరదృష్టి. అన్నిటి కంటె ముఖ్యంగా సమస్తము అతిసులభముగా లభించే మన దేశంలో కావలసినంత మంది పరిశ్రమలో దుముకుటకు తయారగుచున్న మన దేశంలో, ఏపనినైనా సాధించవచ్చుననే ధైర్యం ఉండాలి; విశ్వాసం ఉండాలి. అప్పుడు నిరుద్యోగ సమస్య మనముందు మాయమై పోగలదు. మనకు కావలసిన కొన్ని వస్తువులు విరివిగా తయారు కావలెను నిజమేకాని మన పల్లెటూరి జీవితము, మన

సంస్కృతి, మన కళ అన్నీ పల్లెటూరి చేతి పరిశ్రమలంతరించిన వెంటనే, అవికూడ అంతరించినాయి. పల్లె జీవితాన్ని పునరుద్ధరించవలెనంటే యీ పరిశ్రమలను ముందుగా పునరుద్ధరించవలెను. అందుకనే గాంధిజీ భావయుక్తంగా అన్నారు. ఖద్దరు సూర్యుడుదయించిన నాడు ఇతర గ్రహాలు వాటియంతనవియే అతని చుట్టూ తిరుగును. పల్లెసేవకు దిగువారు పల్లె పారిశ్రామిక వస్తువులనే ఉపయోగించాలి.

## (౬) గ్రామ పరిశుభ్రత

గ్రామమునకు అన్నిటికంటే ఎక్కువగా కావలసినది శుభ్రత అంటే ఎవ్వరూ కాదనరు. జనులకు తమ ఇంటిని, తమ చుట్టుప్రక్కల స్థలాన్ని, తమ శరీరాలను శుభ్రముగా నుంచుట తెలియదు. తెలిసికొనుట కిష్టపడరు. దీనివలన పర్యవసానమేమిటంటే రోగాలు, అంటువ్యాధులు, జనుల ఆరోగ్యక్షీణము ఆరంభ మవుతవి. భగవంతుని తర్వాత పరిశుద్ధతయే అన్నారు. ఈ సూత్రము భౌతికానికి సంబంధించినదే కాదు. నైతిక మానసికముల మీద కూడ పనిచేస్తుంది.

ప్రతి మనుష్యుడు ఆరోగ్యముగానుండే అలవాటు చేసికోవాలి. అతడు ప్రతి విషయములో తనకు తాను పరిశుభ్రముగా ఉండాలి. తాను తన బట్టలను తదితర వస్తువులను పరిశుద్ధముగా నుంచుకోవాలి. మురికి పనికిరాని పదార్థముగా ఎన్న బడినది. దేనినైనా చిందవందరగా పారవేయుట, ఇండ్లలోను, వసారాలలోను, దొడ్ల లోను, రోడ్లమీద ఉమ్మివేయుట, చీదుట, ఇండ్లలోగాని, మురికి కాలువలోగాని, నలుగురు నడిచే త్రోవలోగాని, చెరువులోగాని, నదులలోగాని లఘు గురుశంకలను వదలుటు, అశుద్ధమును మన్నుతో కప్పివేయకుండుట మొదలగు దురలవాటులను వెంటనే వదలివేయాలి. ఇవి అన్నియు రోగమును పుట్టించునవియే గాక ప్రక్క యింటివారి కసహ్యకరములైనవి. అశుద్ధము పేడ మొదలగు వాటిని దాచియుంచి ఎరువుగా నుపయోగింపక ఎరువు కొరకు ఎంతో డబ్బుకూడ ఖర్చు పెట్టుతున్నారు.

పల్లెవాసులకు ఆరోగ్యపద్ధతులు బోధించి వారిని మంచిదారిలో పెట్టుటవలన గ్రామపరిశుద్ధతను బాగుపరుపవచ్చును. ఇందులకు కొన్ని పద్ధతు లీ క్రింద వివరింప బడినవి :—

౧. ఊరిలోనికి వచ్చే బాటలు, ఊరిలోని బాటలు ప్రతి దినము ఊడ్చి శుభ్రము చేయవలెను. చెడు పదార్థములను బాటలమీద పార వేయ కూడదు. వాటి

కొరకు ప్రత్యేకముగా ఉంచబడిన మురికి డబ్బాలలో పారవేసి, పిదప వాటిని మురికి గోతులలోనికి చేర్చాలి. పెద్దలు పిన్నలు ఎవ్వరూ బాటమీద ఒకటికిగాని రెంటికిగాని పోరాదు. మురికి నీరు బజారులో పోకూడదు. ఈ నీటిని కూరగాయల మొక్కలకు మళ్ళించి ఉపయోగపరచాలి.

౨. పొలాలలో బహిర్భూమికి పోవువారు ఆ మలమును పొడిమన్నులో కప్పవలెను. ఇంత కంటె మంచి పద్ధతి ఏమంటే పొలాలలో ఒకటి రెండడుగుల గొయ్యి తీసి దాని చుట్టూ తడుకల కట్టి పాకీదొడ్డిగా చేసి, అట్లాగే ఆ దొడ్డిని చోటు మారుస్తూ పొలమంతా మార్చిన చాలా ఉపయోగము. ఇక్కడ కూడ మలమును పొడి మన్నులో కప్పివేయాలి. కొంత కాలానికది దానియంత నదే ఎరువుగా తయారై, ఈ నాడు జనాని కసహ్యకరమగు పదార్థము, లీక రైతుకు అదృష్టముగా మారుతుంది.

3. పేడ, పాచి, కసువు, త్రొక్కుడు తొక్కలు వీనినికూడ పూడ్చివేయాలి.

౪. చెరువులను, చెరువుగట్లను, చెరువుకు నీటి నిచ్చు కాలువలను అతిశుద్ధముగా వుంచాలి. ఈ రోజులలో చెరువులలో గొడ్లను కడుగుట, గిన్నెలు తోముట, బట్టలుతుకుట మొదలగునవి చేస్తూ వాటి నీరు త్రాగుటకు వండు కొనుటకు ఉపయోగిస్తునారు. నది, చెరువు, నూతి నీటిని కేవలము అశ్రద్ధ అజ్ఞానము వలన పాడు చేస్తున్నారు. గ్రామమున కీ విషయములో చాలా నేర్పవలసి యున్నది.

౫. ఊరి యొక్క ఆరోగ్యము ప్రతి మనిషి యొక్క ఆరోగ్యం మీద ఆధారపడియున్నదని తెలిసికొనవలెను. ఒక్కడు పరిశుభ్రముగా లేక పోయినా ఊరికే నష్టము. ఈ విషయాన్ని పల్లెలలో బోధించుట కొరకు యువకులు సంఘాలుగా ఏర్పడి పని చేయవలసియున్నది. తాము ప్రచారముతో పాటు రోడ్లు తుడుచుట, దొడ్డి బాగు చేయుట మొదలగునవి చేసి చూపించ వలసియున్నది.

## (౭) బాల శిక్షణకు క్రొత్త పునాది.

విద్యావిధానానికి గ్రామజీవితానికి ప్రత్యేకముగా సంబంధించిన పునాది ఉండాలని గాంధీజీ మనకు చెప్పుతున్నారు. ప్రతి బాలునికి బాలికకు చేతి పరిశ్రమలనుగూర్చి నేర్పుటకు నేటి ఉన్నత చదువులు తావిచ్చుట లేదు సరికదా యీ విద్యావిధానము మనలను అయోమయంలో పడవైచుచున్నది. గాంధీజీ విద్యావిధానము బాలుని స్వాభావిక క్రియాశక్తిని అభివృద్ధి పరుస్తుంది. మేధా శక్తిని బలపరచుటయే గాక శరీర

అవయవాలకు బలముచేకూరుస్తుంది. దీనిని సరియైన పద్ధతులమీద విద్యార్థులకు నేర్పినట్లయితే బాలుర మేధాశక్తి, నైతికబలము శారీరకబలము నేటి పాఠశాలా విద్యార్థుల కంటె మిక్కుటముగా అభివృద్ధియవుతుంది. ఈ పనిని తెలివిగా కొనసాగించగలిగితే, పాఠశాలలో తయారగు వస్తువుల అమ్మకము వలన ఆ సంస్థ ఇతరులమీద ఆధారపడక తన్ను తా పోషించుకొన గలదని గాంధీగారు చెప్పుచున్నారు. ఇందువలన లక్షలు వ్యయపర్చలేక ప్రభుత్వము విద్యను పోషించక పోవుట వలన కలిగే కష్టము తొలిగి పోవును. మొదట నూలు వడకుట గ్రామ పరిశ్రమలకు మొదటి విద్యగా ఎన్నుకొన బడినది. ఎందుకనగా, దీని గూర్చి తెలిసిన విజ్ఞానము మరి యేయితర పరిశ్రమయందైనను కలుగదు. దీనిలో ఉత్సాహము కలవారు ఈ పనికి సంబంధించిన సాహిత్యము, వివరాలు హిందుస్థానీ తాలీమీ సంఘమువారు ప్రచురించిన వానిని చదువవాలి. కష్టనిష్ఠూరాలను సహిస్తూ యీ పరిశ్రమ, ఈ విద్య ఎంతో అభివృద్ధి అయినదో ప్రస్తుత నివేదికవలన తెలుస్తున్నది. కర్మద్వారా విద్యా ప్రణాళికను ఈ రోజులలో గల పాశ్చాత్యులన్ని మహాపండితులు గ్రహించ గలిగినారు. అందులో ముఖ్యంగా మన హిందూదేశములో దీనికి ఒక ప్రత్యేకత ఉంచన్నారు. ఇందువల్లనే బాగా తెలిసిన యువతీ యువకులు దీని విజయమునకై, ప్రచారము చేయుటకు కావలసి యున్నారు.

## (ఆ) ప్రయోజన విద్య

హిందూదేశములో నూటికి ఏడుమంది మాత్రమే చదువుకున్న వారనుట నిజమైన విషయము. ఇది విచారకరమైన మాట. ఏదో కొంచెము చదువుకున్నంత మాత్రాన దానిని విద్య అనేకాలము కనుక మొత్తముమీద నూటికి 99 మంది చదువు రానివాళ్ళే ఉన్నారన్న మాట. చదువు రానివాళ్ళలో నాగరికులుండవచ్చును కాని చదువు వచ్చినందువలన వారి మనస్సులు వికసించును. తద్వారా ఇతరుల మనోభావముల నర్థము చేసికొనగలరు. కేవలము చదువను వ్రాయుట మాత్రమే పెద్దలకు శిక్షణగా చాలదు. దీనిలో ఎంతో ఉపయోగకరమగు సాధారణ జ్ఞానమిమిడియున్నది.

ప్రతి గ్రామము తన ప్రదేశంలోనున్న విద్యా విహీనతను నిర్మూలించుటకు పూనుకొనవచ్చును. పెద్దలకు శిక్షణ ఇచ్చుటకు సాధారణముగా సాయంకాల సమయము అనుకూలము. ఇందుకు దీపాలు కావలసియుండును. కాబట్టి వాటిని ఏర్పాటు చేసికోవాలి. పుస్తకము లక్కరలేదు. పూర్వకాలములో ఉపయోగించినట్లు పలకగాని నల్ల

బల్లగాని ఉపయోగించుకొనవచ్చు. దీనిమీద వ్రాయుటకు సీమసున్నముగాని సుద్దగాని సులభముగా సంపాదించవచ్చు. పాఠములు చెప్పుటకు కావలసిన చిత్రములు మొదలైనవి తయారైయున్నవి. వాటిని కొనుక్కోవచ్చు. కాని, ఇవి అన్నీ అంత అవసరములు కావు. పనిచేసేవారికి ఉత్సాహము, ఇచ్ఛాశక్తి ముఖ్యము. సమష్టి సహకారము ఉపయోగకారి. కొంతమంది పెద్దవాళ్ళు నేర్చుకొన్నపిదప ఒక పుస్తక భాండాగారము చిన్నది స్థాపించాలి. అందులో పత్రికలుకూడ ఉండాలి.

మాటలను నోటితో చెప్పించి చాలా జ్ఞానం కలిగించవచ్చు. పురాణములను, మైలాద్ షరీఫ్‌లాంటి గ్రంథాలను హరికథా కాలక్షేపములలో కూడా మహమ్మదీయులచేత వల్లింపచేసేవారు. మహాపురుషుల కథలు, ప్రవచనాలు, సంకీర్తనలు, మౌలాద్ ముబారకలన ఎంతో మతసంబంధమైన జ్ఞానమును సంపాదించినారు. చరిత్ర, విజ్ఞానము, ప్రస్తుతవిషయాలు మొదలైనవి నోటితో చెప్పి, చదివించి బోధించవచ్చు. ఇందుకు పనిచేసేవారు తాము ముందుగా ఈ విషయములో పరిపూర్ణ జ్ఞానము సంపాదించుకొని వుండాలి. ఇట్టి విద్యావ్యాప్తిలో ప్రజలు తమ జాతీయతను, ఐక్యమును, సహకారమును పెంపొందించు కొనుటకు అవకాశములు పరిపూర్ణముగా లభిస్తాయి, గ్రామ పునర్నిర్మాణమునకివి అత్యావశ్యకములు.

## (౯) స్త్రీల అభ్యుదయము

స్త్రీ శక్తిస్వరూపిణియనియు, సమస్తమైన శక్తులకు ఆధారరూపిణియనియు హిందువులు ప్రాతాచారంగా చెప్పుకుంటూ ఉంటారు. ఆమె పురుషుని అర్ధాంగి అన్నారు. కాని నేటి సంఘములో స్త్రీ, తనకు బాధ్యతగల పనిగాని, తాను నేర్చుకొనవలసిన విషయములోగాని, ఏ అనూచానాచారమును చేతనో, ఏ సాంఘిక నియమానుసారముగనో జోక్యము తీసికొనకపోవుట పరిపాటి అయిపోయింది. ఏ సంఘమైనా తనలోని సగభాగమును త్రొక్కియుంచినయెడల అది అభివృద్ధి గాంచదు. బిడ్డ పసితనములో తల్లివద్దనుండియే జ్ఞానమును సంపాదించును. తల్లి అజ్ఞానములో వుంటే మంచి కుమారులనెట్లా కనగలదు ? కాబట్టి మనము మనసులోనుంచి స్త్రీలయెడగల "తక్కువ చూపును"ను తగ్గించుకొని వారికికూడ సమానహక్కులను ఇవ్వాలి. అంటే, స్త్రీ మగవాని పనిచెయ్యవలెనని గాని, మగవాడు ఆడదాని పనిచేయవలెనని గాదు. స్వభావసిద్ధమైనవి, న్యాయమైనవి, బాధ్యత నీయగలిగినవి —వీటిని నిర్లక్ష్యము చేయరాదు. ఇంతకుమించి ప్రతివిషయములోనూ స్త్రీ పురుషులలో విభేదములుగా నిబంధనలు ఉండకూడదు.

అనవసరము, అసత్యము, అధర్మమైన అడ్డంకులను ఆచారాలను వెంటనే తొలగించాలి. ఇవి సంఘానికి అసహాయకరములు—

౧. ఘోషాపద్ధతి పోవాలి.

౨. స్త్రీలు సమానాధికారముతో సకల కార్యములలో పాల్గొనాలి.

౩. బాల్య వివాహములు ఆగిపోవాలి.

౪. విధవావివాహములను ప్రోత్సహించాలి.

౫. ఎక్కువ భార్యలుండుటగాని, ఎక్కువ భర్తలుండుటగాని వెంటనే నిలిచిపోవాలి.

౬. సమానాధికారములను తొలగించునట్టి, హక్కుల కడ్డుపడునట్టి లాలో మార్పులు తీసికొని రావాలి.

౭. ఆడపిల్లలు మగవారితో సమానముగా చదువు కొనుటకవకాశములుండాలి. ఉద్యోగమునకు సంపాదనకుకూడ శక్తిపరులై వుండాలి.

౮. ఆడువారు ఆడవారి కెక్కువ సేవ చేయగలరు. ఆడవారికి విద్య నేర్పుట చాలా అవసరమైనపని-రాట్నముమీద పని. అంతె అవసరమైనదే. అసలు నూలు తీయుట ఆడదాని ముఖ్యవృత్తి, దీని వలన ఇంటికి ఆర్థిక సహాయము చేయుటలో ఈమెకు పూర్తి బాధ్యత ఉన్నది.

౯. వైద్యము, చదువు చెప్పుట, మంత్రసాని పని, రోగులకు సేవచేయుట ఇవి స్త్రీలకు సరియైన పనులు. ఆడపిల్లల నీ వృత్తి విద్యలకే పంపి ప్రోత్సహించవలెను. వారిని ఎన్నో చేతి పరిశ్రమలలో తరిబీతుకూడ చేయవచ్చు. నిర్మాణ కార్యక్రమములోని ఇతర విషయములలో వలెనే, ఈ పనికికూడ ముందుగా ఇంటిలో సంస్కారం పొందాలి. అప్పుడే తనతో సంపర్కము గలవారి దృష్టిని తన యుద్యమము మీదికి మరలింప కల్గుతారు.

## (౧౦) ఆరోగ్యమునకు, పరిశుభ్రతకు సంబంధించిన విద్య

ఇది 4 వ అధ్యాయములో కొంత చెప్పబడినది. అయినా శరీరమును మనస్సును దృఢముగా నుంచుకొనుటను గూర్చి స్పష్టీకరించవలసి యున్నది. ఇందులకు సక్రమమైన అలవాట్లు, ఆరోగ్యకరమైన భోజనము, శరీరపరిశ్రమ, అన్నిటి కంటె ముఖ్యమైనది ఇంద్రియ నిగ్రహము చాలా అవసరములు.

మనలో చాలామంది మంచి అలవాటులను, క్రమపద్ధతిని, వేళకు తినుట, నిద్రించుట మొదలగు వాటిని లెక్కచేయరు. మనము తినేది రుచికరముగా నున్నదనియే కాని ఆరోగ్యమైనదో కాదో చూడము బ్రతుకుట కొరకే తినుచున్నామన్న సంగతి మరచిపోతూ వుంటాము. బీదవాళ్ళు మితాహారమును తినవలసినంత అవసరము లేక పోయినా భాగ్యవంతులు, మధ్యరకం మనుష్యులు మాత్రము మితాహారమును గురించి శ్రద్ధ తీసికొన వలెను. అన్నము చాలక బీదవాడు మంచమెక్కును. మనకెంత ఆహారము కావలెనో మితముగా ఎట్లుండవలెనో తెలిసికొను శక్తి మనలోనే ఉన్నది. తక్కువగా కొద్ది పదార్థము తేలికగా అరుగుతుంది. పప్పుదినుసులు, బియ్యము తదితర ధాన్యములు మొదలగు ఆహార పదార్థములోని జీవాణువులు ముందుగనే తీసివేయబడినవి. ఉల్లి, బొప్పాయి, మామిడి, బనానా, జామి, టొమాటో మొదలగు పండ్లు పల్లెలలో విరివిగా పెరుగును. వీనితో కలిసిన భోజనము పూర్ణమైనది.

శరీర కష్టము చేసేవారు ప్రత్యేకము వేరే పరిశ్రమ చేయ నవసరము లేదు. ఇతర ఉద్యోగములలో ఉండేవారికి పరిశ్రమ అవసరము. స్కూలు కాలేజీలలోని విద్యార్థులు శరీర పరిశ్రమ చేయక శరీరాన్ని మెదడును కూడ అతి బలహీనంగా చేసి కొంటారు. శరీర పరిశ్రమచేస్తూ ఉండాలి. అందువలన ఏదో ఉపయోగకరమైన పని చెయ్యాలి, అట్టి శరీర పరిశ్రమ చాలా మంచిది. కాని ఇది అందరికీ కుదురదు. షికారు, ఆటలు, యోగాసనాలు మొదలగునవి తమతమ పరిస్థితులను బట్టి నిర్ణయించుకోవాలి.

సాధారణ భోజనము పవిత్ర జీవనము, సక్రమమైన శరీర పరిశ్రమ—ఇవి శరీరారోగ్యము నిచ్చుటయే గాక మేధాశక్తిని పెంచుతవి. పవిత్ర జీవనానికి ఇంద్రియ నిగ్రహాల అత్యావశ్యకము ఎంత మితాహారి అయినా, ఎంత దేహపరిశ్రమ చేస్తున్నా, తన దుర్గుణాలను అరికట్టుకొనక వ్యసనములలో మునిగి తేలువాడు ఆరోగ్యవంతుడు కాజాలడు. అతడు తన మనస్సును అరికట్టుకొనిన గాని దుర్గుణాలను నిలుపుకొన జాలడు. చదివే పుస్తకాలనుబట్టి, చేసే స్నేహితాన్నిబట్టి, గడిపే కాలాన్నిబట్టి, జరిపే దేహపరిశ్రమనుబట్టి, తినే తిండినిబట్టి మనసు పవిత్రమవుతుంటుంది. తిండి, పరిశ్రమ ఎంత ముఖ్యమో స్నేహితులు, పుస్తకాలుకూడ అంతే. బలముకలిగి, దృఢమనస్సుకలిగి పది మందిని చేర్చగల వ్యక్తిని చుట్టుప్రక్కలనున్న దుర్మార్గులు చెడగొట్టవచ్చును. కాబట్టి పని చేయువారు పవిత్రమైనట్టి ఆరోగ్యకరమగు జీవితాన్ని గడుపుతూ,

ఆరోగ్య పరిశుద్ధతా సూత్రాలను ప్రచారము చేస్తూ, తన చుట్టు పక్కల వారికికూడ భాగ్యము, ఆనందము కలుగ చేయాలి.

## (౧౧) జాతీయ భాషా ప్రచారము.

పరస్పర సంభాషణకు, బోధనా పద్ధతులకు ఇంగ్లీషు భాష బలవంతముగా పెట్టినందున హిందూదేశము పూర్తిగా నష్టపడినది. బోధింపబడు విషయముకంటె బోధించు భాష మీదే ఎక్కువ ఏకాగ్రత ఉంచుటవలన బాలుర మేధస్సుపై మరింత బరువు పడుతున్నది. మాతృభాషలోనే పాఠములను బోధించుట సులభమయిన పద్ధతి అనేది నిర్వివాదాంశము. ప్రతి విషయాన్ని మాతృభాషలోనే బోధిస్తూ మాతృభాషలోనే ఆలోచిస్తూ ఉండడం స్వభావానుకూలమయినది. అదేకాక మన దేశములాంటి పెద్ద దేశమునకు అంతర రాష్ట్రీయ భావైక్యమునకు జాతీయ విషయాలకు ఏక భాషా వ్యాసంగము అవసరము. జాతీయ భాష సులభముగా నేర్చుకొన దగినదిగాను అర్థము చేసుకోదగినదిగాను ఉండాలి. మన అదృష్టంవలన ఉత్తర మధ్య హిందూస్థానములలో మాట్లాడు భాష అంత స్వచ్ఛము కాక పోయినప్పటికీ మన దేశపు ఇతర భాషలతో పోల్చదగియున్నది. కాబట్టి యీ భాష ఇంచుమించుగా మన దేశములో సగము మంది అర్థము చేసుకొనగలుగుతున్నారు. ఈ భాషలోని చాలామాటలు ఇంచుమించు ఇతర భాషలలోని చాలా మాటలతో సమానముగా ఉన్నాయి. ఇదే హిందూస్థానీ భాష ఇదే జాతీయ భాషగా అందరూ ఒప్పుకొన్నారు. దీనిని ప్రతివారూ తప్పక నేర్చుకొనవలసి యున్నది. ఈ భాష నేర్చుట గురించిన చిన్న తగాదలలోనికి మేమిప్పుడు దిగము. ఈ భాషను ముందుగా నేర్చుకొనుట ధర్మము. దీనిని దేవనాగరి, పెర్షియన్ లిపులలో వ్రాయుట చదువుట నేర్చుకోవాలి.

## (౧౨) మాతృభాషపై ప్రేమను పెంపొందించుట

అంతర్జాతీయ వ్యవహారములకు సామాన్యభాషను అవసరమని వెనుక వ్రాయబడినది. అట్లాగే మాతృభాషలనుకూడా అభివృద్ధిపరచుటవలన ఒక జాతి అభివృద్ధి ఆ జాతిలోని సంస్కృతి స్థిరముగా నిలుపగలవు. మాతృభాష మనస్సులోని సూక్ష్మమయిన ఊహాలను వెలిబుచ్చుటకు మంచి సాధనము. మాతృభాష ఎన్నో ఏండ్లనుంచీ తన నైతిక ఆధ్యాత్మిక ధర్మములను పెంపొందించుకుంటూ తన సాహిత్యమును ఉన్నతస్థితిలో ఉంచినది. ఇట్టి మాతృభాషలను భద్రపరచుట మన కర్తవ్యము. రాష్ట్రభాష, మాతృ

భాషల మధ్య ఏవిధమయిన వైషమ్యమూ ఉండకూడదు. ఈ రెండూ ప్రక్క ప్రక్కన పెరుగుతూ తమతమ కర్తవ్యములను నెరవేర్చుకుంటూ దృఢముగా ముందుకు సాగిపోవుచుండాలి. ప్రతిమనిషి తన భాషలో పరిపూర్ణ పాండిత్యము సంపాదించుట అవసరము. అంతియేకాక దాక్షిణాత్యులు ఉత్తరదేశపుభాష ఎట్లా నేర్చుకొంటున్నారో అట్లాగే ఔత్తరీయులుగూడ దాక్షిణాత్య భాషలను నేర్చుకొనుట మంచిది.

## (౧౩) ఆర్థికసామ్యమునకై పనిచేయుట

నేడు మన సంఘములో ఆర్థికసామ్యము బొత్తిగాలేదని చెప్పుకొన్నందువల్ల లాభములేదు. ఒక దేశముకంటె మరియొక దేశము భాగ్యవంతమయినది. అంతెందుకు? ఒక దేశములోనే మనుష్యులలో మనుష్యులకు, సంఘాలలోసంఘాలకు విపరీత భేదములు ఉన్నాయి. ఇంగ్లండు అమెరికాదేశాలు భారతదేశముకంటె భాగ్యవంతమయినవి. భారతీయుని సంవత్సర సగటు ఆదాయము 50 రూ॥లు అన వచ్చును. ఇంగ్లండులో 1800 రూ॥ అమెరికాలో 3000 రూ॥లు. ఈ దేశాలలోకూడా ఒక ప్రక్క నిరుద్యోగమువలన దరిద్రులైయున్న కార్మికులు మరియొక ప్రక్క కోటీశ్వరులు కనుపిస్తున్నారు. ఇదేవర్గ భేదము మన దేశములోకూడ ఉన్నది కాని మన దేశములో మేడమిద్దెలకంటె గుడిసెలెక్కువగా ఉన్నాయి! యుద్ధాలు, అందులో ఇప్పుడు జరుగుచున్న ఘాతుక యుద్ధము తమలో తాము భూమి భాగ్యము కోసమై దేశాలు సాగించేవని మనకు తెలియును. నేటి సంఘములు, ఇట్టి సాంఘిక జీవనము ఉన్నంతకాలము యీ యుద్ధాలు తప్పవు. ఈ భూమిమీద శాంతము సుఖము కావాలంటే ఇప్పుడున్న భేదాలు నశించిపోవాలి. శాంతి సుఖములను స్థాపించుటకు ప్రచండ విప్లవాలనులేప యత్నించారు. ఇందులో చేకూరిన విజయము దౌర్జన్య పద్ధతులను తీసివేసిననాడు ఎంతకాలము నిలుచునో చూడవలసి యున్నది. సామ్యము బయట వారివ్వగా తెచ్చి యిచ్చిన శాశ్వతముగా నిలచునది కాదు, ఇది దోపిడీ, ఆక్రమణ పద్ధతులనణగ ద్రొక్కుకున్ననాడు తనంత తానే ప్రతివానిలోనూ ఏర్పడుతుంది. ఇట్టి మార్పు ప్రతివానికి తన మనసుకు మంచి శిక్షణ నొసంగిననాడే కల్గుతుంది. ఈ విధమైన శిక్షణ దేశమునందంతటను తేగలిగినచో, కొంచెము కష్టమైనప్పటికిని తప్పకుండా సాధ్యపడుతుంది. అట్టి మనో వృత్తి సాధారణంగా అహింసా పద్ధతులమీదనే అలవడును. అందరు మనుష్యుల ప్రకృతులు, చాకచక్యము తెలివి, కార్యదక్షత ఒకే మాదిరిగా ఉండవు. నేటి సంఘములో ఈ తారతమ్యము వికృత సాంఘిక సౌకర్యాలవల్లనో లేదా పుట్టుక, విద్య, ఆదా

యయు మొదలగు వానివలన కలిగే అసౌకర్యాలవల్లనో పెచ్చుపెరిగి పోతున్నవి. ప్రకృత సాంఘిక పరిస్థితులు నిర్బంధము వలన తొలగి పోవచ్చును కాని స్వభావ సిద్ధమైన సామ్యము మాత్రము అలవడదు. స్వభావసిద్ధమైన సామ్యవాదము ఇతరులమీద, సంఘముమీద, దేశముమీద ఉపయోగించవచ్చు. అహింసాసిద్ధాంతము పునాదిగల దేశములో జనులందరికి దీనిని బోధించవచ్చును కాని అటువంటి సంఘము ఇంకా పుట్ట వలసి యున్నది. ఇప్పుడున్న తారతమ్యాలు తగ్గించుకొని క్రమేణ అహింసాపద్ధతుల సాయంతో నిర్మూలించాలి. ఇదెట్లా ?

ఒక్కొక్క వ్యక్తిముందుగా ఆరంభించి తమతమ తత్వములను ఉదాహరణ పూర్వకంగా ప్రసరింప చేయాలి. తాను భాగ్యవంతంగా ఉంటేనే ఆరోగ్యము ఆనందము కలుగుననే జాతిని విడిచి పెట్టాలి. మన యవసరములకు మితముగా ఖర్చు పెట్టుకొని మిగిలినది ఇతరుల మంచి కొరకే వినియోగించుట ఒక నైతిక ధర్మముగా స్వీకరించాలి. నిరాడంబర జీవనము, ఉత్కృష్ట ఆలోచన మనలను పైకి లేపును. నిరాడంబరము, తృప్తి గల జీవితము ఇతరులలో తప్పక ప్రసరిస్తుంది. జన్మతో వచ్చిన గౌరవము, ఆస్తిపాస్తుల వలన కలిగిన ఉచ్చదశ, సేవక గుణమునకు అదే గౌరవము, ఉచ్చదశను ఈయవలెను. ప్రభుత్వ మీ పనిని చేయుచుండవచ్చును. మనము మాత్రము ఈ వర్గభేదములను నిర్మూలించుటకై తగిన లా పన్నులను విధించునట్లు చేయుట మన ఆదర్శము కాని అహింసాసిద్ధాంతముగల దేశములో ప్రభుత్వము ఈ పనిలో శౌక్యము కల్పించుకొనదు. మన దేశములో మనకు అధికారము లేదు గనుక మనము స్వంతముగా సాధ్యమైనంత వరకు పని చేయవచ్చు. పెట్టుబడి దారులు, మిల్లు యజమానులు తమ కూలీలకు ఎక్కువగా కూలీయిచ్చి జీవితపరిణామమును ఎక్కువ చేయవచ్చు. ఎట్లనగా ఆరోగ్య కరమగు ఆహారము వారికి సంపాదించ గలుగునట్లు, కావలసిన దుస్తులు కొనగల్గునట్లు వసతిగృహాలు, పిల్లలకు వారిమీద ఆధారపడి యుండు ఇతరులకు చదువు, ఆటపాటలు సంస్కృతి, జ్ఞానము కల్గునట్లు యేర్పాటులు చేయాలి. లాభాలను కార్మికులకు పంచి యింకా ముందంజవేయవచ్చు. తమకు కావలసిన ధనము నుంచుకొని మిగిలిన లాభమును దేశము కొరకు వినియోగింపవచ్చు. జమీందారులు తమ రైతులను న్యాయముతో పాలించాలి. వారి ఆదాయములో మిగిలిన కొంత పైకము వారి మంచి కొరకే వినియోగించాలి. ప్లీడర్లు, డాక్టర్లు మొదలగువారు కూడ ఇదే విధముగా చేయాలి. జన సామాన్యము కొరకు ధనమును అందరూ వినియోగింప పూనుకొన్నచో, వర్గ తారతమ్య

ములు తీసివేసి అందరూ సమానముగా నుండుటకు ఎన్నో ఆరంభ ప్రయత్నములు చేయవలసియున్నది. కాన ధనవంతులు తమ ధనమును దుర్వ్యయము చేయకుండా ఉండుట ముఖ్యము. ఇందువలన కార్మికులనుకూడ సాధ్యమైనంత వరకు సమాన పంథాలోనికి తీసికొని వచ్చి ఆదర్శ సంఘమును నిర్మించుట కవకాశములున్నవి. గాంధీజీ ప్రత్యేకముగా నిర్వచించిన నిర్మాణ కార్యక్రమములలోని 13 విషయాలను గురించి చెప్పినాము. ఆలోచించి తగినవి ఇంకాకొన్నికూడ ఉన్నాయి. ఇవికూడ సక్రమమైన పద్ధతులుకలవి కనుకనే, త్రయోదశ విధానములను కొనసాగించుటకు సదుపయోగ పడుపవచ్చు.

## (౧౪) కాంగ్రెసు సంఘటన

స్వాతంత్ర్య యుద్ధమునకు జనులను కేంద్రీకరించుట నిర్మాణ కార్యమునకు ప్రథమ సోపానము. మనకు కాంగ్రెసు అనే జాతీయ సంస్థ ఉన్నది. మనము రైతులను కార్మికులను, విద్యార్థులను కూడ చేరదీసికొన వచ్చును. ఈ సంస్థ పనులు తదితర సంస్థల పనితో పోటీగా యుండవచ్చును కాని అహింసయే ఆధారముగా నున్నచో, పోటీ అనేది లేనేలేదు. మత భేదమునుగాని, భిన్నాభిప్రాయమునుగాని, పూర్తిగా నిర్మూలింపవచ్చును. వీటినిగురించి కొంచెముగా వివరించుట అసమంజసముకాదు.

అన్ని మతములు, తరగతులు, అన్ని కులాలవారు కలసి సభ్యులైన సంస్థయే కాంగ్రెసు. ప్రణాళికపై సంతకము చేసి సాలుకు నాలుగణాలు చందానిచ్చినవారు సభ్యులగుదురు. కాంగ్రెసు నియమావలి ప్రకారం అనుసరించే ప్రతి సభ్యుడు, ఏ కమిటీ ఎన్నికలకైనను అభ్యర్థిగా నుండుట కర్హుడు. వర్గ తారతమ్యము, జాతిమతము, కులము, స్త్రీ పురుష భేదాల నిది గణింపదు. ఎవరైనా సరే సేవకై నడుము కట్టుకొని పూర్ణస్వాతంత్ర్యములో పనిలో దిగి కాంగ్రెసు విశ్వాసమును జయించవచ్చును. జనుల యొక్క అభిప్రాయాల ననుసరించి అతడు పూర్ణస్వాతంత్ర్యములో తన ఇష్టము వచ్చినట్లు కార్యమున కుపక్రమించవలెనేగాని అతనికిపైనుండి ఆజ్ఞ అనుజ్ఞల నిచ్చువారులేరు. అతని యంతరాత్మ అతని దృఢసంకల్పమే అతని కాజ్ఞ నీయదగినవి. కాబట్టి ప్రతి కాంగ్రెసువాది ఇతరుల కే యనుమానము లేకుండా కేవలము ధర్మము, బాధ్యతలనే స్వీకరించవలెను. జనులను మాయచేసి సభ్యులుగా చేర్చుకొనుటలేదు. ఎన్నికలు అన్యాయపు పద్ధతులకు దూరముగా నుండును. కాని, యీ పద్ధతులన్నియూ నేడు సరిగా జరగడము లేదని చెప్పుట మిక్కిలి శోచనీయము. సంస్థ బలాన్ని తగ్గించి, దీని

దయాపయుక్తతను క్షీణింప జేసే యీ పొరపాటులను సవరించుటకు ప్రతి కాంగ్రెసు వాది తోడుపడాలి. కాంగ్రెసు సంస్థగాని, దాని పనిగాని, మరియే ఉద్యమము గాని తరచు తప్పుదారిని పడినప్పుడు దానిని తెలిసికొనడానికి సిద్ధం. కాంగ్రెసు అవిశ్వాసము, దురన్యాయమునకు లోబడియుండదు. అది తన సభ్యుల, ప్రజల పూర్తి విశ్వాసమును పొందియే సంపూర్ణబలమును సంపాదించగలదు. న్యాయముగా సభ్యులను చేర్చుటయే కాకుండా కాంగ్రెసువారి ఎన్నికలలో దుష్ప్రవర్తనను అరికట్టాలి. ప్రజలు ప్రశ్నించునప్పుడు భయము అభిమానములు లేకుండా, పక్షవాదుల ప్రోద్బలమునకు లోబడక జాతిమత వర్గ తారతమ్యములను లక్షింపక సమాధానము తీయవలసియున్నను కాంగ్రెసు సార్వలౌకిక విశ్వాసము, మర్యాద సంపాదించ గల్గినప్పుడే తన జాతీయతా తత్త్వమును నిల్పుకొని తలయెత్తి తిరుగ గలదని ప్రతివారు గమనింపవలసి యున్నది. కాంగ్రెసు కేంద్ర సంస్థగాని, దాని ప్రాంతీయ శాఖాసంస్థగాని దుర్మార్గమునకు దూరముగానుండనిచో, తాను సంపాదించగల శక్తిని, పలుకుబడిని మాత్రమేకాక తన జాతీయ నైతిక లక్షణాలనుకూడా పోగొట్టుకొనును.

## (౧౫) రైతు సంఘటన

హిందూదేశములో రైతులు, వారి క్రింద పని చేయువారు నూటికి ౮౫ మంది యున్నారు. త్రయోదశ కార్యవిధానము వీరి సహాయార్థము లేకపోతే అది నిరుపయోగము. పల్లెలలోచేయు ప్రతిపనియు వారి లాభమునకుపయోగపడవలెను. అసంఖ్యాకులైన వారిని బాధించునది, నిర్లక్ష్యము చేయునది నిజమైన నిర్మాణ కార్యక్రమము కాజాలదు. నిర్మాణ కార్యక్రమమును బాగుగా అర్థము చేసుకుంటే, నిజమైన సేవ అక్షరాలా రైతులకే చేయవలసియుండునని తెలియును. ఈ విధముగా తెలిసికొన్నవాడు ప్రత్యేకముగా రైతు సంస్థ ఏర్పడుట అనవసరము. రైతులు కాంగ్రెసు సంస్థను స్వంతముగా భావించి ఇందులో చేరవలెను. ఈ సంస్థ వారిని ఉద్ధరించి సహాయము చేయలేనిచో దాని శక్తి నేడు క్షీణించి పోవును. రైతుల కేవిధముగా సహాయపడవలెనో దిగువ వివరింపబడినది. రైతులకు తమ భూస్వాములతోగాని, గవర్నమెంటుతోగాని యిబ్బందులుండుట సహజమైన విషయము. ఆ యిబ్బందులు చాలా అవసరమైనవి కనుక స్వరాజ్యం వచ్చేవరకు ఆగనలవి కాదు. ప్రతి కాంగ్రెసువాదియు రైతులలో కలసి వారి కష్టములను తొలగింపజేస్తూ వారిని ఒక దారికి తీసుకొనివస్తుండాలి. అహింసతో కూడిన రాయబారముల వలన వారి కష్టములను తొలగించవచ్చు. ఈ పద్ధతి ఒకవేళ

అపజయమును పొందితే సహాయ నిరాకరణము, పన్ను లివ్వకుండుట, మొదలగునవి చేయుటకు వారికి పూర్తి హక్కు గలదు. ఎంత పెద్ద కష్టము వస్తే అంత ఎక్కువగా కోరుట న్యాయమే. అహింసలోనే యీ యలజడిని సాగిస్తే, విజయము తప్పక త్వరలో చేకూరగలదు.

రైతు లెదుర్కొనవలసిన ఇంకా కొన్ని ఇబ్బందులున్నాయి. తమలో తాము దెబ్బలాడుకొని కోర్టులకెక్కి దివాలాలగుదురు. సేవకుడు తన సేవవలన వారి గౌరవము వారి విశ్వాసమును సంపాదించిననాడు వారిలోని భిన్నాభిప్రాయములను ద్వేషములను, కోర్టులకెక్కకుండా సర్దుబాటు చేయగలడు. ఇదే పద్ధతి భూస్వామికి, రైతుకుకూడ చెల్లుతుంది. ఏ సంస్థగాని, సంఘటనగాని రైతులను రాజకీయములలోనికిగాని, తదితర యేపనికిగాని లాగుట అవసరముకాదు అని ఇచ్చట నొక్కి చెప్పవలసియున్నది. కాంగ్రెసు రైతులకు సరియైనసేవ చేయువారు కాంగ్రెసుయొక్క ఉపయుక్తత, శక్తి, సహృదయమును చూచి తమంతతామే కాంగ్రెసులో చేరుదురు. తమ స్వలాభంకోసం రాజకీయాలలో చేరమనిగాని, ప్రత్యేకంగా ఒక సంస్థను నిర్మించుకొని తద్వారా పని చేయుమనిగాని అడుగుటకంటె రైతు తనంతతానే సంస్థలో చేరిన, ఆ సంబంధము శాశ్వతంగానూ, నిర్లోభత్వముగానూ ఉంటుంది.

రైతులలో సహకార విధానముమీద వ్యవసాయం చేయుపద్ధతి ఏర్పాటుచేసి, యీ యుద్యమమును ప్రాముఖ్యమునకు, ఉచ్చదశకు తీసికొని రావచ్చు. ఈ ఏర్పాటువలన వ్యవసాయము లాభసాటి వ్యాపారము గాజాలదు. వారసత్వపు హక్కులలో ఆస్తులను విభజించుట మనదేశములో నిలుపజాలము. ఉమ్మడి వ్యవసాయంలో, కాయకష్టమును సమానముగా వినియోగించి, రాబడినికూడా సమానముగా అనుభవించుట కవకాశము లున్నవి. ఈ పద్ధతి మంచిదికూడ. వ్యవసాయాభివృద్ధి ఒకడు తాను స్వయంగా చేసికొనలేకపోవచ్చు. అట్టితటి సహకారం ఉపయోగిస్తుంది. ఇదేవిధమైన మితవ్యయమును పాడి గొడ్ల విషయములోకూడ పాటించవచ్చును. ఉపయోగకరమగుపని జరగాలంటే సహకారమువలననే జరుగగలదు.

రైతులకొరకు చేయవలసినపని యెంతో ఉన్నది గనుక, విదేశవిషయాలకొరకు ప్రత్యేక ఆఫీసు పెట్టుకొన్నట్లే రైతులకొరకుకూడ కాంగ్రెసు ఒక ప్రత్యేక ఆఫీసు పెట్టుకొనుట మంచిది.

## (౧౬) కార్మిక సంఘటన

ట్రేడ్ యూనియన్లద్వారా సంఘటింపబడిన ఫ్యాక్టరీ కూలీలు రైతుసంఘము వలెనే ఒక చిన్న సంఘముగానున్నది. వీరు కర్మాగారములున్న బస్తీలలోనేయుందురు గనుక వీరినందరిని ఒకచోట చేర్చుట సులభము. వీరు ఇంజనులను నడుపుట, మొదలైన పనులు బుద్ధిసూక్ష్మతనుబట్టి చేసుకుంటారు. వీరిలో రైతులకంటె కొంచెము ఎక్కువ తెలివి గలవారుంటారు. పనికొరకు కార్మికులను ప్రోగుచేయుటవలన నష్టములేదు; కాని, రాజకీయాలలోనికి వీరిని గుంజుకొని రాకూడదు. నిర్మాణ కార్యక్రమము రైతులలో చక్కగా పనిచేయగలదు; లాభమునుగూడ పొందగలదు. పనికొరకు, న్యాయమైన వృత్తికొరకు, మంచి సాంఘిక సౌకర్యాలకు ట్రేడ్ యూనియన్లు నెలకొల్పవచ్చునుకాని, కేవలము హర్తాలమునకు, ఏదో గడిబిడచేయుటకుకాదు. ఉద్యోగమిచ్చినవారు తలబిరుసు మనుష్యులైనచో హర్తాలము అవసరమే. అది ఎప్పుడు చెయ్యాలంటే, న్యాయముగా సక్రమముగా విన్నవించుకున్నను అది విఫలమైపోయినప్పుడు హర్తాలమునకు దిగవచ్చును. కార్మికులనుండి మంచి సేవాపరుల సాయము సలహా చాలా అవసరము. గాంధీజీ స్థాపించిన అహమదాబాద్ లేబర్ యూనియన్ ఒక నమూనా సంస్థయని వారంటున్నారు. సేవకులు దానిచరిత్రను, నిర్మాణమును బాగా తెలిసికొని అదేవిధముగ సంఘములను స్థాపించ యత్నించాలి.

## (౧౭) విద్యార్థి సంఘటన

ఈ పనిచేయదగని మరియొక సంఘము విద్యార్థుల సంఘము. ఇతరవాటికంటె భిన్నము. తమ తమ బాధ్యతలను నెరవేర్చుకోవలసిన యితర తరగతి సంఘటనల మాదిరిది విద్యార్థి సంఘటనముకాదు, ఇతరవిషయముల కష్టమువచ్చినదియూ కాదు; కనుక, ఇది భిన్నసంస్థ. విద్యాసంస్థలు ప్రజాసంస్థ గనుక తమకు ఒప్పచెప్పిన విద్యార్థులయొక్క ఆరోగ్యము, తెలివి, నైతిక శారీరకబలము సమకూర్చుటయే ప్రథమ ధర్మముగావుండాలి. కాబట్టి రైతుసంఘము, ట్రేడ్ యూనియన్ల మాదిరిగానే విద్యార్థులకుకూడ ఒక సంఘముండుట అవసరం. కాని, నేటి పరిస్థితులనుబట్టి చూస్తే విద్యాసంస్థలు ప్రజలకు సేవచేయు సంస్థలుగా కనుపించడంలేదు. వారు ప్రభుత్వమునకు సేవకులే గాని వారి బాధ్యత దేశములో సరిపడదు. బ్రిటిష్ గవర్నమెంటు ఇచ్చే చదువులు ఒక ప్రత్యేక ఉద్దేశముకొరకు తాన జాతీయాదర్శములుగల విద్యార్థులకును, విదేశీయశక్తిలో

పనిచేయుచున్న ఉపాధ్యాయులకును వైషమ్యము యేర్పడుతున్నది. విద్యార్థులు తమ చదువుకొరకు, భావి జీవితముకొరకు ప్రభుత్వముమీద ఆశపడియున్నంతకాలము వారు యీ పోరాటములో దిగజాలరు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుచూ రాజకీయాలలో పాల్గొనిన సాగుచున్న ఈ కొద్దిపాటిచదువుకూడ తగ్గిపోతుంది. విద్యార్థి సంఘటన దేశములోని కష్టనిష్ఠూరములను తొలగించి శాంతిని నెలకొల్పుటకుకాను చేయడంలేదు. విద్యావిధానములోని తప్పులను లోటులను సవరించుట కేర్పాటుచేయుటకే యీ సంస్థను స్థాపించాలి. ఈ సంస్థ దేశభక్తిగల యువకులను తయారుచేయును గాని వీరిచే రాజకీయ యుద్ధములను చేయించదు. అంటే స్వాతంత్ర్యయుద్ధములో విద్యార్థులకు చోటు లేదని ఉద్దేశముకాదు; తప్పకుండా ఉంది. ముందు విద్యార్థులుగానేవుండి తమ విద్యతోపాటు నేటి విషయాలు బాగుగా అర్థముచేసికొని పిదప తాము స్వయముగా తయారుకావలసినదేగాని ముందుగానే యీ పోరాటములో పాల్గొన ప్రయత్నించ నక్కరలేదు. జాతీయోద్యమములో పాల్గొన ఇచ్చగలవారు ప్రభుత్వపాఠశాలలోనుండి వెలుపలికివచ్చి దేశసేవకై నడుముకట్టుకుంటారు. అప్పుడు విద్యార్థి సంఘములో వారు సభ్యులుగా ఉండరు. అయినను అందరికీ వర్తించినట్లే యీ త్రయోదశ నిర్మాణ కార్యక్రమము వారికికూడ వర్తిస్తుంది. వారు దీనిలోని ఎన్నో విషయాలకు సహాయము చేయవచ్చును. మత విద్వేషములను, మూఢవిశ్వాసములను నిర్మూలింపవచ్చు. తమలో తాము అస్పృశ్యతను తీసివేసికొనవచ్చు. ప్రతిరోజూ కొంతసేపు నూలు వడకవచ్చును. క్రొత్త పనిముట్లను, తయారుచేయుటకై తమ తెలివిని, చాతుర్యమును చాకచక్యములను ఉపయోగింపవచ్చు. వారు ఖద్దరు ధరించకపోతే క్షమించదగిన విషయముకాదు. పెద్దలకు శిక్షణ ఇవ్వవచ్చును; నిరక్షరతా నివారణమునకై సాయంకాలము కొంచెము కాలమును వినియోగపరచవచ్చు. తమ తమ మాతృభాషలలో పూర్ణ పాండిత్యము సంపాదించుట కవకాశములున్నవి. జాతీయభాష నేర్చుకొనవచ్చును. తమ తమ కుటుంబాలలోని స్త్రీలకు అధికారములనిచ్చి, సంఘ దృష్టిపథాన్ని మార్చి సాంఘిక సంస్కారం సాధించాలి. నిరాడంబరంగా జీవిస్తూ, తృప్తితో ఆర్థికసామ్య ఆదర్శమునకై పనిచేయవచ్చు. సెలవుదినాలలో పల్లెటూళ్ళకుపోయి అక్కడ సేవాధర్మమును చూపించవచ్చు. ఈ పనులను చేయుటలో తలిదండ్రులతోగాని, పాఠశాల ప్రముఖులతోగాని దెబ్బలాడ నవసరములేదు. పైగా, యీ పనివలన వారికి ఎంతో ప్రత్యక్ష అనుభవము, భావి జీవితానికి తోడ్పడు ఎంతో మైత్రి కల్గుటకు మంచియవకాశము లభించుటయేకాక ముందు ముందు వారు మంచి దేశసేవకులుగాకూడ తయారు కాగలరు. ఈ పద్ధతులమీద నెల

కొల్పబడిన సంస్థ తన కర్తవ్యమును నెరవేర్చుకొనుటయే కాక విద్యార్థులనందరిని సేవాపరుల జట్టుగా ఏర్పరచుటకూడా చేయగలదు. విద్యార్థులలో సౌభ్రాత్రమును ఐక్యమును పునరుద్ధరించి విద్యార్థుల ప్రేమ విశ్వాసములకు పాత్రులగునట్టి సేవా తన్మయులు కావలసియున్నది. కోపమునకు, అసూయలకు, స్వార్థమునకు సేవాపరులు దూరంగా వుండాలి. ఉద్రేక ప్రవాహములో కొట్టుకొని పోగూడదు; నిరాశా వాతావరణములో స్తబ్ధులై యుండకూడదు. పూర్ణవిశ్వాసముతో నమ్మకముతో భక్తి శ్రద్ధలతో, యువకుల కలయికలో సేవాపరులు పనిచేస్తుండాలి.

## ఉపసంహారము

గాంధీజీ వ్రాసిన నిర్మాణ కార్యక్రమమునకును స్వాతంత్ర్య యుద్ధమునకును గల దగ్గర సంబంధము పూర్తిగా విశదమైనది. ఏ రాజకీయ దృష్టితో చూచినా ఏ జాతి వర్గమునకుచెందినా హిందూదేశమునకు పూర్ణ స్వరాజ్యము కోరని భారతీయుడు లేడు. ఈ కార్యక్రమములో వివాదాంశ మొక్కటికూడా లేదు. ఇది అన్నిటిని కలుపుకొని అన్నిటిని ఆవరించియున్నది. నమ్రత, వినయముగల గంభీరవ్యక్తికికూడ దీనిలో కావలసినంత చోటు దొరకుతున్నది. ఇది స్త్రీ పురుషులకు యువక వృద్ధులకు పనికివస్తుంది. ఈ కార్యప్రణాళిక అందరికిని ఉత్సాహము చూపి, వారిచే తెలివితో, శక్తితో, నమ్మకముతో, బలముతో అనుసరింపబడుతూ, హిందూదేశమునకు అనతికాలములోనే స్వరాజ్యమును సంపాదించ గలదని ఆశిస్తున్నాను.

# అనుబంధము

## మహాత్ముని నిర్మాణ కార్యక్రమము అష్టాదశ సూత్రములు

### 1. మత సామరస్యము

దేశమందంతటను సంఘీభావము వ్యాపింపజేయవలెను. వివిధ జాతిమత భేదములు ప్రతిబంధకములు కాకూడదు. విద్యాలయాల్లో సంస్థలందును, సాంఘిక జీవితమందును హిందువులకును తదితరులకును ప్రత్యేక స్థానములు ఏర్పాటు కూడదు.

### 2. అస్పృశ్యతా నివారణము

హిందూదేశమునకు అస్పృశ్యత శాపమువంటిది. హరిజనులను ప్రతి హిందువు తనతో సమానముగా చూచుకొని ఆదరింపవలెను.

### 3. మద్యపాన నిషేధము

లక్షలకొలది జనులు మద్యపానమునకు బానిసలై తాము నశించుటయే కాక దేశ సౌభాగ్యమునకు చేటు కలిగించుచున్నారు. మద్యపాన దుర్వ్యసనము తొలగించుటకు వైద్యులును ఇతరులును ఎక్కువగా తోడ్పడవలెను.

### 4. ఖద్దరు పరిశ్రమ

దేశస్థులందరును దినమున కొకగంటయైనను నూలు వడకుదీక్ష బూనవలెను.

### 5. గ్రామ పరిశ్రమలు

ఆర్థికంగా దేశము స్వయం పోషకంగా నుండవలెనంటే గ్రామ పరిశ్రమలన్నీ వృద్ధిపొందవలెను. దంపుడు బియ్యము మిల్లుబియ్యముకంటె ఎక్కువ ఆరోగ్యకరమని తెలిసికోవలెను. బియ్యము దంచుట, పిండి విసురుట మొదలయినవి ప్రతియింట జరుగవలసినవి. ప్రతి గ్రామంలోను కాగితము, సబ్బు, అగ్గిపెట్టెలు మొదలయినవి తయారుచేయవలెను. తోలు పరిశ్రమ, వడ్రముపని, లోహపు పనులు మొదలయినవి చాలా గ్రామములందు సాగింపనగును.

### 6. గ్రామ పారిశుద్ధ్యము

ప్రస్తుతము చాలా గ్రామములు అపరిశుభ్రముగా నున్నవి. వీటిని ఆరోగ్య సూత్రముల ననుసరించి పునర్నిర్మాణము చేయించవలసిన బాధ్యత కాంగ్రెస్ సభ్యులు వహించవలెను.

### 7. నూతన మూల విద్యావిధానము

గ్రామస్థులందరును స్వరాజ్య సంస్థలందు పనిచేయుటకును, వివేకవంతులగుటకును అలవరచుకోవలసిన విద్య ఇప్పుడున్న ప్రాథమిక విద్యాలయములవలన కలుగుట లేదు. గనుక మన ఆశయములకు అనుకూలమైన అత్యవసర విద్యావిధానము ఏర్పడవలెను.

### 8. వయోజన విద్య

ఇంతవరకును విద్యనేర్వని—చదువుట వ్రాయుట రాని పెద్దవారికి శీఘ్రకాలంలో విద్య నేర్పుటకు ఏర్పాట్లు చేయవలెను. ప్రజా వాఙ్మయము, ప్రజలకు కావలసిన ఉపన్యాసములు వృద్ధి పొందవలెను.

### 9. నారీ అభ్యుదయము

జీవితశాఖలన్నిటను స్త్రీలకు పురుషులతో సమానమైన గౌరవము, స్థానము కలిగించుటకు ఎల్లవారును లోడుపడవలెను.

### 10. ఆరోగ్య విద్య

ఆరోగ్య మూలసూత్రములు జనులందరును నేర్చుకొనవలెను. ప్రతిగ్రామమందును జాడ్యములు రాకుండు ప్రయత్నములు సాగించుటకును, వచ్చిన రోగములను నివారించుటకును యేర్పాట్లు జరుగవలెను.

### 11. మాతృభాషా జ్ఞానము

ఆంగ్లభాషను అభ్యసించి మాతృభాషలో ఉపన్యసించుట చేతకాని వారిని, మాతృభాషలోగల వాఙ్మయములో పరిచయము లేనివారిని చూచినప్పుడు మాతృభాష ద్వారా జ్ఞానము అలవరచుకొనకపోవుటవలన కలిగిన నష్టము అధికముగా గోచరమగును. అది గుర్తించి మాతృభాషా కృషి అధికముగా సాగించవలెను.

### 12. రాష్ట్రభాష

జాత్యైక్యమునకు పరస్పరాభిభాషణములకు కావలసిన హిందూస్థానీభాషను భారతీయులందరును నేర్చుకొనవలెను. నాగరిలిపిలోను ఉర్దూ లిపిలోను చదువుట వ్రాయుట నేర్చుకోవలెను.

### 13. ఆర్థిక సమానత్వము

పెట్టుబడిదారులకును కష్టపడి పనిచేయు కూలీలకు నడుమగల ఆర్థిక దురన్యాయములను రూపుమాపి పారిశ్రామికుల జీవితమును ఎక్కువ సుఖదాయకముగా చేయుట

కను, ఆర్థికముగా అందరును వృద్ధిపొందుటకు సమానమైన అవకాశములు గలవారినిగా చేయుటకును కృషి సాగించవలెను.

## 14. కర్షకాభివృద్ధి

దేశమందు కర్షకులే అధిక సంఖ్యాకులు. వారి కృషివల్లనే తక్కినవారికి ఆహారము దొరకుచున్నది. వారి సంపదయే దేశసంపద. వారికి కలుగుచున్న బాధలు తొలగించి, వారు పడుచున్న కష్టమునకు తగినఫలము వారికి లభింపజేయవలెను. వారిని రాజకీయక్లిష్ట సమస్యలలోనికి లాగవలసిన పనిలేదు. వారికి తగిన విద్యనిచ్చి వారి జీవితమునకు సౌఖ్యము కలిగించుటయే ముఖ్యమయినపని.

## 15. కార్మిక సంస్కరణము

అహమ్మదాబాదు కార్మిక సమాఖ్యను ఆదర్శముగా పెట్టుకొని భారతదేశ కార్మికులందరును పనిచేయవలసియున్నది. ఆ సమాఖ్య పవిత్రమైనది, స్వచ్ఛమైనది, అహింసాత్మకమయినది. వారికి స్వంత చికిత్సాలయములు, వారి పిల్లలకు కావలసిన విద్యాలయములు, వయోజన విద్యాభివృద్ధికి కావలసిన ఏర్పాట్లు, స్వంత ముద్రణాలయములు, ఖాదీ వస్త్రాలయములు, ప్రత్యేక వసతిగృహములు తక్కిన సౌకర్యములు అన్నీ ఉన్నవి. ఇంచుమించుగా కార్మికులందరును వోటరులు,—ఎన్నికలలో వోటు ఇచ్చే అధికారము గలవారు. ఎన్నికలలో అభ్యర్థులను గెలిపించగలరు, ఓడించగలరు. వారికి దేశౌన్నత్యమునకు అనుకూలించు ఆశయములను తెలియజేయవలెను. కార్మికులందరును అహమ్మదాబాదు కార్మికులవలెనే ఆచరించవలెనని కోరిక.

## 16. ఆదిమనివాసుల జీవనాభివృద్ధి

ఆదిమనివాసులనగా భిల్లులు, కోందులు, సంతాలులు మొదలయిన కొండ జాతులవారు, అనాదిగా దేశమందున్నవారు. క్రమముగా నాగరికతలో వెనుకబడినవారు. భారతదేశములో వీరు రెండుకోట్లమంది ఉన్నారు. వీరి జీవిత భాగ్యమును అభివృద్ధి పరచుట సైతము నిర్మాణ కార్యక్రమములో చేర్చుకొదగిన అంశము.

## 17. కుష్టురోగ నివారణ

భారతదేశములో కుష్టురోగులసంఖ్య అమితముగానున్నది. ఒక్క ఆఫ్రికా ఖండ మందలి మధ్యభాగములో తప్ప ప్రపంచములో మరియెక్కడను భారతదేశములో నున్నంతమంది కుష్టరోగులు లేరు, మనవారు వారియెడల తగిన శ్రద్ధ తీసుకొనలేదు. కుష్టురోగ నివారణకై చేయవలసినపని చాలా ముఖ్యమైనది. అహింసాపద్ధతి పూర్తిగా

ఫలించవలెనంటే దేశములో కుష్టురోగిగాని ముష్టివాడుగాని ఒక్కడైనా లేకుండా చేయవలెను.

## 18. విద్యార్థి శిక్షణము

నేటి విద్యార్థులే భావి భారత జాతీయ నాయకులు. గాని, వారు విద్యార్థులుగా నున్నకాలము రాజకీయవిషయములను గ్రహించవచ్చును, ఆశయములను అలవడజేసికొనవచ్చును; నాయకులయెడల భక్తి చూపించవచ్చును. నూలు వడకవలెను; సెలవుదినములలో వయోజన విద్యాభివృద్ధికి తోడ్పడవలెను; స్వదేశ వస్తువులను కొనవలెను. విదేశవస్తువులను వీలయినంతవరకు బహిష్కరింపవలెను; జాతీయ గీతములను పాడవచ్చును; అస్పృశ్యతను తొలగించుటకు తోడ్పడవలెను; మతసహిష్ణుత అలవడజేసుకొనవలెను; జాత్యైక్యమునకు పాటుపడవచ్చును; గ్రామ పారిశుధ్యమునకు గ్రామ పరిశ్రమలకు చేతనయినంత చేయవచ్చును. హిందీ భాషను నేర్చుకొనవలెను. నాగర ఉర్దూ లిపులు తెలిసికొనవలెను. ఒక్కమాటలో చెప్పవలెనంటే పైనచెప్పిన నిర్మాణ కార్యక్రమ విషయములలో వీలయినంత సాయము చేయవచ్చును. గాని, రాజకీయ కార్యరంగములోనికి దిగరాదు. తమ ఉపాధ్యాయుల శాసనములను మీరి హరతాళములను చేయరాదు. ఏ విషయములోను ఇతరులను నిర్బంధించరాదు. తాము విద్యార్థులన్నమాట మరువరాదు; విద్యాభ్యాసమునకు భంగము కలుగజేసుకొనరాదు. అయినా తుదకు స్వాతంత్ర్య సమరము సంభవించినప్పుడు మాత్రము కార్యరంగములోనికి దిగి తమ ప్రాణముల నర్పించుటకైనను సిద్ధపడవలెను. తమ సోదరీ విద్యార్థినుల యెడల తాము ఎప్పుడును మర్యాద నతిక్రమింపక సోదర ప్రేమతోను గౌరవముతోను వ్యవహరించవలెను.

# జాతీయ జ్ఞానమందిరము వారి గ్రంథములు

'కాంగ్రెసు షష్టిపూర్తి'

డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు.

'జై హింద్'

శ్రీ కొండముది గోపాలరాయ శర్మగారు.

'ప్రజా పరిషత్తు'
'మానవుల హక్కులు'

ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య గారు

'1857 భారత విప్లవం'

అశో. మెహతా.

'మౌలానా ఆజాద్'

సింగరాచార్య.

'ఆంధ్ర వీరాంగనలు'

మాగంటి బాపినీడుగారు.

'SUCCESSFUL SECRETARY'

M. BAPINEEDU

'ఇండొనీషియా'

'మనకవి రవీంద్రుడు'

'మన నాయకుడు మహాత్మాజీ'.

'నేటి రాజకీయ తత్వాలు'